CELEBRATING 11TH YEAR ANNIVERSARY

ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి

11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 69 పేజీలు :12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు శనివారం 15 నవంబర్ 2025 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 69 PAGES :12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE SAT 15 NOVEMBER 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


# ఏపీలో త్వరలో డ్రోన్ ట్యాక్సీలు...

## గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా నవ్యాంధ్రప్రదేశ్

- ఏపీలో కొత్త శకం... డ్రోన్, స్పేస్ సిటీలకు చంద్రబాబు, పీయూష్ గోయల్ శంకుస్థాపన
- ఏపీని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా తీర్చిదిద్దుతున్నాం
- విశాఖలో సీఐఐ సదస్సు వేదికగా చారిత్రాత్మక ఘట్టం
- రాష్ట్రంలో డ్రోన్ సిటీ, ట్విన్ స్పేస్ సిటీలకు వర్చువల్ శంకుస్థాపన
- కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులు
- చంద్రబాబు దార్శనికతను కొనియాడిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్
- ఓర్వకల్లులో 300 ఎకరాల్లో డ్రోన్ సిటీ నిర్మాణం
- ఈ ప్రాజెక్టులతో భారీగా పెట్టుబడులు, ఉద్యోగావకాశాలు






పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏరోస్పేస్, అంతరిక్ష రంగా ల్లో చారిత్రాత్మక ముందడుగు వేసింది. దేశంలోనే తొలిసారిగా ఏర్పాటు కానున్న 'డ్రోన్ సిటీ', 'ట్విన్ స్పేస్ సిటీస్' ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర వాణిజ్య–పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ శుక్రవారం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు ఈ కార్యక్రమానికి వేదికైంది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రులు టీజీ భారత్, బీసీ జనార్ధన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేవీస్ విజయానంద్, ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ సతీష్ రెడ్డి, ఇస్రో ఛైర్మన్ ఎస్ సోమనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, డ్రోన్, స్పేస్ సిటీలకు శంకుస్థాపన చేసుకోవడం రాష్ట్ర చరిత్రలో ఒక మైలురాయి అని అభివర్ణించారు. "సాంకేతికతలో 'ఫస్ట్ మూవర్స్ అడ్వాంటేజ్'ను అందిపుచ్చుకోవడంలో మేం ఎప్పుడూ ముందుంటాం. ఇప్పటికే క్వాంటం వ్యాలీని జనవరిలో ప్రారంభించబోతున్నాం, రాష్ట్రాన్ని గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నాం. ఇప్పుడు ఈ రెండు ప్రాజెక్టులతో మరో ముందడుగు వేశాం. త్వరలోనే రాష్ట్రంలో డ్రోన్ ట్యాక్సీలను అందుబాటులోకి తెస్తాం. ఇందుకు అవసరమైన డ్రోన్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తే, వీటిని మరింత వేగంగా, అద్భుతంగా తీర్చిదిద్దుతాం" అని చంద్రబాబు తెలిపారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతను ప్రశంసించారు. "ఒకప్పుడు దేశంలో ఐటీకి గుర్తింపు లేని సమయంలోనే దాని భవిష్యత్‌ను ఊహించి, అవకాశాలను అందిపుచ్చుకున్న ఘనత చంద్రబాబుది. ఇప్పుడు డ్రోన్లు, స్పేస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం టెక్నాలజీ వంటి భవిష్యత్ రంగాల్లో కూడా ఆయన ముందున్నారు.

వివరాలు 2లో..

# బీహార్ ఎన్నికల్లో ఎన్డీఏ విజయభేరి



- బిహార్ ప్రజలు అన్ని రికార్డులు బద్దలుకొట్టారు
- బీహార్ ఎన్నికల ఫలితాలపై మోదీ, నితీశ్, జైశంకర్ ఏమన్నారంటే...!

- ప్రజలు అద్భుత తీర్పు ఇచ్చారన్న మోదీ
- వికసిత్ భారత్‌పై విశ్వాసం పెట్టుకున్నారన్న అమిత్ షా
- కూటమి ప్రభుత్వం పట్ల విశ్వాసంతో ప్రజలు గెలిపించారన్న జైశంకర్

పెన్ పవర్ డెస్క్:బీహార్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధించడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తదితరులు 'ఎక్స్' వేదికగా స్పందించారు. రాష్ట్ర ప్రజలు అద్భుతమైన తీర్పు ఇచ్చారని ప్రధానమంత్రి మోదీ పేర్కొన్నారు. బీహార్‌లో సుపరిపాలన, అభివృద్ధి గెలిపించాయని అన్నారు. బీహార్ అభివృద్ధికి నూతన సంకల్పంతో పని చేసేందుకు ఈ చారిత్రక విజయం మరింత శక్తినిస్తుందని అన్నారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ప్రధాని మోదీ తన సందేశాన్ని పంచుకున్నారు. "సుపరిపాలన విజయం సాధించింది. అభివృద్ధి విజయం సాధించింది. ప్రజా సంక్షేమ స్ఫూర్తి విజయం సాధించింది. సామాజిక న్యాయం విజయం సాధించింది" అని ఆయన పేర్కొన్నారు.

వివరాలు 2లో..

### బీహార్ లో కమలం హవా

**92 బీజేపీ**

**81 జేడీయూ**

- క్లీన్ స్వీప్ చేసిన ఎన్డీఏ కూటమి
- ఏకంగా 200 సీట్లకు పైగానే ఆధిక్యత
- మహాఘట్ బంధను షాక్
- 35 స్థానాల్లో మాత్రమే లీడ్
- తేజస్వీతో సహా టాప్ లీడర్ల వెనుకంజ
- నితీష్ కుమార్ మంత్రులు ముందంజలో
- ఏ దశలోనూ ఎన్డీఏకి పోటీ ఇవ్వని మహాఘట బంధన్
- సీమాంచల్లో జేడీయూకి షాక్
- అన్ని స్థానాల్లో ఎన్డీఏ కూటమిదే హవా

## 'యాక్షన్ టెసా'కు మంత్రి లోకేశ్ ఆఫర్... ఏపీలో తయారీ యూనిట్



వివరాలు 2లో..

- యాక్షన్ టెసా సీఈవో వివేక్ జైన్‌తో మంత్రి నారా లోకేశ్ భేటీ
- విశాఖలో జరుగుతున్న సీఐఐ సమ్మిట్‌లో కీలక చర్చలు
- ఏపీలో తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని లోకేశ్ ఆహ్వానం
- సెకండరీ ఎండిఎఫ్ యూనిట్‌పై మంత్రి ప్రతిపాదన
- ప్రభుత్వ ప్రతిపాదనను పరిశీలిస్తామన్న కంపెనీ సీఈవో
- దేశంలోనే ప్రముఖ ఇంజనీర్డ్ కలప తయారీ సంస్థ యాక్షన్ టెసా

## జానపద గాయకురాలి నుంచి ఎమ్మెల్యేగా..

### అతిచిన్న వయస్సులో అలీ నగర్ నుంచి గెలిచిన మైథిలీ ఠాకూర్



వివరాలు 2లో..

- సమీప ఆర్జేడీ అభ్యర్థి బినోద్ మిశ్రాపై 11 వేల పైచిలుకు ఓట్ల తేడాతో గెలుపు
- గెలుపు అలీ నగర్ ప్రజలదేనన్న మైథిలీ ఠాకూర్
- బీజేపీ పట్ల ప్రజలు విశ్వాసం ఉంచారన్న మైథిలీ ఠాకూర్

### బీహార్ ఫలితాలు నిజంగా ఆశ్చర్యపరిచాయి..

## అందుకే మేం ఓడిపోయాం

- బీహార్ ఎన్నికలు మొదటి నుంచి న్యాయంగా జరగలేదన్న రాహుల్ గాంధీ
- రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాడుతున్నామన్న కాంగ్రెస్ నేత
- బీహార్‌లో 61 స్థానాల్లో పోటీ చేసి 6 స్థానాల్లో గెలిచిన కాంగ్రెస్



పెన్ పవర్ డెస్క్:బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. బీహార్‌లో ఫలితాలు ఆశ్చర్యకరంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. బీహార్ ఎన్నికలు మొదటి నుంచి న్యాయంగా జరగలేదని ఆయన ఆరోపించారు. ఈ కారణంగానే తమ పార్టీ ఓటమి పాలైందని తెలిపారు. రాజ్యాంగం,

వివరాలు 2లో..

## "టైగర్ అభీ జిందా హై"...

### తిరుగులేని విజయంతో విమర్శకుల నోళ్లు మూయించిన నితీశ్ కుమాం



- బీహార్ ఎన్నికల కౌంటింగ్‌లో ఎన్డీఏ ఘన విజయం
- "టైగర్ అభి జిందా హై" నినాదాన్ని నిజం చేసిన ఫలితాల సరళి
- ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నాయకత్వానికే ప్రజల పట్టం
- విమర్శలను తిప్పికొట్టి తన రాజకీయ పట్టు నిలుపుకున్న నితీశ్
- 'జంగిల్ రాజ్' నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించిన నేతగా చెరగని ముద్ర

వివరాలు 2లో..

## పరకామణి కేసు ఫిర్యాదుదారు సతీశ్ కుమార్ ది హత్యే...

### డాక్టర్ల ప్రాథమిక నిర్ధారణ



- పోస్టుమార్టంలో వెలుగులోకి వచ్చిన కీలక నిజాలు
- తల వెనుక గొడ్డలితో నరికినట్లు గుర్తింపు
- శరీరంలో పలుచోట్ల విరిగిన ఎముకలు
- దర్యాప్తు కోసం 12 ప్రత్యేక పోలీసు బృందాల ఏర్పాటు
- తాడిపత్రి సమీపంలో రైలు పట్టాలపై లభ్యమైన మృతదేహం

వివరాలు 2లో..

# అభివృద్ధికి మార్గాలు ఇవే




పెన్ పవర్ డెస్క్:పెట్టుబడులు, నూతన ఆవిష్కరణలు, భాగస్వామ్యాలే రాష్ట్ర అభివృ ద్ధికి మూలస్తంభాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. విశాఖపట్నంలో జరుగుతున్న 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారంభ ప్లీనరీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సీఐఐ భాగస్వామ్య సదస్సును కేవలం పెట్టుబడుల కోసం మాత్రమే చూడొద్దని నెట్వర్కింగ్ కోసం, మేధోపరమైన చర్చల కోసం, ఆవిష్కరణల కోసం ఏర్పాటు చేశామని అన్నారు. సౌదీ, రష్యా, యూకే, ఆస్ట్రేలియా, జర్మనీ, శ్రీలంక, జపాన్, కెనడా తదితర దేశాల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరు కావటం సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. పరస్పరం పెట్టుబడుల భాగస్వామ్యంతోనే

వివరాలు 2లో..

- విశాఖపట్నంలో 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సు
- అభివృద్ధికి పెట్టుబడులు, ఆవిష్కరణలే కీలకమన్న సీఎం చంద్రబాబు
- పరిశ్రమల ఏర్పాటుకు 50 వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్
- ప్రకృతి వ్యవసాయం, ఆక్వా రంగాల్లో ఏపీకి అగ్రస్థానం
- గ్లోబల్ బ్రాండ్‌గా గుర్తింపు పొందిన అరకు కాఫీ
- కేంద్రంలో సుస్థిర ప్రభుత్వం పెట్టుబడులకు అనుకూలం అని వెల్లడి

## ఎడిటర్ వ్యూ

# పవన్ దూకుడు.. ఫలితం త్వరలోనే.. !

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. పలు అంశాలపై నిశితంగా దృష్టి పెడుతున్నారు. తన శాఖలకు సంబంధించే కాకుండా.. తన పార్టీకి చెందిన కందుల దుర్గేష్, నాదెండ్ల మనోహర్ శాఖలకు సంబంధించి కూడా ఆయన పర్యవేక్షణ చేస్తున్నారు. ఆయా శాఖల్లో జరుగుతున్న పరిణామాలు.. వెలుగు చూస్తున్న అ క్రమాలపై పవన్ ఓ కన్నేస్తున్నారు. ఈ క్రమంలోనే బియ్యం అక్రమ రవాణా సహా.. అటవీ సంపద అక్ర మాలు.. పంచాయతీ నిధులు వంటివాటిపై దృష్టి పెట్టారు.గతంలో బియ్యం అక్రమ రవాణాపై పవన్ ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ముఖ్యంగా కాకినాడ పోర్టు నుంచి రేషన్ బియ్యం తరలి పోకుండా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. అదేసమయంలో రేషన్ మాఫియా పై ఉక్కుపాదం మోపుతున్నట్టు కూడా ప్రకటించారు. ఇక, ఇప్పుడు అటవీ సంపద, భూములు, ముఖ్యంగా ఎర్రచందనం వంటి వాటిని సీరియస్‌గా తీసుకున్నారు. అయితే.. ఇక్కడే పలు సందేహాలు తెరమీదికి వస్తున్నాయి. పవన్ ఇప్పటి వరకు ఆగ్రవేశాలు ప్రదర్శించినా.. వాటి లో రిజల్ట్ మాత్రం కనిపించలేదు.ఇదీ.. ఇప్పుడు జరుగుతున్న చర్చ. తాజాగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కార్నర్ చేస్తున్నారన్న వాదన వైసీపీ నుంచి వినిపిస్తున్న నేపథ్యంలో పవన్ ఇప్పటి వరకు తీసుకున్న నిర్ణయాలు.. ఇచ్చిన ఆదేశాలతో ఏమేరకు సక్సెస్ అయ్యారన్నది ప్రశ్న. అయితే..గతంలో సోషల్ మీడియాపై ఉక్కుపాదం మోపి.. పోసాని కృష్ణ మురళి సహా అనేక మందిని లైన్‌లోకి తీసుకువచ్చినట్టే.. ఇప్పుడు కూడా అదే తరహాలో అక్రమార్కు లకు చెక్ పెడతారని జనసేన వర్గాలు చెబుతున్నాయి.అదేవిధంగా రేషన్ అక్రమాలకు సంబంధించిమాజీ మంత్రి పేర్ని నాని కుటుంబంపై కూడా అప్పట్లో చ ర్యలు తీసుకున్నారు. దీంతో కృష్ణాజిల్లాలో అక్రమాలు దారిలో పడ్డాయి. ఇలానే ఇప్పుడు దృష్టి పెట్టిన సమస్యలు కూడా పరిష్కారం అవుతాయని పరిశీలకులు చెబుతున్నారు. ఇతర నేతల మాదిరిగా పవన్ తొందర పడే మనస్తత్వం లేదని. ముందుగా అధ్యయనం చేసి.. నెమ్మదిగా కార్యాచరణను ప్రారంభిస్తారని అంటున్నారు. చివరకు అక్రమార్కులకు చుక్కలు చూపించడం ఖాయమని జనసేన వర్గాలు చెబుతున్నాయి.

### బీహార్ ఫలితాలు నిజంగా ఆశ్చర్యపరిచాయి..
## అందుకే మేం ఓడిపోయాం

- మొదటి పేజి తరువాయి

ప్రజాస్వామ్య పరిరక్షణకు తాము పోరాడుతున్నామని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈ ఫలితాలను సమీక్షిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇది రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి జరుగుతున్న పోరాటమని ఆయన వ్యాఖ్యానించారు. మహాఘట్‌బంధన్‌పై విశ్వాసం ఉంచి ఓటు వేసిన ఓటర్లకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ-జేడీయూ కూటమి 200కు పైగా స్థానాలు గెలుచుకోగా, ఆర్జేడీ-కాంగ్రెస్ నేతృత్వంలోని మహాఘట్‌బంధన్ 34 సీట్లకు పరిమితమైంది. కాంగ్రెస్ పార్టీ 61 స్థానాల్లో పోటీ చేసి 6 స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. బీహార్‌లో కాంగ్రెస్ పార్టీకి ఇది రెండో అత్యంత దారుణ ఓటమి. 2010లో కాంగ్రెస్ పార్టీ 4 స్థానాలు మాత్రమే గెలుచుకుంది.

# బీహార్ ఎన్నికల్లో ఎన్డీఏ విజయభేరి

- మొదటి పేజి తరువాయి

"రాబోయే కాలంలో బీహార్ అభివృద్ధి కోసం మరింత చురుకుగా పనిచేస్తాం. రాష్ట్ర మౌలిక సదుపాయాలకు, సంస్కృతికి కొత్త గుర్తింపును అందిస్తాం. ఇక్కడి యువ శక్తి, మహిళా శక్తికి ఉజ్వల భవిష్యత్తు కోసం తగిన అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇస్తున్నాను" అని మోదీ తెలిపారు.ఎన్డీయేకు ఈ చారిత్రక విజయాన్ని అందించిన బీహార్ ప్రజలకు ప్రధాని మోదీ ప్రగాఢ కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రజా తీర్పు, ప్రజలకు సేవ చేయడానికి, బీహార్ కోసం కొత్త సంకల్పంతో పనిచేయడానికి తమకు మరింత శక్తినిస్తుందని అన్నారు. ఈ విజయం వెనుక ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కృషి ఎంతో ఉందని ప్రశంసించారు. "ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ జీకి, ఎన్డీయే కుటుంబ సహచరులైన చిరాగ్ పాశ్వాన్ జీ, జితన్ రామ్ మాంఝీ జీ, ఉపేంద్ర కుష్వాహా జీలకు ఈ అద్భుత విజయానికి నా హృదయపూర్వక అభినందనలు" అని ఆయన పేర్కొన్నారు.అదేవిధంగా, ప్రతిపక్షాలు ప్రచారం చేసిన ప్రతీ అబద్ధాన్ని గట్టిగా తిప్పికొడుతూ, తమ అభివృద్ధి అజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లిన ఎన్డీయే కార్యకర్తల అవిశ్రాంత శ్రమ వల్లే ఈ విజయం సాధ్యమైందని మోదీ అన్నారు. ప్రతి కార్యకర్తను హృదయపూర్వకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు.

ఇక, వికసిత్ భారత్‌పై విశ్వాసం పెట్టుకున్న ప్రతి ఒక్కరి విజయమిదని అమిత్ షా పేర్కొన్నారు. జంగల్ రాజ్, బుజ్జగింపు రాజకీయాలు చేసేవారు ఏ వేషంలో వచ్చినా వారికి దోచుకునే అవకాశం లభించదని పేర్కొన్నారు.

బీహార్ ఎన్నికల్లో ప్రజలు ఎన్డీయే కూటమికి చారిత్రాత్మక తీర్పు ఇచ్చారని కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. అపూర్వ విజయం సాధించిన నేపథ్యంలో ఆయన మోదీ, నితీశ్ తదితరులకు అభినందనలు తెలియజేశారు. డబుల్ ఇంజిన్ సర్కార్ సారథ్యంలోనే బీహార్‌లో సుపరిపాలన, అభివృద్ధి కొనసాగుతుందని అన్నారు.మోదీ, నితీశ్ ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమ విధానాలపై ప్రజల నమ్మకానికి ఈ విజయం నిదర్శనమని జేపీ నడ్డా పేర్కొన్నారు. జంగల్ రాజ్, అవినీతిని రాష్ట్ర ప్రజలు తిప్పికొట్టారని అన్నారు. సుపరిపాలన, సుస్థిరత, అభివృద్ధికి ఓటు వేశారని అన్నారు.అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం పట్ల విశ్వాసంతో ప్రజలు అఖండ మెజారిటీతో గెలిపించారని బీహార్ ముఖ్యమంత్రి, జేడీయూ అధినేత నితీశ్ కుమార్ పేర్కొన్నారు. తమకు అపూర్వ విజయాన్ని అందించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికల్లో మద్దతుగా నిలిచిన ప్రధానమంత్రి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అందరి మద్దతుతో బీహార్ మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు.

### 'యాక్షన్ టెసా'కు మంత్రి లోకేశ్ ఆఫర్...
# ఏపీలో తయారీ యూనిట్

ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ప్రముఖ ఇంజనీర్డ్ కలప ప్యానెల్ తయారీ సంస్థ 'యాక్షన్ టెసా'ను రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆహ్వానించారు. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో మంత్రి నారా లోకేశ్, యాక్షన్ టెసా ఎండీ, సీఈవో వివేక్ జైన్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏపీలో తయారీ యూనిట్ ఏర్పాటుకు గల అవకాశాలను లోకేశ్ వివరించారు.రాష్ట్రంలో సెకండరీ లేదా శాటిలైట్ ఎండీఎఫ్ (మీడియం డెన్సిటీ ఫైబర్‌బోర్డ్) తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి లోకేశ్ సూచించారు. "ప్రస్తుతం ఉత్తరాఖండ్‌లోని సితార్‌గంజ్‌లో ఉన్న మీ ప్రధాన తయారీ కేంద్రం 7.5 లక్షల క్యూబిక్ మీటర్ల సామర్థ్యంతో పనిచేస్తోంది. ఏపీలో మరో యూనిట్ ఏర్పాటు చేస్తే, పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా అదనపు తయారీకి మద్దతు లభిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు.

మంత్రి లోకేశ్ ప్రతిపాదనపై వివేక్ జైన్ సానుకూలంగా స్పందించారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను తప్పకుండా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తమ సంస్థ కార్యకలాపాలను వివరిస్తూ.. ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న తమ సంస్థలో ప్రస్తుతం 2,846 మంది ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. 2018లో ఏడో తరం కాంటిరోల్ టెక్నాలజీని, ఉత్పత్తి వైవిధ్యం కోసం డోమ్ టెక్నాలజీని ప్రవేశపెట్టినట్లు వివరించారు. 1970లలో ప్రారంభమైన యాక్షన్ టెసా సంస్థ ఇంజనీర్డ్ కలప ఉత్పత్తులతో పాటు పాదరక్షలు, ఎలక్ట్రానిక్స్, రియల్ ఎస్టేట్ వంటి పలు రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. 2025లో రూ.4,865 కోట్ల వార్షిక రెవిన్యూ సాధించిన ఈ సంస్థకు దేశవ్యాప్తంగా విస్తృతమైన నెట్‌వర్క్ ఉంది.

# ఏపీలో త్వరలో డ్రోన్ ట్యాక్సీలు...

- మొదటి పేజి తరువాయి

దేశంలోనే తొలిసారిగా డ్రోన్, స్పేస్ సిటీలను నెలకొల్పిన ఘనత ఆయనకే దక్కుతుంది. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు కలిసికట్టుగా దేశం కోసం, రాష్ట్రం కోసం పనిచేస్తున్నారు" అని కొనియాడారు.

**డ్రోన్ సిటీ ప్రత్యేకతలు**

కర్నూలు జిల్లా ఓర్వకల్లులో 300 ఎకరాల విస్తీర్ణంలో ఈ డ్రోన్ సిటీ నిర్మాణం కానుంది. అంతర్జాతీయ స్థాయిలో డ్రోన్ల డిజైన్, తయారీ, సేవలు, పరిశోధన-అభివృద్ధి (%=డఐ%) కేంద్రంగా దీనిని తీర్చిదిద్దనున్నారు. ఇక్కడ అధునాతన తయారీ పార్కులు, టెస్టింగ్, సర్టిఫికేషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తారు. 25,000 మందికి రిమోట్ పైలట్ శిక్షణ ఇస్తారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 40,000కు పైగా ఉద్యోగాలు లభిస్తాయని అంచనా. దీనికోసం రాష్ట్రవ్యాప్తంగా 50 సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను కూడా ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వం పరిశ్రమలకు 20% క్యాపిటల్ సబ్సిడీ, 100% ఎస్‌జీఎస్‌టీ రాయితీ వంటి ప్రోత్సాహకాలను అందిస్తోంది. ఈ సిటీలో పెట్టుబడులకు అల్గోబోటిక్స్, అకిన్ అనలిటిక్స్, సెన్సెల్మేజ్, ఏర్వేస్ ఇండస్ట్రీస్ వంటి సంస్థలు ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి.

**ట్విన్ స్పేస్ సిటీస్ వివరాలు**

శ్రీ సత్యసాయి, తిరుపతి జిల్లాల్లో దేశంలోనే తొలిసారిగా 'ట్విన్ స్పేస్ సిటీస్' ఏర్పాటు కానున్నాయి. భారత అంతరిక్ష రంగంలో ప్రైవేట్ పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంచడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఉపగ్రహాల ప్రోటోటైప్ తయారీ, స్పేస్ టెక్ స్టార్టప్‌ల కోసం ఇంక్యుబేషన్ సెంటర్లు, ఉపగ్రహ విడిభాగాల తయారీ, లాంచ్ లాజిస్టిక్స్ సపోర్ట్ వంటి అంశాలకు ఇక్కడ ప్రాధాన్యత ఇస్తారు. రాబోయే 10 ఏళ్లలో ఈ స్పేస్ సిటీ ద్వారా రూ.25,000 కోట్ల పెట్టుబడులు, 35,000కు పైగా ఉద్యోగాలు వస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. 'ఏపీ స్పేస్ పాలసీ 4.0'లో భాగంగా రూ.100 కోట్లతో ప్రత్యేక 'స్పేస్ టెక్ ఫండ్'ను కూడా ఏర్పాటు చేశారు. బ్లూ స్పేస్, ఎథర్నల్ ఎక్స్‌ప్లోరేషన్ గిల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలతో ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. ఈ రెండు ప్రాజెక్టులు 'స్వర్ణాంధ్ర 2047' విజన్ లక్ష్యాల సాధనలో కీలకం కానున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# అభివృద్ధికి మార్గాలు ఇవే

- మొదటి పేజి తరువాయి

అభివృద్ధి సాధించగలమనే విషయాన్ని గుర్తించాలని సీఎం కోరారు. సింగపూర్ చాలా చిన్న దేశమైనా అమరావతి మాస్టర్ ప్లాన్ రూపొందించి ఇచ్చిందని తెలిపారు.

**ఏపీ ప్రకృతిసాగులో అగ్రస్థానం... పర్యాటక రంగంలో పెట్టుబడులకు అనుకూలం**

ఆర్గానిక్ ఉత్పత్తిగా అరకు కాఫీ గ్లోబల్ బ్రాండ్‌గా ఎదిగిందని, ఆక్వా ఉత్పత్తులు, ప్రకృతి వ్యవసాయంలోనూ ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉందని సీఎం వివరించారు. "ఖనిజాలు, రేర్ ఎర్త్ మినరల్స్ విషయంలో కొత్త టెక్నాలజీలతో పని చేసే సంస్థలతో భాగస్వాములయ్యేందుకు ఏపీ సిద్ధంగా ఉంది. ఏపీలోని సుదీర్ఘ తీరప్రాంతం, గండికోట, అరకు లాంటి ప్రకృతి అందాలు పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి అనుకూలమైన ప్రదేశాలు. అలాగే కొత్తగా భారతీయ రుచులకు సంబంధించిన రంగాల్లోనూ విస్తృత అవకాశాలు వినియోగించుకోవచ్చు.

ఏపీలోని వివిధ ప్రాంతాల్లోని సంప్రదాయాలు, చేతివృత్తులను ప్రోత్సహించేందుకు ఎక్స్ పీరియన్స్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నాం. డేటా లేక్, రియల్ టైమ్ డేటా ద్వారా త్వరితగతిన నిర్ణయాలు తీసుకోగలుగుతున్నాం. సాంకేతికత సాయంతో అతి తక్కువ నష్టంతోనే ప్రకృతి విపత్తులను సమర్థంగా ఎదుర్కొంటున్నాం. నూతన ఆవిష్కరణలు, యువతకు నైపుణ్యాల కోసం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేశాం" అని ముఖ్యమంత్రి వివరించారు.

**అందుబాటులో 50 వేల ఎకరాలు**

ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలు, ప్రాజెక్టుల ఏర్పాటు కోసం 50 వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్ అందుబాటులో ఉంచామని సీఎం చంద్రబాబు అన్నారు.

మానవాళి సంక్షేమం కోసం అంతా కలిసి పనిచేద్దామని దేశవిదేశాలకు చెందిన ప్రతినిధులకు, పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు. భారతదేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో సుస్థిరమైన ప్రభుత్వం ఉందని అన్నారు. బీహార్ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో ఎన్డీఏ మళ్లీ విజయం సాధించిందని, ఎన్డీఏపై నమ్మకం ఉంచిన ప్రజలకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. ఈ సదస్సుకు ఆర్మేనియా, సింగపూర్, మారిషస్, నేపాల్, అంగోలా, వెనిజులా దేశాలకు చెందిన మంత్రులు యూఎన్ఓ ప్రతినిధులు కూడా హాజరయ్యారు.

### పరకామణి కేసు ఫిర్యాదుదారు
## సతీశ్ కుమార్ ది హత్యే... డాక్టర్ల ప్రాథమిక నిర్ధారణ

తిరుమల శ్రీవారి ఆలయ పరకామణి కేసులో ఫిర్యాదుదారుడైన సతీశ్ కుమార్ మృతి కేసులో మిస్టరీ వీడింది. ఆయనది ప్రమాదవశాత్తు మరణం కాదని, పక్కా హత్యేనని వైద్యులు ప్రాథమికంగా నిర్ధారించారు. సతీశ్ తల వెనుక భాగంలో గొడ్డలి వంటి పదునైన ఆయుధంతో నరికి చంపినట్లు పోస్టుమార్టంలో తేలింది. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

అనంతపురం జిల్లా కలెక్టర్ ప్రత్యేక అనుమతితో అనంతపురం సర్వజన ఆసుపత్రిలో సతీశ్ కుమార్ మృతదేహానికి శుక్రవారం శవపరీక్ష నిర్వహించారు. ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో సీటీ స్కాన్ కూడా చేశారు. పోస్టుమార్టంలో సతీశ్ శరీరంలోని పలుచోట్ల ఎముకలు విరిగిపోయినట్లు, తీవ్ర గాయాలున్నట్లు వైద్యులు గుర్తించారు. తెల్లవారుజామున 2 నుంచి 4 గంటల మధ్య ఆయన మృతి చెంది ఉండవచ్చని అంచనా వేశారు.పరకామణి కేసు విచారణకు హాజరయ్యేందుకు సతీశ్ కుమార్

గురువారం రాత్రి గుంతకల్‌లో రైలు ఎక్కారు. అయితే, అనూహ్యంగా తాడిపత్రి సమీపంలోని రైలు పట్టాల పక్కన ఆయన శవమై కనిపించడం కలకలం రేపింది. విషయం తెలుసుకున్న అనంతపురం జిల్లా ఎస్పీ జగదీశ్ స్వయంగా దగ్గరుండి పోస్టుమార్టం ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ కేసును ఛేదించేందుకు 12 ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. సతీశ్ కుమార్ ఫోన్ ను విజయవాడ ఫోరెన్సిక్ ల్యాబ్ కు పంపారు.గతంలో టీటీడీ అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ గా పనిచేసిన సతీశ్ కుమార్ ప్రస్తుతం గుంతకల్లులో జీఆర్ పీ ఇన్ స్పెక్టర్ గా పనిచేస్తున్నారు.

# "టైగర్ అభీ జిందా హై"...

బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ముందు పాట్నాలోని జనతాదళ్ (యునైటెడ్) కార్యాలయం వెలుపల వెలసిన ఓ భారీ పోస్టర్ అందరి దృష్టిని ఆకర్షించింది. "టైగర్ అభీ జిందా హై" (పులి ఇంకా బతికే ఉంది) అన్నదే దాని సారాంశం. శుక్రవారం ఓట్ల లెక్కింపు ప్రారంభమై, ఫలితాల సరళి వెలువడుతున్న కొద్దీ ఆ నినాదం కేవలం ప్రచారం కోసం కాదని, బీహార్ రాజకీయాల్లో ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ చెక్కుచెదరని శక్తికి నిదర్శనమని స్పష్టమవుతోంది.ఎన్నికల సంఘం వెల్లడిస్తున్న ట్రెండ్స్ ప్రకారం, ఎన్డీఏ కూటమి స్పష్టమైన ఆధిక్యంతో దూసుకుపోతోంది. మొత్తం 243 స్థానాలున్న అసెంబ్లీలో, మ్యాజిక్ ఫిగర్ 122 కాగా, ఎన్డీఏ మధ్యాహ్నం 2:30 గంటల సమయానికే 200కు పైగా స్థానాల్లో ఆధిక్యంలో నిలిచింది. ఈ భారీ ఆధిక్యం కేవలం కూటమి లెక్కలనే కాకుండా, బీహార్‌లో ఎన్డీఏకు నితీశ్ కుమారే అసలైన గుర్తింపు అనే వాస్తవాన్ని మరోసారి రుజువు చేసింది.

**'జంగిల్ రాజ్' నుంచి సుపరిపాలన వైపు..**

1951లో పాట్నా జిల్లాలోని భక్తియార్‌పూర్‌లో ఓ సాధారణ కుటుంబంలో నితీశ్ కుమార్ జన్మించారు. ఆయన తండ్రి కవిరాజ్ రామ్ లఖన్ సింగ్ ఆయుర్వేద వైద్యుడు, స్వాతంత్ర్య సమరయోధుడు. బిహార్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (ప్రస్తుతం ఎన్ఐటీ పాట్నా) నుంచి ఇంజినీరింగ్ పట్టా పొందిన ఆయన, జేపీ ఉద్యమం స్ఫూర్తితో సోషలిస్టు రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. కేంద్ర మంత్రిగా పలు శాఖలు నిర్వహించి, చివరకు బిహార్ ముఖ్యమంత్రిగా తనదైన ముద్ర వేశారు.నితీశ్ పాలన గురించి చెప్పాలంటే, 2005కు ముందు రాష్ట్రాన్ని పట్టిపీడించిన 'జంగిల్ రాజ్'ను ప్రస్తావించాల్సిందే. లాలూ ప్రసాద్ యాదవ్ పాలనలో (1990–2005) బీహార్ అరాచకానికి, కుల ఘర్షణలకు, రాజకీయ నేరాలకు కేంద్రంగా మారింది. "భూరాబల్ సాఫ్ కరో" (భూమిహార్, రాజ్‌పుత్, బ్రాహ్మణ, లాలా అనే నాలుగు అగ్ర కులాలను తుడిచిపెట్టండి) వంటి నినాదాలు ఆ కాలంలోనే పుట్టుకొచ్చాయి. అలాంటి భయానక వాతావరణం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించి, శాంతిభద్రతలను నెలకొల్పిన ఘనత నితీశ్‌కే దక్కుతుందని విశ్లేషకులు చెబుతారు.

**విమర్శలను తట్టుకుని..**

"శారీరకంగా అలసిపోయారు, మానసికంగా రిటైర్ అయ్యారు" అంటూ జన్ సూరజ్ పార్టీ నేత ప్రశాంత్ కిశోర్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వంటి వారు నితీశ్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఆయన బీజేపీకి కేవలం ఒక 'మాస్క్'గా మిగిలిపోయారని ఆరోపించారు. అయితే ఈ ఎన్నికల ఫలితాలు ఆ విమర్శలను పటాపంచలు చేశాయి. మహిళలు రికార్డు స్థాయిలో ఓటింగ్‌లో పాల్గొనడం (తొలి దశలో 69%, రెండో దశలో 74%), ఈబీసీ/మహాదళితుల వంటి బలమైన సామాజిక వర్గాలు ఆయన వెంటే నిలవడం నితీశ్ గెలుపులో కీలక పాత్ర పోషించాయి.

2016లో సంపూర్ణ మద్యపాన నిషేధం, మహిళా విద్యకు ప్రోత్సాహం, రహదారుల నిర్మాణం, గ్రామీణ సేవలు, సంక్షేమ పథకాలు వంటివి ఆయన పాలనకు బలాన్నిచ్చాయి. తన రాజకీయ ప్రయాణంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశారు. బీజేపీతో పొత్తు, ఆ తర్వాత విడిపోవడం, 2014 లోక్‌సభ ఎన్నికల్లో కేవలం రెండు సీట్లకే పరిమితమవడం వంటివి ఆయనకు ఎదురుదెబ్బలే. అయినా తన రాజకీయ చాతుర్యంతో మళ్లీ నిలదొక్కుకుని రికార్డు స్థాయిలో 9వ సారి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు.ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమిలో జేడీ(యూ) కన్నా బీజేపీ ఎక్కువ స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది. ఇది కూటమిలో బీజేపీ 'పెద్దన్న' పాత్ర పోషిస్తోందనడానికి సంకేతం. అయినప్పటికీ, బిహార్‌లో ఎన్డీఏ విజయానికి నితీశ్ కుమారే చోదకశక్తి అని, ఆ కూటమికి ఆయనే మస్కట్ అని ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి.

### జానపద గాయకురాలి నుంచి ఎమ్మెల్యేగా..
## అతిచిన్న వయస్సులో అలీ నగర్ నుంచి గెలిచిన మైథిలీ ఠాకూర్

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అలీనగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ప్రముఖ జానపద గాయని మైథిలీ ఠాకూర్ (25) విజయం సాధించారు. అతి చిన్న వయస్సులో ఆమె బీహార్ అసెంబ్లీకి ఎన్నికైన రికార్డు సృష్టించారు. అలీనగర్ నుంచి ఆమె తన సమీప ఆర్జేడీ అభ్యర్థి బినోద్ మిశ్రాపై 11,730 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు.తన గెలుపుపై మైథిలీ ఠాకూర్ స్పందిస్తూ, తనకు మాటలు రావడం లేదని అన్నారు. ఈ విజయం ప్రజలదేనని ఆమె పేర్కొన్నారు. అలీనగర్ నియోజకవర్గ ప్రజలు గెలిచినట్లుగా భావిస్తున్నానని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. బీజేపీ పట్ల ప్రజలు నమ్మకం ఉంచారని ఆమె తెలిపారు.మైథిలీ ఠాకూర్‌తో పాటు పాతికేళ్ల వయస్సులో ఎమ్మెల్యేలుగా గెలిచిన వారిలో సోను కుమార్ (గోహ్), నవీన్ కుమార్ (భట్నాహ), కుందన్ కుమార్ (షేక్‌పురా), శంబూబాబు (సుపాల్), రాజ్ కుమార్ సాదా (సిమ్రీ భక్తియార్‌పూర్) ఉన్నారు.బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 25 నుంచి 30 ఏళ్లు కలిగిన ఎమ్మెల్యేలు నలుగురు, 31–40 ఏళ్లు కలిగిన వారు 32 మంది, 41–50 ఏళ్ల వారు 83 మంది, 51–60 ఏళ్లు కలిగినవారు 65 మంది, 61–70 ఏళ్ల వారు 47 మంది, 71–80 ఏళ్లు కలిగిన వారు 10 మంది ఉన్నారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేల సగటు వయస్సు 51 సంవత్సరాలుగా ఉంది.

పెన్ పవర్
ప్రకాశం

## చర్మ రోగ పరీక్షల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి - జిల్లా కలెక్టర్ రాజాబాబు

**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు పెన్ పవర్ నవంబర్ 14**

ఈనెల 17వ తేదీ నుంచి చేపట్టే చర్మరోగ పరీక్షల కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశించారు. ఇందుకు సంబంధించిన సమన్వయ కమిటీ సమావేశం శుక్రవారం ప్రకాశం భవనంలో కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. డిఎంహెచ్వో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏ రోగమైనా ప్రారంభ దశలోనే గుర్తిస్తే తగిన జాగ్రత్తలు, వైద్యం తీసుకోవడం ద్వారా నివారణ సులువు అవుతుందన్నారు. ఈ దిశగా వైద్య, జిల్లా పరిషత్, పంచాయతీ, విద్య శాఖల మధ్య సమన్వయం అత్యవసరమని చెప్పారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ నెలాఖరు వరకు జరిగే చర్మరోగ పరీక్షల కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా నిర్వహించాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. దీనికి సంబంధించిన పోస్టరును ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో చిరంజీవి,



డిపిఓ వెంకటేశ్వర్లరావు, జిల్లా ఎయిడ్స్, లెప్రసీ నివారణ అధికారి బాలాజీ, జిల్లా ఉప విద్యాధికారి చంద్రమౌళీశ్వర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పరిశుభ్రమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలి

**మున్సిపల్ కమిషనర్ డివిఎస్ నారాయణరావు**





**మార్కాపురం టౌన్ పెన్ పవర్ నవంబర్ 14**

మార్కాపురం పురపాలక సంఘ పరిధిలోని నాగులవరం రోడ్డులోని రాజ్యలక్ష్మి కాలనీలో గల సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని మున్సిపల్ కమిషనర్ డివిఎస్ నారాయణరావు పరిశీలించారు. వార్డ్ ఎమినిటీ సెక్రటరీలు, వార్డు శానిటేషన్ సెక్రటరీలతో కలసి పరిశీలించారు. వసతి గృహం లో పరిసరాలను శుభ్రపరచడం ముఖ్యంగా వారు త్రాగుతున్నటువంటి నీటి యొక్క నాణ్యతను విద్యార్థునుల, ఉపాధ్యాయుల యొక్క సమక్షంలో నీటి నాణ్యత పరీక్షలు చేయించారు. ఆ టెస్ట్ యొక్క రిజల్ట్ వీటిని కూడా ప్రయోగాత్మకంగా విద్యార్థుల ముందే చేయించి చూపించుట జరిగింది. పరిశుభ్రమైన ఆహార పదార్థాలను విద్యార్థులకు అందించాలని, నీటి విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి , ఏవైనా సమస్య ఉన్నయెడల కమిషనర్ దృష్టికి తీసుకుని రావాల్సిందిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీయుత మున్సిపల్ కమిషనర్ డి వి ఎస్ నారాయణరావు , వార్డ్ శానిటేషన్ సెక్రటరీ సుభాషిని , వార్డ్ ఎనిమిటి సెక్రటరీ డి త్రిమూర్తి నాయక్ పాలుగున్నారు.



# చిన్నకండ్లేరు చెరువుకు గండి...

# రైతుల్లో ఆందోళన...

**అధికారులు నిర్లక్ష్యం..!**

**చెరువు కట్ట మరమ్మతు పనులు తక్షణమే ప్రారంభించాలని రైతుల డిమాండ్.**

**అధికారుల నిర్లక్ష్యం కొనసాగితే పెద్ద ఎత్తున ధర్నా తప్పదు రైతు సంఘం నాయకులు.**

**పుల్లల చెరువు పెన్ పవర్ నవంబర్ 14**

పుల్లల చెరువు మండల పరిధిలోని చిన్నకండ్లేరు చెరువులో ఇటీవల లీకేజీ ఏర్పడి నీరంతా వృథా అవుతున్నాడంతో స్థానిక రైతులను తీవ్రంగా కలవరపెడుతోంది. చెరువు నీరు పొలాలకు చేరకముందే లీకుతో నీరు వృథా అవుతుండటంతో రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా చిండ్ల కండ్లేరు చెరువును పరిశీలించిన పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్ట్ తీగలేరు (టీ 5) సాధన సమితి సభ్యులు రైతు సంఘం నాయకులు జీవి గురునాథం, కె జానకి రఘు, కోటిరెడ్డి, మాట్లాడుతూ మన ప్రకాశం జిల్లాలోని కంభం చెరువు తర్వాత రెండవ అతిపెద్ద చెరువు చిన్న కండ్లేరు చెరువు అని అన్నారు. ఇటీవల కురిసిన వర్షానికి చెరువు నిండుకుండలాగా ఉందని కానీ చెరువుకి రెండు కెనాల్ వున్నాయి లెఫ్ట్ కెనాల్ నుంచి నీరు వృధాగా వెళుతుందని వారన్నారు.. ఈ లెఫ్ట్ కెనాల్ నుంచి వాటర్ బయటకు వెళ్లకుండా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని అన్నారు. గతంలో ఇదే విధంగా నీరు వృధాగా వెళుతుంటే తూతూ మంత్రంగా మరమత్తులు చేశారని వారు అన్నారు.. ఈసారి తూతూ మంత్రంగా కాకుండా శాశ్వత పరిష్కారం గా పనులు చేపట్టాలని అధికారులను కోరారు. చెరువు కట్టకు ఇరువైపులా ముల్లకంపచెట్లు,జంగిల్ తో నిండి ఉన్నదని వాటిని అధికారులు తొలగించిన పాపాన పోలేదన్నారు. గత వారం నుండి చెరువు కట్ట దిగువ భాగంలో ఉన్న లెఫ్ట్ కెనాల్ నుంచి భారీగా నీరు వృధాగా పోతున్నాయని వారు తెలిపారు.చెరువు కట్ట అంతర్భాగంలో గండి పడిందని ఈ విషయం సంబంధిత నీటిపారుదల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా



ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు.చెరువు ఆయకట్టు కింద ఇప్పటికే వరి,మిరప,మొక్కజొన్న, వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు.చెరువులో ఉన్న నీరు ఇలా వృథా అయితే రబీ పంటల సాగు దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సంవత్సరం ఇదే సమస్య ఎదురవుతోంది.చెరువు పునరుద్ధరణకు ప్రతిసారీ హామీలు ఇస్తారు కానీ ఆచరణలోకి రాకుండా పోతుంది తెలిపారు. చిన్న కండ్లేరు చెరువులో నీరు ఉన్నట్లయితే దాదాపు ఉమ్మడివరం , గారపెంట,చెన్న పాలెం, అక్కపాలెం,శతకోడు, తెల్ల గట్ల, వివిధ గ్రామాలకు భూగర్భ జలాలు పెరిగి నీటికి కొరత లేకుండా వ్యవసాయం సాగు చేసుకునే పరిస్థితి నెలకొంటుంది. కావున చెరువు కట్ట మరమ్మతు పనులు తక్షణమే నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు.మరమత్తులు చేపట్టకపోతే రైతులను సమీకరించుకొని ధర్నాకు దిగుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వెలుగొండ ప్రాజెక్ట్ తీగలేరు సాధన సమితి సభ్యులు,రైతులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సురక్షిత త్రాగు నీటిని అందించేందుకు చర్యలు చేపట్టాలి

**- జిల్లా కలెక్టర్ రాజాబాబు**



**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు పెన్ పవర్ నవంబర్ 14**

ప్రజలతో పాటు విద్యాలయాలు, సంక్షేమ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు సురక్షిత త్రాగునీరు అందించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై వుందని, అందుకనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ లోని తన చాంబర్ లో జిల్లా కలెక్టర్ రాజాబాబు, ఆర్డబ్ల్యూఎస్. శాఖ అధికారులు, మునిసిపల్ కమీషనర్లు, పంచాయతీ రాజ్, సంక్షేమ వసతి గృహాల అధికారులు, విద్యా శాఖ అధికారులతో సమావేశమై ప్రజలకు, విద్యార్థులకు సురక్షిత త్రాగునీరు అందించేలా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించి, దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలతో పాటు విద్యాలయాలు, సంక్షేమ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు సురక్షిత త్రాగునీరు అందించాల్సిన భాధ్యత సంబంధిత అధికారులపై వుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ప్రజలకు కనీస అవసరాలైన త్రాగునీరు అందించడంలో ఖర్చు చేస్తున్నదన్నారు.



గ్రామాన్ని/మున్సిపాలిటీని యూనిట్ గా తీసుకుని ఎంత మంది ప్రజలు నివశిస్తున్నారు, త్రాగునీటి వనరుల లభ్యత ఎక్కడినుండి వస్తున్నది, అలాగే ఎన్ని బోర్లు పనిచేస్తున్నాయి, ఆ నీటి లో ఫ్లోరైడ్ శాతం ఎంత వుంది, అలాగే ఎన్ని ఆర్ఓ ప్లాంట్స్ పనిచేస్తున్నాయి, ఆ ఆర్ఓ ప్లాంట్స్ కు నీటి వనరుల లభ్యత ఎక్కడినుండి వస్తున్నది తదితర వివరాలతో సమగ్ర నివేదికతో పాటు మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేసి రెండు మూడు రోజుల్లో సమర్పించాలని జిల్లా కలెక్టర్, ఆర్డబ్ల్యూఎస్., మున్సిపల్ కమీషనర్లు, పంచాయతీ రాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే ఎస్.సి., ఎస్.టి., బిసి వసతి గృహాలు, రెసిడెన్షియల్ స్కూల్స్. విద్యాలయాల్లో ఎంత మంది విద్యార్థులు ఉంటున్నారు, వాటికి నీటి వనరుల లభ్యత ఎక్కడినుండి వస్తున్నది, ఎన్ని ఆర్ఓ ప్లాంట్స్ ఉన్నాయి, వాటిలో ఎన్ని పని చేస్తున్నాయి, ఎన్ని పనిచేయడం లేదు, ఏ కారణంగా అవి పనిచేయడం లేదు తదితర వివరాలతో సమగ్రంగా నివేదిక తయారు చేసి సమర్పించాలని జిల్లా కలెక్టర్ సంక్షేమ వసతి గృహాల అధికారులను మరియు విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. ఉన్న ఆర్ ఓ ప్లాంట్స్ నిర్వహణ పై రెగ్యులర్ పర్యవేక్షణ ఉండేలా కార్యాచరణ ప్రణాళికలు రుపొందించాలని జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై ప్రతి వారం సమావేశమై సమీక్షించుకోవడం జరుగుతుందని, అందుకనుగుణంగా సంబంధిత శాఖల అధికారులు పనిచేయాల్సిఉంటుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సి.ఈ.ఓ చిరంజీవి, డిపిఓ వెంకటేశ్వర రావు, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్.ఈ బాల శంకర రావు, సోషల్ వెల్ఫేర్ డిడి లక్ష్మా నాయక్, పబ్లిక్ హెల్త్ ఈఈ సంజయ్ కుమార్, జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి నిర్మలా జ్యోతి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి వరలక్ష్మి, ఎపిఎస్డబ్ల్యూఆర్ఈఐఎస్ డిసిఓ జయ, జిల్లాలోని మునిసిపల్ కమీషనర్స్ తదితరులు పాల్గొన్నారు.

# శక్తి యాప్ గురించి విస్తృత ప్రచారం నిర్వహించాలి

**-బాలల సంరక్షణలో పోలీసు శాఖ ఎల్లవేళలా ముందుంటుంది - జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు**




**క్రైం రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ నవంబర్ 14**

మహిళలు, విద్యార్థినుల భద్రత కోసం శక్తి యాప్ యొక్క ప్రాముఖ్యత, అందించే సేవల గురించి విస్తృత అవగాహన కల్పించాలని, ఎన్ఫోర్స్మెంట్ నిర్వహించాలని జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు అన్నారు. బాల్య న్యాయ చట్టం, పోక్సో చట్టం, పిల్లలకు సంబంధించిన ఇతర చట్టాలపై అవగాహన పెంపొందించేందుకు, పిల్లలతో వ్యవహరించే బాలల సంక్షేమ పోలీస్ అధికారులు, మహిళా సహాయక కేంద్రం సిబ్బంది, శక్తి టీమ్స్, జిల్లా ఏ.హెచ్.టి.యు. బృందంతో ఒంగోలులోని జిల్లా పోలీస్ కళ్యాణ మండపంలో జిల్లా స్థాయి ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా ఎస్పి వి.హర్షవర్ధన్ రాజు, ముఖ్య అతిథిగా హాజరైన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోక్సో చట్టం, జువెనైల్ జస్టిస్ యాక్ట్%--%2015, బాల్య వివాహాల నిర్మూలన, బాలల సంరక్షణ వంటి కీలక చట్టాలపై పోలీస్ సిబ్బంది మరింత అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో ఈ చట్టాల ప్రకారం పాటించాల్సిన నియమాలను తెలుసుకోవడం, ప్రజల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టడం ద్వారా నేరాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. బాధిత బాలబాలికలకు న్యాయం చేయడంలో చట్టప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని కూడా ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా శక్తి బృందాలు బస్టాండులు, ఆర్టీసీ కాంప్లెక్సులు, రైల్వే స్టేషన్లు, ముఖ్య కూడళ్ళు, ఈవ్ టీజింగ్ జరిగే ప్రదేశాలు, పాఠశాలలు, కళాశాలల వద్ద పర్యటిస్తూ ఏ సమస్య వచ్చిన వెంటనే పరిష్కరించే విధంగా పని చేయాలని ఎస్పీ సూచించారు. శక్తి కాల్స్, డయల్ 100/112, ఉమెన్ హెల్ప్ లైన్ -181 ద్వారా ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత పోలీసులు చురుకుగా స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. శక్తి టీమ్ ఏర్పాటు చేసినప్పుడు నుండి 3000 పైగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, 813 ఎస్ ఓఎస్ కాల్స్ కు వెంటనే స్పందించటం జరిగిందని, ఇంకా ఎక్కువ డ్రోన్ కెమెరాలతో పెట్రోలింగ్ నిర్వహిస్తూ స్కూల్/కాలేజీ ల వద్ద విజిబుల్ పోలీసింగ్ చేస్తూ శక్తి యాప్ గురించి తెలియచేస్తూ ఎక్కువగా అవగాహనా కల్పిస్తూ మహిళలు, చిన్నపిల్లలు జరిగే నేరాలను నివారించడంలో కృషి చేయాలని సూచించారు. రెస్పాన్స్ టైమ్ అత్యంత కీలకమన్నారు. బాధితులకు అండగా నిలిచి, సమాజం గుర్తుంచుకునే విధంగా విధులు నిర్వర్తించాలని పోలీస్ సిబ్బందికి జిల్లా ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి. యస్.సువర్ణ, సిడిపిఓ పి.ఇవాజింలెన్, డిసీపీఓ పి.దినేష్, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ వి.వి. రమణ కుమార్, డిసిఆర్బీ ఇన్స్పెక్టర్ దేవప్రభాకర్, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ యు. సుధాకర్, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



# 23న టి అరుణకు జీవన సాఫల్య పురస్కారం ప్రదానం

*పలువురి అభినందనలు*



**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు నవంబర్ 14**

నరసం(నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం) గౌరవ అధ్యక్షురాలు తేళ్ళ అరుణ కి గుత్తికొండ చారిటబుల్ ట్రస్ట్ వారు జీవన సాఫల్య పురస్కారం ఇవ్వనున్నట్లు న ర సం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు తమ దివంగత గుత్తికొండ రామరత్నం పేరిట ఇచ్చే ఈ పురస్కారాలకు అరుణ ఎంపిక కావటం న ర సం సంస్థకు సంతోషదాయకమని ఆమె అన్నారు. ఈనెల 23 వ తేదీ ఆదివారం సాయంత్రం మచిలీపట్నం లోని గుత్తికొండ రామరత్నం ఆడిటోరియంలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ జి.వి.పూర్ణచందు అధ్యక్షులుగా, శాసనమండలి సభ్యులు డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొనే ఈ సభలో ఈ పురస్కార ప్రదానం జరగనుంది. సాహితీ, సామాజిక రంగాలలో విశేష సేవలందిస్తున్న అరుణకి ఈ పురస్కారం లభించటం పట్ల ప్రకాశంజిల్లాలోని ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, డాక్టర్ నూనె అంకమ్మరావు, కుర్రా ప్రసాద్ బాబు,మహతి బాలాజీ,మిడసల మల్లికార్జునరావు,యు. వి.రత్నం, బీరం అరుణ వి. ఝాన్సీ దుర్గ,మున్నంగి రాజకుమారి,మారేపల్లి సూర్యకుమారి,మాజీ ఎంపీపీ నాళం నరసమ్మ పరాంకుసంకృష్ణవేణి తదితరులు అభినందనలు తెలియజేశారు.

# శాఖా గ్రంధాలయంలో ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు



**గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 14**

గిద్దలూరు శాఖా గ్రంధాలయం లో 58..వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా శ్రీ పాతాళ నాగేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ శివపురం ఆంజనేయులు హాజరై జాతీయ పతాకా విష్కరణ , జ్యోతి ప్రజ్వలన చేశారు భారత దేశ ప్రప్రథమ ప్రధాన మంత్రి పండిట్ జవహర్లాల్ నెహ్రూ చిత్ర పటానికి పూలమాలవేసి నివాలర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల బాలికలు పాఠశాల విద్యతో పాటు గ్రంథా లయాల్లో పుస్తక విజ్ఞానాన్ని పొందేందుకు కొంత సమయం కేటాయించాలన్నారు.తమ పిల్లలు పుస్తకాలను చదివే విధంగా తల్లి దండ్రులు ఉపాధ్యాయలు కృషి చేయాలన్నారు.. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ఎన్ . ప్రసన్న కుమారి గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బి .రామిరెడ్డి ప్రధాన కార్యదర్శి జి కిషోర్ కార్యదర్శి ఎస్ డి. ఫరూఖ్ విశ్రాంత పంచాయితీ సెక్రటరీ డి నారాయణ రెడ్డి విశ్రాంత రిటైర్డ్ పీడీ.. పీవీ తిరుపతి రెడ్డి. పి వెంకట రామిరెడ్డి రిటైర్డ్ టీచర్ డి ముసల్ రెడ్డి. బాల బాలికలు పాల్గొన్నారు.

# 16న ఉచిత మెడికల్ క్యాంపు

**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు నవంబర్ 14**

భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి 100 వ జన్మదినోత్సవం సందర్భంగా ఒంగోలు మంగమూరు రోడ్డు గాంధీ నగర్ లో వేంచేసి ఉన్న శ్రీ భగవాన్ శ్రీ సత్య సాయి బాబా మందిరంలో ఈనెల 16వ తారీఖున ఆదివారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు మందిర కన్వీనర్ కోడెల శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా నిష్ణాతులైన వైద్యులచే వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉచిత మెడికల్ క్యాంపులో కంటి వైద్య నిపుణులు డాక్టర్ మన్నెం నాగ సుధారాణి ,గుండె వైద్య నిపుణులు డాక్టర్ చైతన్య, ఎముకలు కీళ్లు వైద్య నిపుణులు డాక్టర్ కమలహాసన్, జనరల్ వైద్య నిపుణులు డాక్టర్ విజయశ్రీ, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ గడ్డం జగదీష్, స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ హర్షిత ఈ క్యాంపు నందు ఉచితంగా టెస్టులు చేయనున్నట్లు మందిర కన్వీనర్ కోడెల శ్రీనివాసరావు తెలిపారు. ఈ అవకాశాన్ని ఒంగోలు నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా మందిర కన్వీనర్ కోడెల శ్రీనివాసరావు తెలిపారు.

# ఇష్టపడి కసిగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

## నాటి నాయకుల జీవిత చరిత్రలు మనకు ఆదర్శంకావాలి -మున్సిపల్ కమిషనర్ ఈ వి రామణ బాబు

## బిసి బాలికల వసతిగృహం లో ఘనంగా బాలలదినోత్సవ వేడుకలు -అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు








**గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 14**

వసతి గృహాల్లో నివసించే విద్యార్థునులు ఇష్టపడి కసిగాచదివి ఉన్నతశిఖరాలు అధిరోహించాలి కోరారు. పండిట్ జవహర్ నెహ్రూ జన్మదినం, బాలల దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నెహ్రూ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా రమణ బాబు మాట్లాడుతూ పేదరికం, మరో కారణంతో తల్లిదండ్రులు పిల్లలను వసతి గృహాల్లో విడిచి పెడతారని, కానీ తల్లిదండ్రుల ఆశల మేరకు ఇష్టపడి , కష్టపడి కసిగా చదువు సాగించి ఉన్నత శిఖరాలు అధిరోహించి, మీ తల్లిదండ్రులు ఆశలు, మురు నివసిస్తున్న వసతి గృహం చదువుతున్న పాఠశాలకు పేరు ప్రతిష్టలు తేవాలని కోరారు. ఈసందర్భంగా విద్యార్థినిల ఉత్తేజపరుస్తూ యదార్ధాగాధను కథగాచెప్పారు. కానిస్టేబుల్ సతీమణి పట్టుబట్టి ఐపీఎస్ అయిన విషయాన్ని చెప్పి బాలికల్లో ఉత్తేజం నింపారు. తనకు బాలబాలికతో గడపటం ఎంతో ఇష్టమని తెలిపారు. నాటి స్వాతంత్ర్య సమరయోధులజీవిత చరిత్రల ను ఆకళింపుచేసుకుంటూ , చదువు కు పేదరికం అడ్డుకాదని, ఎవరు దోచుకోనిది విద్య ఒక్కటేనని తెలిపారు . ఇటీవల ఎందరో పేదింటి పిల్లలు కసిగాచదివి ఐపీస్, ఐ పీఎస్ లు అయ్యారని, రాజస్థాన్ లో ఒక నిరుపేద కుటుంబంలో ముగ్గురు అక్కచెళ్లలు ఐ పీఎస్ అయ్యారని వారందరు మీకు ఆదర్శమే నన్నారు. బాలదినోత్సవం సంధర్బంగా ఇటీవల 10 , 9 వ తరగతిలో మంచి మార్కులు సాధించిన బోర్డర్స్ కు బహుమతులను పంపిణీ చేశారు. బాలల దినోత్సవం సంధర్బంగా బాలికల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకాటుకు న్నాయి. ఈకార్యక్రంలో వసతి గృహ సంక్షేమాధికారి పార్వతి బాయ్, ముచ్చిపల్ కార్యాలయం ప్లానింగ్ అధికారి శాంతి , పట్టణ కౌన్సిలర్ ఖాదర్, సీనియర్ పాత్రికేయులు ఆర్ మల్లికార్జున రావు ,పాల్గొన్నారు .కమిషనర్ ను దుశ్శాలువా పులమాలలతో ఘనంగా సత్కరించారు.

# ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



**పుల్లల చెరువు పెన్ పవర్ నవంబర్ 14**

భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా స్థానిక యమ్ అండ్ డీకే పాఠశాలలో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ముందుగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు వేముల వీరయ్య మాట్లాడుతూ నెహ్రూ చిన్నారుల పట్ల చూపిన అపారమైన ప్రేమ, దేశ భవిష్యత్తు నిర్మాణానికి ఆయన వేసిన పునాది, పిల్లలు విద్యలోనే కాదు,సృజనాత్మకత, నైతికతలోనూ ముందుకు సాగాలని ఆయన కలలు కన్న ఆశయాలను స్ఫూర్తిదాయకమని వివరించారు.తరువాత పిల్లల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకలను మరింత రంజింపజేశాయి. డ్రాయింగ్, క్విజ్, పాటలు, నృత్యాలు, వక్తృత్వ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. చిన్నారుల సందడి మధ్య పాఠశాల ఆవరణ కళకళలాడింది. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా బహుమతులు అందజేసి అభినందనలు తెలియజేశారు.పిల్లలకు విద్యతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని, భవిష్యత్ పట్ల అవగాహన కల్పిస్తాయని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆహ్లాదకర వాతావరణంలో అడవిరాజుపాలెం హైస్కూలులో చైల్డ్రన్స్ డే వేడుకలు

## చిన్నారులకు 5స్టార్ చాక్లేట్లు పించిన జనసేన నాయకులు.






**గుడ్లూరు, పెన్ పవర్, నవంబరు 14:**

మండలంలోని అడవిరాజుపాలెంలో నూతనంగా ఈ విద్యాసంవత్సరం నుండి ప్రారంభించిన జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో చిల్డ్రన్స్ డే వేడుకలు ఆహ్లాదకరమైన వాతావరణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భారతదేశ మొట్టమొదటి ప్రధానమంత్రి అయిన పండిట్ జవహర్లాల్ నెహ్రూ పుట్టినరోజు సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, చిన్నారులకు వారు దేశాభివృద్ధి కోసం చేసిన కృషిని పిల్లల పట్ల ఆయనకు గల అభిమానాన్ని వివరించారు. ఈ సందర్భంగా జనసేనపార్టీ గుడ్లూరు మండల అధ్యక్షులు సన్నిశెట్టి గిరిబాబు, వారి సభ్యులు చిల్డ్రన్స్ డే సందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపి, 160 మంది విద్యార్థులకు 5 స్టార్ చాక్లెట్స్ ను పంపిణీ చేశారు. జనసేన సభ్యులను ఉపాధ్యాయులు అభినందించారు. అనంతరం విద్యార్థులకు చిల్డ్రన్స్ డే సందర్భంగా చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పిగిలి మనోహరం, పి.మాల్యాద్రి, జి.రాజా హెచ్.ఎం, డి.బలరామయ్య, కే.సుధాకర్ రావు, కె.వెంకటేశ్వర్లు, సీ.హెచ్. వసంత కుమారి మరియు జనసేన సభ్యులు కొలకలూరి ఆమోసు, పి.అంకమరావు, ఏ.రంగసాయి, జి.మహేంద్ర, ఏ.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్ప్రింగ్ బోర్డు స్కూల్ లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

**గిద్దలూరు పెన్ పవర్, నవంబర్ 14**




స్థానిక స్ప్రింగ్ బోర్డు స్కూల్ లో బాలల దినోత్సవాన్ని అత్యంత ఉత్సాహభరితంగా, ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ మణి చైతన్య, పండిట్ జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశపు తొలి ప్రధాని స్వర్గీయ జవహర్ లాల్ నెహ్రూ కు బాలలంటే అమితమైన ఇష్టమని అందుకే ఆయన జన్మదినాన్ని బాలల దినోత్సవంగా జరుపుకుంటామని, ప్రతి విద్యార్థి ఉన్నత ఆశయాలతో ముందుకు సాగాలని, వారి బంగారు భవిష్యత్తు కోసం మనమంతా కలిసి పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. చిన్నారుల నృత్యాలు, పాటలతో చిన్న పిల్లలు నెహ్రూ వేషధారణలో ముచ్చటగా కనిపించి అందరి దృష్టిని ఆకర్షించారు. బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు పాఠశాల ప్రిన్సిపాల్ జాడి శ్వేత మెమోంటెలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ “బాలల దినోత్సవం పిల్లల సృజనాత్మకత, ప్రతిభ, ఆత్మవిశ్వాసాన్ని వెలికితీయడానికి ఒక వేదికని, నేటి పిల్లలే రేపటి నాయకులని. ప్రతి చిన్నారిలో దాగి ఉన్న ప్రతిభను ప్రోత్సహించడం మన బాధ్యత.” అని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పంపిణీ చేసిన బొబ్బూరి రమేష్



**సి ఎస్ పురం, పెన్ పవర్ నవంబర్ 14**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి అందిస్తున్న సిఎం రిలీఫ్ ఫండ్ వైద్య సాయం నిరుపేదలకు బాసటగా నిలుస్తుందని మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్ తెలిపారు. కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో సి ఎస్ పురం పట్టణానికి చెందిన గుండాల నారాయణమ్మ కుటుంబ సభ్యులకు సి ఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.41 వేల చెక్కును ఆయన అందజేశారు.ఈ సందర్భంగా బొబ్బూరి రమేష్ మాట్లాడుతూ వైద్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు సి ఎం రిలీఫ్ ఫండ్ గొప్ప ఆసరాగా నిలుస్తోందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందిస్తున్న సహాయ నిధులను సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారుని కుటుంబ సభ్యులకు తెలిపారు చెక్కును స్వీకరించిన లబ్ధిదారుని కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, వైద్య సహాయం తమకు అందేలా కృషి చేసిన కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి కి మండల టిడిపి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, సింగిల్ విండో అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి, అట్లూరి రామకృష్ణంరాజు, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు కూటగుళ్ల మహబూబ్ బాషా, పట్టణ అధ్యక్షులు బత్తుల వెంకటాద్రి, పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి రేనాటి వెంకటేశ్వర్లు, ఆర్ కె వలి, గజ్జల కోటిరెడ్డి, వల్లపుశెట్టి వెంకటనారాయణ, రష్యా నారాయణ, రాజేష్,చావా చంద్రశేఖర్, ఇండ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# దిరిశవంచలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



**కనిగిరి ఆర్సీఇంచార్జ్, పెన్ పవర్, నవంబర్ 14**

కనిగిరి మండలంలోని దిరిశవంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవ వేడుకలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే మాధవ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు, మ్యూజికల్ చైర్స్ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు మాధవ శర్మ పూలమాలతో నివాళు లర్పించారు. బాలల దినోత్సవం ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు మాధవ శర్మ, ఉపాధ్యాయులు తెలియజేశారు. ఆటల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీరామ్ మురళి, వీరనారాయణ, శంకర్, చిరంజీవి, గౌసియా పర్వీన్ మొదలగువారు పాల్గొన్నారు.

# అట్టహాసంగా ప్రారంభమైన 58వ గ్రంథాలయ వారోత్సవాలు.

## ప్రారంభించిన గ్రంధపాలకులు ఎల్.ప్రభాకరరెడ్డి.





**గుడ్లూరు, పెన్ పవర్, నవంబరు 14:**
శాఖా గ్రంథాలయం గుడ్లూరు నందు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పౌరగ్రంథాలయ శాఖ వారు మరియు ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ ఒంగోలు వారి ఆదేశానుసారం గ్రంథ పాలకుడు యల్.ప్రభాకరరెడ్డి ఆధ్వర్యంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలుగు విశ్రాంత ఉపాధ్యాయులు సూరపరాజు నాగేంద్ర ప్రసాద్, మరో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు టీవీ రమణరాజు, తుమ్మలపెంట కొండయ్య, ఎస్.సీ బాలుర వసతి గృహం అధికారి సీ.హెచ్.శ్రీనివాసరావు మరియు ఉపాధ్యాయులు తిరుపతిరెడ్డి, గ్రామ పెద్దలు పాలకీర్తి బ్రహ్మయ్య లు తొలిరోజు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా అతిథులుగా విచ్చేసిన వారు జ్యోతి ప్రజ్వలన చేసి వారోత్సవాలను ప్రారంభించారు. అదే విధంగా భారతదేశ మొదటి ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ 137వ జయంతిని, బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని, ఆయన చిత్రపటానికి పూలమాలవేసి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు వారోత్సవాల ముఖ్య ఉద్దేశం గ్రంథాలయం యొక్క విశిష్టతను ఆవశ్యకతను తెలియపరుస్తూ ఈ వారం రోజుల్లో వివిధ రకాల పోటీలు నిర్వహించబడతాయని ప్రతి ఒక్కరు ఈ పోటీల్లో పాల్గొని విజేతలు కావాలని అలాగే ప్రతి దినము గ్రంథాలయం ఉపయోగించుకొని తద్వారా జ్ఞానాన్ని సముపార్ధించుకోవాలని తెలియజేయడమైనదని గ్రంధపాలకులు తెలియజేశారు. ఈ కార్యక్రమానంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయని శ్రావణి, గ్రంథాలయ సహాయకురాలు ఆర్.సావిత్రి, విద్యార్థిని విద్యార్థులు పాఠకులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**డీఈఈ శేషగిరిరావు**



**గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 14**
శనివారం ఉదయం 8:00 గం.ల నుండి మధ్యాహ్నం 12:00 గంట వరకు 33కేవీ అంబవరం ఫీడర్ విద్యుత్ లైన్ మైంటెనెన్స్ , ట్రీ కట్టింగ్ కారణంగా కాలనీ సబ్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాలు, ముండ్లపాడు సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు, బురుజుపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు, కంచిపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు, కృష్ణం శెట్టి పల్లె సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో గృహ విద్యుత్ , వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలిపివేయబడును. కావున ప్రజలు గమనించి సహకరించాలని డీ ఈ ఈ శేషగిరి రావు కోరారు.

# మైనర్లకు బైక్ లిస్తే కఠిన చర్యలు...

**ఐదు వాహనాలపై 5,035 రూపాయలు జరిమానా**



**పుల్లల చెరువు పెన్ పవర్ నవంబర్ 14**
పుల్లలచెరువు మండల కేంద్రంలో మైనర్లు బైకులు ర్యాష్ గా రైడ్ చేస్తున్నారనే ఫిర్యాదులు రావడంతో పుల్లలచెరువు ఎస్ఐ ఎల్ సంపత్‌కుమార్ గురువారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో రోడ్లపై బైకులు దూసుకెళ్తున్న ఐదుగురు మైనర్లను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న పోలీసులు, వారు నడుపుతున్న ద్విచక్రవాహనాలను స్టేషన్‌కు తరలించారు.తర్వాత వాహన యజమానులను, మైనర్ల తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి ఎస్ఐ సంపత్‌కుమార్ కౌన్సిలింగ్ ఇచ్చారు.పిల్లలకు బైకులు ఇవ్వడం సరైంది కాదు%లల% చిన్న నిర్లక్ష్యం ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తుంది అని తల్లిదండ్రులకు, యజమానులకు హెచ్చరించారు. మొదటిసారి పట్టుబడినందున ఒక్కో వాహన యజమానికి 5,035 రూపాయలు చొప్పున జరిమానా విధించారు.ఇకపై ఇలా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ స్పష్టం చేశారు.మైనర్లకు వాహనాలు ఇస్తే వాహనం సీజ్, యజమానిపై కేసు, కోర్టు హాజరు తప్పదు. చట్టం ఉల్లంఘిస్తే ఉపేక్ష లేదని ఆయన హెచ్చరించారు.

# 23న ఎపి ఎన్.జి.ఓ సంఘ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ

**గిద్దలూరు, పెన్ పవర్, నవంబర్ 14**
ఎపి ఎన్.జి.ఓ గిద్దలూరు తాలూకా యూనిట్ ఎన్నికలకు ఈ నెల 23న నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఎన్నికల అధికారి కె.మంజేస్ తెలిపారు. అధ్యక్ష,ఉపాధ్యక్ష,కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి,సంయుక్త మహిళా కార్యదర్శి మరియు కోశాధికారి పదవులకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. అదేరోజు పరిశీలన, ఉప సంహరణ ఉంటాయి. ఎన్నిక అవసరమైతే 30 వ తేదీన నిర్వహిస్తారని తెలిపారు.

## ప్రపంచ డయాబెటిస్(షుగర్) వ్యాధి

# దినోత్సవం కంటి సంరక్షణ

**గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 14**
ప్రపంచవ్యాప్తంగా డయాబెటిస్ వ్యాధి అనగా షుగర్ వ్యాధి దినోత్సవం నవంబర్ 14 వ తారీఖున జరుపబడుతుందని ఈ సందర్భంగా ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ జీకే మోహన్ రెడ్డి పేర్కొన్నారు . ఈ సంవత్సరపు డయాబెటిస్ వ్యాధి దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశ్యము మానవుని జీవిత దశల్లో షుగర్ వ్యాధి అనగా మనిషికి పుట్టినప్పటినుంచి వృద్ధాప్యం వరకు ఏదో ఒక దశలో ఈ షుగర్ వ్యాధి సంభవిస్తుందని కావున ఎవరికి వారే శారీరక వ్యాయామాలు, ఆహార నియమాలు పాటిస్తూ స్వీయ నియంత్రణ చేసుకోవటమే ముఖ్య ఉద్దేశ్యమన్నారు. షుగర్ వ్యాధి అనగా రక్తంలో ఇన్సులిన్ మోతాదు తగ్గి చక్కెర మోతాదు పెరగడం వలన ఈ వ్యాధి సంభవిస్తుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా జనాభాలో దాదాపు 6 శాతం మంది డయాబెటిస్ వ్యాధితో బాధపడుతున్నారని దశాబ్ద కాలము నుండి దాదాపు ఈ వ్యాధి రెట్టింపు అయ్యిందన్నారు భారతదేశంలో దాదాపు 11 కోట్ల పైన ప్రజలు డయాబెటిస్ వ్యాధితో బాధపడుతున్నారని. ఈ డయాబెటిస్ వ్యాధిని సకాలంలో గుర్తించి వైద్యం చేయించుకోకపోతే శారీరక అవయాలతో పాటు మరి ముఖ్యంగా కంటి దృష్టి మెల్లగా క్షీణించి చివరికి అంధత్వానికి దారితీస్తుందన్నారు. అందుకే దీనిని సైలెంట్ కిల్లర్ లేదా నిశ్శబ్ద వ్యాధి అంటారని. డయాబెటిస్ నియంత్రణ లేకపోతే కంటిలోని రెటీనాకు సంబంధించి డయాబెటిక్ రెటినోపతి మరియు మ్యాక్యులర్ ఎడిమా, మాక్యులర్ డి జనరేషన్ అనే వ్యాధులు కూడా సంభవిస్తాయన్నారు. ఈ చక్కెర వ్యాధి వలన కంటిలోని రక్తనాళాల్లో మార్పులు జరిగి రక్తనాళాలు చిట్లి, రక్తం గూడు కట్టి చివరికి కంటిలో రెటీనా వాపు పెరిగి మెల్లగా కంటి దృష్టిని కోల్పోతారన్నారు. డయాబెటిస్ (షుగర్)వ్యాధి సరిగా నియంత్రణ లేనివారికి, దీర్ఘకాలంగా డయాబెటిస్ వ్యాధితో బాధపడుతున్న వారికి, శరీర బరువు ఉండవలసిన దానికంటే 20 శాతం అధికంగా ఉన్నవారికి, అధిక రక్తపోటు( బీపీ)వ్యాధి, అనిమీయా, మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న వారికి, రక్తంలో ట్రై గ్లిజరైడ్స్ 250 కంటే ఎక్కువగా ఉన్నవారికి ఈ డయాబెటిక్ రెటినోపతి అనే వ్యాధి సంభవించడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయని. ఈ వ్యాధి ప్రారంభంలో ఎటువంటి లక్షణాలు కనపడవని వ్యాధి ముదిరిన తర్వాత కంటిలో రక్తనాళాలు చిట్లి రక్తం కారటం వలన, కంటి ముందు నల్లటి



చుక్కలు కనిపించడం,వస్తువులు మసక మసకగా కనిపించడం, రంగు,రంగుల వలయాలుగా కనిపిస్తూ హఠాత్తుగా కంటి దృష్టి తగ్గిపోయి శాశ్వత అందత్వం కలుగుతుందని కావున చక్కెర వ్యాధిగ్రస్తులు ప్రతి ఆరు నెలలకోసారి కంటి వైద్య నిపుణులచేత కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు . కంటిలోని రెటీనాను బయో మైక్రోస్కోప్ , ఆప్టికల్ కొహిరెన్స్ టోమోగ్రఫీ అనగా ఓ.సి.టి అనే పరికరం ద్వారా పరీక్షిస్తారని డయాబెటిక్ రెటినోపతి అనే వ్యాధి రాకుండా ఉండాలంటే చక్కెర వ్యాధిని , రక్తపోటును( బీ.పీ) వ్యాధిని , మూత్రపిండాల వ్యాధులను అదుపులో ఉంచుకోవాలన్నారు. ఈ రెటినోపతి వ్యాధిని లేజర్ చికిత్స ద్వారా , విట్రియో రెటినల్ సర్జరీ ద్వారా కొంతవరకు కంటి చూపు కోల్పోకుండా నివారించవచ్చునన్నారు.ఈ చక్కెర వ్యాధిని నివారించాలంటే కనీసము 45 నిమిషాల పాటు శారీరక వ్యాయామములు పాటిస్తూ మరి ముఖ్యంగా మునగాకు, బచ్చలి కూర ,క్యారెట్ ,బీట్రూట్, బ్రోకలీ, క్యాలీఫ్లవర్ , చిలగడదుంప మొదలైన ఆకుపచ్చని ఆకుకూరలు కాయగూరలు మంచి పోషకాహార పదార్థాలు ఆహారంగా భుజించాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జీకే మోహన్ రెడ్డి తమ వైద్యశాలలో నవంబర్ 30 తేదీ వరకు డయాబెటిస్ రక్త పోటు (బి.పి)కలవారికి కంటిలోని రక్తనాళాలు , రెటీనా పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు.

# అంగన్వాడీలకు కనీస వేతనం 26వేలు ఇవ్వాలి

## అంగన్వాడీల మండల కమిటీ(సీఐటీయూ) డిమాండ్.



**గుడ్లూరు, పెన్ పవర్, నవంబర్ 14:**
అంగన్వాడీలకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, సీఐటీయూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శుక్రవారం యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గుడ్లూరులోని, సచివాలయం 1% 2% లలో, అర్జీలు దాఖలపరిచి, రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయాలని కోరడమైనదని నాయకులు జీ.వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రీస్కూల్ ను బలోపేతం చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, 5%స్త్ర% ఫోన్లు ఇవ్వాలని, అదనపు పని భారాన్ని తగ్గించాలని, ఎఫ్ ఆర్ ఎస్ రద్దు చేయాలని, 3 నుండి 6 సంవత్సరాల పిల్లలను విధిగా అంగన్వాడీ సెంటర్లో చేర్చాలని జీవో ఇవ్వాలని. ఎస్సీ, ఎస్టీలకు హెల్పర్లకు ఉచిత కరెంటు అమలు చేయాలని, సాధికార సర్వేలో తప్పుగా నమోదు చేసిన, ఉద్యోగులు, 12 వేలు పైన జీతం అనే పదాలను తొలగించాలని, అర్జీలో వారు పేర్కొన్నారు. సచివాలయం-1 లో మహిళా పోలీసు, సివిల్ ఇంజనీర్ కు, సచివాలయం-2లో డిఏ విష్ణు, సోషల్ వెల్ఫేర్ లకు అర్జీలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు, అంగన్వాడీ లీడర్లు, కే.రమాదేవి, ధనలక్ష్మి, కొమరగిరి అనూష, పి.మరియా, పి.సుబ్బులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, డి.బాలకోటయ్య, గిరిజన సంఘం నాయకులు, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.



# బిహార్ లోచరిత్ర సృష్టించిన ఎన్డీఏ కూటమి

**గిద్దలూరు బీజేపీ నాయకుల్లో సంబరాలు**



**గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 14**
బీహార్ ఎన్నికల లోఎన్డీఏ కూటమి ఘనవిజయం సాధించడాన్ని గిద్దలూరు బీజేపీ నాయకులు అప్పిశెట్టి ఉదయ్ శంకర్ హర్షం వ్యక్తం చేస్తూ గిద్దలూరు రైల్వే స్టేషన్ ఆవరణం లో అన్న దానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్య క్రమం లో జిల్లా మాజీ ఉపాధ్యక్షులు భవ నాసి వెంకట రామాంజనేయులు,సీనియర్ నాయకులు పిడతల రమేష్ రెడ్డి,మాజీ జిల్లా ఓ బి సి ప్రధాన కార్యదర్శి బాదుల్ల,గిద్దలూరు పట్టణ ఉపాధ్యక్షులు కొప్పరపు నాగేశ్వర రావు బిజెపి టౌన్ వైస్ ప్రెసిడెంట్, మాజీ జిల్లా కార్యదర్శి ముప్పూరీ శ్రీనివాసులు, సీనియర్ నాయకులు శివపురం రవి కుమార్,దూదేకుల మహేష్ ,కొప్పుల నర్సింహులు,వర ప్రసాద్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు .

# ఘనంగా బాలల దినోత్సవం





**పొన్నలూరు పెన్ పవర్ నవంబర్ 14**
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పొన్నలూరు నందు నెహ్రూ జన్మదినం సందర్భంగా బాలల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు అయిన సమావేశానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు అన్న నెహ్రు యొక్క నినాదాన్ని మనం నిజం చేయాలంటే మంచి క్రమశిక్షణతో చక్కగా చదువుకొని జీవితంలో మంచి పౌరులుగా రాణించాలని ఆకాంక్షించారు.అనంతరం మండల విద్యాశాఖ అధికారి రవిచంద్రబాబు మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి అలవాట్లు కలిగి ఉండి ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎం యేసురత్నం, పి.రమాదేవి కృష్ణకుమారి, కోటేశ్వరరావు ఝాన్సీ లక్ష్మి, రాము, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పొదిలి మానవత సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా బాలల దినోత్సవం వేడుకలు



**పొదిలి, పెన్ పవర్, నవంబర్ 14,**
పొదిలిలో శుక్రవారం నాడు మానవత సంస్థ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. దివంగత మాజీ ప్రధాని జవహర్లాల్ నెహ్రూ పుట్టినరోజు న బాలల దినోత్సవం గా సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అదేవిధంగా పట్టణంలోని భవిత పాఠశాలలో మానవత సంస్థ సభ్యులు దివ్యాంగ చిన్నారుల మధ్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం భవిత పాఠశాలలోని దివ్యాంగ చిన్నారుల యోగక్షేమాలు అడిగి తెలుసుకోవడంతోపాటు వారికి భోజనం వడ్డించి, వారితో కలసి మానవత సంస్థ సభ్యులు భోజనం చేశారు. అనంతరం అక్కడి విద్యార్థులకు లంచ్ బాక్సులను జ్ఞాపికలుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి, ఉపాధ్యాయులు ఎస్ షాహిదా, రమాదేవి, మానవతా సంస్థ అధ్యక్షులు కె వెంకటనారాయణ బాబు, జిల్లా అధ్యక్షులు కే ఎల్లమందరెడ్డి, సంస్థ గౌరవ చైర్మన్ మువ్వల పార్థసారథి, కన్వీనర్ కల్లం వెంకట సుబ్బారెడ్డి, డైరెక్టర్ వై వెంకటేశ్వర రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఇంచార్జ్ బండి అశోక్, హబీబుల్లా ఫౌండేషన్ చైర్మన్ కరిముల్లా బేగ్, ఎం వెంకటేశ్వర్లు, దాతలు పి వెంకట శ్రీనివాసరావు, బెల్లంకొండ విజయలక్ష్మి, కిరణ్మయి, బాజీ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

## బీహార్ ఎన్నికల్లో ఎన్డీఏ ఘన విజయం

### పట్ల పొదిలిలో బిజెపి కార్యకర్తల సంబరాలు





**పొదిలి , పెన్ పవర్, నవంబర్ 14**

బీహార్ రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ పార్టీ ఘన విజయం సాధించడం పట్ల పొదిలి లో శుక్రవారం సాయంత్రం బిజెపి నాయకులు కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడ్డ వెంటనే పట్టణంలోని పలుచోట్ల భారతీయ జనతా పార్టీ నాయకులు కార్యకర్తలు సంబరాలు జరుపుకొని తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు. ప్రధానంగా జిల్లా బిజెపి అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి ఆధ్వర్యంలో కార్యకర్తల సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వం పట్ల బీహార్ రాష్ట్ర ప్రజలు ఎన్నికల ద్వారా తమ మద్దతును తెలియజేశారని చెప్పారు. భారతదేశ అభివృద్ధి నరేంద్ర మోడీ నాయకత్వంలోనే అన్ని విధాల సాధ్యపడుతుందని విషయాన్ని ప్రజలు స్పష్టంగా తమ ఓటు హక్కు ద్వారా బహిర్గతం చేశారని విజయలక్ష్మి చెప్పారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు మాగులూరి రామయ్య, ఆకుపాటి లక్ష్మణ, మువ్వల పార్థసారథి, పందిటి మురళి, సయ్యద్ ఖాదర్ భాష, ఎస్. రఫీ తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ వ్యాధి నివారణకు విస్తృత ప్రచారం అవసరం

### జిల్లా కలెక్టర్ రాజాబాబు





**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ నవంబర్ 14**

ఎయిడ్స్ నివారణతోపాటు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం అనే కార్యక్రమాలు చేపట్టిందని, దీనిలో భాగంగా ఇంకా గ్రామీణ స్థాయి వరకు విస్తృత అవగాహన కల్పించేందుకు ఒక వినూత్నమైన వాహనాన్ని కేటాయించిందని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ఇంటిగ్రేటెడ్ కౌన్సిలింగ్ టెస్టింగ్ సెంటర్ వాహనాన్ని శుక్రవారం ఆయన ప్రకాశం భవనంలో రిబ్బన్ కట్ చేసే జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులతోపాటు వ్యాధి లక్షణాలు ఉన్న అనుమానితులు వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు కౌన్సిలింగ్ పొందేందుకు ప్రత్యేక వాహనాన్ని ప్రభుత్వం రూపొందించి జిల్లాకు అందించినట్లు చెప్పారు. ఈ వాహనంలో ఏర్పాటు చేసిన సదుపాయాలను కలెక్టర్ పరిశీలించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటేశ్వర్లు ఈ వాహనం వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వ్యాధిగ్రస్తులు పౌష్టికాహారం, తగిన జాగ్రత్తలు పాటించడం వల్ల వ్యాధి వ్యాప్తి చెందకుండా అరికట్టేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇంటిగ్రేటెడ్ కౌన్సిలింగ్ వాహనంలో ఒక వ్యక్తి మాత్రమే ఉండి పరీక్షలు చేయడంతో పాటు కౌన్సిలింగ్ ఇవ్వడం వల్ల రోగి యొక్క వివరాలు బయటకు తెలిసే అవకాశం లేదని చెప్పారు. కాబట్టి ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారి బాలాజీ, సెక్టరోల్ అధికారులు, ఎయిడ్స్ నివారణ, వెల్నెస్ సెంటర్ల సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు.

**పెన్ పవర్, కంభం నవంబర్ 14**

భారత తొలి ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎన్ ఆర్ తురిమెళ్ళ పాఠశాలలో బాలల దినోత్సవం ఎంతో ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించారు. చాచా నెహ్రూ కు పిల్లల పట్ల ఉన్న అపురూపమైన ప్రేమ అనురాగాలను ప్రధాన ఉపాధ్యాయుడు భాస్కర్ నాయుడు తెలియజేశాడు. ఉపాధ్యాయురాలు జ్యోతిలక్ష్మి పిల్లలను ఉద్దేశించి వారిలో ఉన్న గొప్పదనాలను తెలియజేస్తూ అందరూ చదవాలి అందరూ ఎదగాలి అని తెలియజేస్తూ పిల్లలను అభినందించి వారికి మిఠాయి పంపిణీ చేయడం జరిగినది. తరువాత ఆటపాటల్లో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేయడం జరిగినది.



# సీజనల్ వ్యాధులు ప్రభలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

### ఎంపీడీఓ వై.వెంకటేశ్వరరావు -పంచాయితీ రాజ్, వైద్యశాఖలతో ఎంపీడీఓ సమావేశం.

### ఇంటింటికి క్లోరిన్ మాత్రలు అందజేసి, గ్రామాల్లో ఫాగింగ్ చేయాలని సూచన.

**గుడ్లూరు, పెన్ పవర్, నవంబరు 14:**

స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచనల ప్రకారము వాతావరణ మార్పుల వలన సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశాలు ఉన్నందున ప్రజలు అనారోగ్య బారిన పడకుండా ముందస్తు చర్యలు చేపట్టే విధంగా వైద్య ఆరోగ్యశాఖ మరియు పంచాయతీరాజ్ శాఖ లు సమన్వయంతో పనిచేసి ప్రజల ఆరోగ్యానికి తమ వంతు బాధ్యతగా విధులు నిర్వహించాలని ఎంపీడీఓ వై.వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక గుడ్లూరు మండల పరిషత్ కార్యాలయము నందు శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ మరియు పంచాయతీరాజ్ శాఖలతో ఎంపీడీఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామపంచాయతీల వారిగా వ్యాధుల పట్ల అప్రమత్తత కోసం ముందస్తు చర్యల్లో భాగంగా త్రాగునీటి పైపు లైన్ల లీకేజీ, క్లోరినేషన్, శానిటేషన్ మరియు దోమల నిర్మూలన కొరకు ఫాగింగ్ చేయించడం చేయాలని, అదేవిధంగా మురుగునీరు నిల్వ లేకుండా చేయడంతో పాటు డ్రైడే- ఫ్రైడే నిర్వహించి ప్రజలందరికి కాచి చల్లార్చిన నీటిని తాగే విధంగా అవగాహనను కల్పించి,



ప్రతి ఇంటికి క్లోరిన్ టాబ్లెట్లను అందజేసే విధంగా కార్యాచరణ ప్రణాళికను తయారు చేసుకొని ప్రతి గ్రామపంచాయతీలో అనుసరించే విధంగా చూడాలని సూచించారు. అదేవిధంగా ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులకు ఉన్న నిచ్చెనలు కొన్నిచోట్ల రిపేర్లు ఉన్న విషయం గుర్తించి తక్షణమే రిపేర్లు చేపట్టే



విధంగా ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి పరిష్కరించే విధంగా సమావేశమందు చర్చించడమైనదన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అందరు పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, చేవూరు వైద్యాధికారిణి రమ్య దీపిక, డిప్యూటీ ఎంపీడీవో లక్ష్మీలత తదితరులు పాల్గొన్నారు.

## పుస్తక పఠనం మేధో వికాసానికి ఉత్తమ మార్గం

### - జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు





**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు పెన్ పవర్ నవంబర్ 14**

మేధో వికాసానికి పుస్తక పఠనమే ఉత్తమ మార్గమని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు చెప్పారు. అందుకే విద్యార్థులు అందరూ సెల్ ఫోన్ వదిలి పుస్తకంతో సహవాసం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని ఒంగోలులోని జిల్లా గ్రంథాలయంలో చేపట్టిన ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఒంగోలు మేయర్ గంగాడ సుజాతతో కలిసి ముందుగా సరస్వతి దేవి విగ్రహానికి, అనంతరం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి కూడా వారు పూలమాలవేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పుస్తకాలు చదవడాన్ని చిన్ననాటి నుంచే ఒక అలవాటుగా మార్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ దిశగానే గ్రంథాలయాలను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. విజ్ఞాన సమాజ ఆవిష్కరణ కోసం గ్రంథాలయాలను జ్ఞాన సముపార్జన కేంద్రాలుగా చేస్తున్నట్లు తెలిపారు. అవకాశం ఉన్న వారందరూ గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలు చదవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జ్ఞానాన్ని తిరిగి సమాజానికి అందించడంలోనూ భాగస్వాములు కావాలని ఆయన చెప్పారు. మేయర్ మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తకాలే ప్రియమైన నేస్తాలు అని చెప్పారు. పుస్తక పఠన ఆవశ్యకతను, స్వాతంత్ర్య పోరాటంలో గ్రంథాలయోద్యమం పోషించిన పాత్రను భావితరాలకు తెలియజేసేలా ప్రభుత్వం ఈ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శివారెడ్డి, కమిటీ సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గిద్దలూరు పట్టణంలో డాగ్ స్క్వాడ్ ముమ్మర తనిఖీలు





**గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 14**

ప్రకాశం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గిద్దలూరు పట్టణంలో భద్రతా వ్యవస్థను బలోపేతం చేయడానికి శుక్రవారం డాగ్ స్క్వాడ్ ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. అర్బన్ సీఐ సురేష్, ఆర్.ఐ.డి సురేష్ నేతృత్వం లోని బృందాలు సంయుక్తంగా పట్టణంలోని కీలక ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా గిద్దలూరు ఆర్టీసీ బస్టాండ్, కాంప్లెక్స్, రైల్వే స్టేషన్, పాతాళ నాగేశ్వర స్వామి ఆలయం పరిసరాలు, దిగువమెట్ట సహా పలు సున్నితమైన ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్‌ను



ఉపయోగించి అనుమానాస్పద వస్తువులు, సంచులపై విస్తృత తనిఖీలు చేపట్టారు. అధికారులు మాట్లాడుతూః ప్రజల భద్రత కోసం ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, పట్టణంలో ఎలాంటి అనుమానాస్పద పరిస్థితులు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. తనిఖీల సమయంలో పోలీసు శాఖకు చెందిన డాగ్ హ్యాండ్లర్లు, ప్రత్యేక బృందాలు పాల్గొన్నాయి. గిద్దలూరు పట్టణంలో భద్రతా చర్యలు మరింత కట్టుదిట్టం చేసినట్లు అధికారులు తెలిపారు.

## మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సేవా కార్యక్రమాలు



**మార్కాపురం టౌన్ పెన్ పవర్ నవంబర్14**

బాలల దినోత్సవం సందర్భంగా మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రెడ్డి ఉమెన్స్ కాలేజ్ లో పదిమంది మెరిట్ విద్యార్థినికులకు స్కాలర్షిప్ లు, నాలుగు బెంచీలు, జడ్.పి.హెచ్.ఎస్ బాయ్స్ 86, 87 బ్యాచ్ గ్రూప్ తరపున రెండు, కంభం సెంటర్ లో నాలుగు, కమల హ్యాపీ హోమ్స్ లో ఒకటి మొత్తం కలిపి 11 బెంచీలు ఏర్పటు చేసారు. దాతల సహకారంతోటి ఈ కార్యక్రమం ఉద్దేశించి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి అన్నా రాము మాట్లాడుతూ మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ తరపున మొత్తం తొమ్మిది కార్యక్రమాల్లో భాగంగా పేద విద్యార్థులకు పది మందికి స్కాలర్షిప్ ను అందజేసామన్నారు. మార్కాపురం పరిసర ప్రాంతాల్లో దాతల సహకారంతోటి 11 బెంచీలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలకు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు గుంటక సుబ్బారెడ్డి, కోశాధికారి తడికమల్ల శ్రీనివాసరావు, పేరం సత్యనారాయణ గారు, తన్నీరు వెంకటరమణ ,పివి కృష్ణారావు ,కంచర్ల చెన్న కృష్ణ, బచ్చుసుబ్రహ్మణ్యం, కలవ భాస్కర్, డి.వి.ఆర్, జలీల్ భాష, భక్తాంజనేయులు, కమిటీ సభ్యులు డైరెక్టర్లు పాల్గొనడం జరిగింది.



## దేశం గర్వించదగ్గ మహానేత జవహర్ లాల్ నెహ్రూ

### స్ఫూర్తి వెల్ఫేర్ సొసైటీలో ఘనంగా నెహ్రూ జయంతి వేడుకలు



**మార్కాపురం టౌన్ పెన్ పవర్ నవంబర్14**

నవభారత నిర్మాత,పంచశీల సూత్రాల రూపశిల్పి,దివంగత మాజీ ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ 136వ జయంతి వేడుకలు పట్టణంలో ని స్ఫూర్తి వెల్ఫేర్ సొసైటీ లో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళులర్పించారు. అనంతరం చిన్నారులకు స్వీట్లు,బిస్కెట్లు,పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ ప్రధాన కార్యదర్శి,సివిల్ పబ్లిక్ వెల్ఫేర్ సర్వీస్ రాష్ట్ర అధ్యక్షులు,యోగ్దానం సహర సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ షేక్ మహబూబ్ వలి మాట్లాడుతూ రాష్ట్రంలో కేజీ నుండి పీజీ వరకు ఉచితంగా విద్యను ప్రభుత్వం అందించాలని కోరారు.నేటి సమాజంలో వైద్య ఖర్చులు అధికమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వమే ఉచిత వైద్య సదుపాయాలు కల్పించాలని సూచించారు.పంచశీల సూత్రాల రూప శిల్పి భారతరత్న జవహర్లాల్ నెహ్రూ పుట్టినరోజు వేడుకలు ఇలాంటి పిల్లల మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు.ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సయ్యద్ ఇమ్రాన్,సామెల్, సయ్యద్ రబ్బాని,రాజేష్ గౌడ్, సాయికుమార్,షేక్ ఇమ్రాన్, షేక్ అల్తాఫ్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజా సంఘాల నాయకులు,స్ఫూర్తి వెల్ఫేర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు ప్రభుత్వం మైనారిటీల సంక్షేమం పట్ల ప్రత్యేక దృష్టి

### జిల్లా తెలుగుదేశం మైనారిటీ నేత రసూల్ స్పష్టం



**పొదిలి, పెన్ పవర్, నవంబర్ 14**

చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రంలోని మైనారిటీల సంక్షేమం పట్ల ప్రత్యేక దృష్టి సారిస్తుందని జిల్లా తెలుగుదేశం పార్టీ మైనారిటీ విభాగపు అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్ చెప్పారు. శుక్రవారం నాడు ఆయన పొదిలిలో మాట్లాడుతూ నవంబర్ 11వ తేదీన మౌలానా అబుల్ కలాం జయంతి ని పురస్కరించుకొని జరుపుకుంటున్న మైనారిటీ సంక్షేమ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని మైనారిటీలకు చెందిన ఇమామ్ మరియు మౌజన్ లకు గౌరవ వేతనాలను 90 కోట్లు విడుదల చేయడం ఎందుకు నిదర్శనంగా రసూల్ చెప్పారు. గత జగన్ ప్రభుత్వ హయాంలో ముస్లింలకు జరిగిన మేలేమీ లేదని రసూల్ విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు , రాష్ట్ర మంత్రి నారా లోకేష్ లు ఇమామ్ మరియు మౌజనులకు గౌరవ వేతనాలను ఇవ్వడం ఎంతో సంతోషదాయకమన్నారు. పేద వర్గాలకు చెందిన వారికి ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుందని రసూల్ చెప్పారు. రాష్ట్రంలోని ఇమామ్ లు మరియు మౌ జన్ లకు వేతనాల కోసం నిధులు ప్రభుత్వం విడుదల చేసేందుకు కృషిచేసిన రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి ఫరూక్, రాష్ట్ర మైనారిటీ సలహాదారులు ఎంఏ షరీఫ్, రాష్ట్ర ముస్లిం బోర్డు చైర్మన్ అజీజ్, రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహమ్మద్ మరియు హజ్ కమిటీ చైర్మన్ హసన్ భాష తదితరులకు ముస్లిం మైనారిటీల తరపున రసూల్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# అవినీతి కథనాలు మీ మానస పత్రికలోనే వస్తున్నాయి ఒక్కసారి చూసుకోండి

- జిల్లా సెక్రెటరీ చీమల వెంకట రాజా
- ఎమ్మెల్యే గా బుర్రా చేసిన అభివృద్ధి పరిశీలించడానికి మీలో ఎవరొస్తారో తేల్చుకోండి
- ఉలవపాడు మండల అధ్యక్షులు నన్నం పోతురాజు
- కులాలు మతాలు ప్రాంతాలుగా ప్రజలను విడగొడుతుంది మీ తెలుగుదేశం పార్టీనే
- వైకాపా పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ
- అవినీతి, అక్రమాల్లో ఆరితేరిన జనిగర్ల నీవా బుర్రాని విమర్శించేది
- నియోజకవర్గ యూత్ అధ్యక్షులు మద్ద సాని నవీన్
- రేషన్ బియ్యం వ్యాపారాల్లో హద్దులు ఏర్పాటు చేసుకుని దందా చేస్తున్న మీరా బుర్రాని విమర్శించేది
- గుడ్లూరు మండల ఉపాధ్యక్షులు కాట్రగడ్డ వెంకట్రావు
- మహిళలతో ఎలా ప్రవర్తించాలో మీ తెలుగుదేశం నాయకులకు నేర్పండి
- పట్టణ వైకాపా మహిళా అధ్యక్షురాలు కొత్తగొర్ల వసంత లక్ష్మి





**కందుకూరు పెన్ పవర్, నవంబర్ 14:**

ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయవద్దని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేసిన నిరసన కార్యక్రమంలో ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ లేవనెత్తిన అవినీతి అంశాలను పక్కనపెట్టి వ్యక్తిత్వ విషయాలు తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడటం సరైనది కాదని వైఎస్సార్ సీపీ నాయకులు స్థానిక పామూరు రోడ్ లోని పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో హితవు పలికారు. స్థానిక అధికార పార్టీ ఎమ్మెల్యే చేస్తున్న అవినీతి అక్రమాలు మట్టి ఇసుక దందా రేషన్ మాఫియా కల్తీ మద్యం పేకాట శిబిరాల నిర్వహణలాంటి అంశాలపై మాట్లాడితే సరైన సమాధానం చెప్పలేక తెలుగుదేశం పార్టీ నాయకులు పిచ్చి పిచ్చి ప్రేలాపన పేలుతున్నారని అన్నారు.మీ మానస పత్రిక లో వచ్చిన కథనాల్లో దేన్నైనా ఖండించారా లేక అప్పుడు ఏమన్నా గుడ్డి గాడిద పల్లుతోముతున్నారా అని జిల్లా సెక్రెటరీ చీమల వెంకటరాజా అన్నారు. తెలుగుదేశం పార్టీ వాళ్ళు చేస్తున్న తప్పుడు ఆరోపణలను తిప్పి కొట్టారు. అవినీతి జరగలేదని మీరు చెప్పుకోవటం కాదు ప్రజలు ప్రతిదీ గమనించగలరు అని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే మహీధర్ రెడ్డి సుమారు 26 కోట్ల రూపాయలకు పట్టణంలో అభివృద్ధి పనులకు టెండర్లు పిలిస్తే ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో అప్పటికే సుమారు 14 కోట్ల రూపాయలు అభివృద్ధి పనులు చేశారన్నారు. మిగిలిన టెండర్లు రద్దు చేసి అదే పనులను ప్రస్తుతం టిడిపి వారు చేస్తూ అభివృద్ధి అని చెప్పుకోవటం హాస్యాస్పదమన్నారు. ఉలవపాడు మండల అధ్యక్షులు నన్నం పోతురాజు మాట్లాడుతూ బుర్రా మధుసూదన్ యాదవ్ ఎమ్మెల్యేగా కనిగిరిలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి సంక్షేమాన్ని పరిశీలించడానికి మీలో ఎవరు వస్తారో తేల్చుకోండి అంటూ బహిరంగ సవాల్ విసిరారు. టీటీడీ బోర్డు మెంబర్ గా ఉన్న బుర్రా మధుసూదన్ యాదవ్ హిందూ ధర్మాన్ని పాటించే దళిత కాలనీలో వెంకటేశ్వర స్వామి దేవాలయాలు నిర్మించారు, దాదాపు 50 వేలకు పైగా ప్రజలను ఉచితంగా కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామిని దర్శింపచేశారు ఇది ఆయన రికార్డు అన్నారు. మూడు నియోజకవర్గాల్లో విస్తరించిన ఓవి రోడ్డు పనులను 112 కోట్లు శాంక్షన్ చేయించి త్వరగా పూర్తి చేయడానికి ప్రయత్నించారు. అప్పటి కాంట్రాక్టర్ ఇప్పుడు మీ కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా ఉండి మీరు వచ్చిన ఈ 18 నెలల్లో పనులు ఎందుకు పూర్తి చేయించలేకపోయారో ఒక్కసారి పరిశీలించుకుంటే బాగుంటది అని హితవు పలికారు. సింగరాయకొండ-మైదుకూరు హైవే లో కాంట్రాక్టర్ను బెదిరించి కమిషన్ కోసం బేరాలు చేసి మీ అధిష్టానం దగ్గర చివాట్లు తిన్నది మీ ఎమ్మెల్యే కాదా అని ప్రశ్నించారు. మాలకొండను ప్రైవేటు కంపెనీలకు దారా దత్తం చేయడానికి ప్రయత్నిస్తుంది మీరు కాదా దీనిని బట్టి అవినీతి అనకొండ ఎవరో ఇట్టి అర్థమవుతుందని విమర్శించారు.

పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ మాట్లాడుతూ బుర్రాను విమర్శించే స్థాయి మీది కాదు పట్టణంలో గంజాయి, స్మగ్లింగు, వ్యభిచార గృహాల నిర్వహణ తెలుగుదేశం పార్టీ నాయకులు బహిరంగంగా చేస్తున్నారని పోలీసులకు పట్టుబడి మాఫీ చేసుకోవటానికి ప్రయత్నించి అమాయకులను బలి చేసిన చరిత్ర మీ తెలుగుదేశం పార్టీ వారిదే అని అన్నారు. అన్ని అనుమతులతో టెండర్ ద్వారా దక్కించుకున్న బిఎస్ఎన్ఎల్ రూములను ఎటువంటి సంబంధం లేని మున్సిపాలిటీ వారిని రెచ్చగొట్టి సీజ్ చేయించారు. పొట్టకూటి కోసం అక్కడ వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారస్తులను బజారున పడేయించింది మీ తెలుగుదేశం పార్టీ అండదండలతోనే. అక్రమంగా వ్యాపారస్తులు దగ్గర డబ్బులు వసూలు చేశారని మాట్లాడే మీరు నిరూపించగలరని సవాల్ విసిరారు. ప్రతి నెల క్రమం తప్పకుండా బిఎస్ఎన్ఎల్ కు రెంట్ కడుతూనే ఉన్నామని తెలిపారు. మీ ఎమ్మెల్యే పై తెలంగాణలో భూకంభకోణానికి సంబంధించిన వార్తలు పత్రికల్లో ప్రతిరోజు వస్తూనే ఉన్నాయి ఇది జరగలేదని మీరు నిరూపించగలరా. మేము మీ అవినీతిని నిరూపిస్తే మీరు రాజకీయ సన్యాసం తీసుకుంటారా అని అన్నారు. కులాలకు మతాలకు ముడిపెట్టి గత 40 సంవత్సరాలుగా ప్రశాంతంగా అంకమ్మ తల్లి దేవాలయ ప్రాంగణంలో వ్యాపారం నిర్వహించుకుంటున్న వారిపై కక్ష పూరిత ధోరణితో అన్య మతస్తులని ముద్ర వేసి కులాల్ని మతాన్ని రెచ్చగొడుతుంది మీరేనని తీవ్రంగా విమర్శించారు. నియోజకవర్గ యువజన అధ్యక్షులు మద్దసాని నవీన్ మాట్లాడుతూ మా ఇన్చార్జి పదే పదే నాన్ లోకల్ అని మాట్లాడుతున్నారు. మీకు ఏమాత్రం ఇంగిత జ్ఞానం ఉన్నా ఈ విషయాన్ని మాట్లాడరు బుర్రా మధుసూదన్ యాదవ్ పుట్టుక మూలాలు ఈ నియోజకవర్గంలోనే ముడిపడి ఉన్నాయన్న సంగతి గుర్తుఎరిగి మాట్లాడితే మంచిది. గతంలో ఇన్చార్జిగా ఈ నియోజకవర్గంలో పనిచేసిన అనుభవం ఉన్నది ఈ విషయాలు మాట్లాడుతున్న తెలుగుదేశం పార్టీ నాయకుడు జనిగర్ల నాగరాజు అవినీతి అక్రమాలకు పాల్పడిన చరిత్ర నీది.గత ఎన్నికల్లో మా పార్టీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి దగ్గర నీ బంధువుల రెకమండేషన్ తో డబ్బులు తెచ్చుకున్న సంగతి మరిచిపోయావా. గుడ్లూరు మండలంలో నాగరాజు తన తోటి కాంట్రాక్టర్లను మోసగించి బిల్లులన్నీ చేసుకుంటే గుడ్లూరు పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇచ్చిన సంగతి మరిచిపోయావా అని అన్నారు. అర్హత లేని వారి దగ్గర డబ్బులు తీసుకుని ఒక రైతు పొలాన్ని మరొక రైతుకు ఎక్కించి మండలంలోని తాసిల్దార్ ఆఫీస్ లో నీ అవినీతి బయటపడ్డ సంగతి తెలియదు అనుకుంటున్నావా. తెట్టు ఎస్.టి మహిళ దగ్గర అంగనవాడి పోస్ట్ ఇప్పిస్తానని లక్ష రూపాయలు వసూలు చేసిన నీవా బుర్రా మధుసూదన యాదవుని విమర్శించేది నీ స్థాయి తెలుసుకొని ప్రవర్తిస్తే బాగుంటుందని అన్నారు.

గుడ్లూరు మండల ఉపాధ్యక్షులు కాట్రగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ హద్దులు గీసుకుని రేషన్ దందాలను నిర్వహిస్తుందని ఈ హద్దులు దాటిన వారిపై పెట్రోల్ పోసి తగలపెడతామని బహిరంగంగా మాట్లాడుతున్నారని అన్నారు. పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు అయితే ఒక అడుగు ముందుకు వేసి ఒక మహిళ ను కూడా చూడకుండా ఫోన్ చేసి భయభ్రాంతులకు గురిచేసి బెదిరించిన సంగతి ఆడియో రూపంలో వైరల్ అయిందని అన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాలో కందుకూరు నియోజకవర్గం అగ్రస్థానంలో ఉందంటే అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవాలని ఎప్పటికైనా మీ అవినీతి చర్యలు కప్పి పుచ్చుకునేందుకు ఎదుటి వారిపై నిందారోపణ చేయొద్దని అన్నారు. కొత్తగర్ల వసంత మాట్లాడుతూ

మా ఇన్చార్జి ఉచిత బస్సు ఇస్తున్నారు కానీ పథకాలు ఇస్తే కదా డబ్బులు ఉండేది అని అన్నారు. దానిని వక్రీకరిస్తూ క్షమాపణ చెప్పాలి అని మీరు అంటున్నారు. ప్రజల తరఫున ఉచిత బస్సు ఇచ్చారు. పథకాలు కూడా అమలు చేస్తే ప్రతి పేదవారి దగ్గర డబ్బులు ఉంటాయి అనటం తప్పా.ఇంటూరి నాగేశ్వరరావుకి వ్యతిరేకంగా షేక్ రఫీ ఇండిపెండెంట్గా నామినేషన్ వేసి డబ్బులు తీసుకొని రాజీ పడిన సంగతి తెలియదు అనుకున్నావా.బుర్రా.మధుసూదన్ యాదవ్ ను కించపరిచే విధంగా మాట్లాడితే మీరు ఏ విధంగా నియోజకవర్గంలో మోసాలు చేశారో అన్ని మాకు తెలుసు అని అన్నారు

నియోజకవర్గ అంగనవాడి అధ్యక్షురాలు దేవరకొండ ఆదిలక్ష్మి మాట్లాడుతూ ఉన్న పథకాలన్నీ ఊడబెరికి ఉచిత బస్సు ఇస్తే మహిళలకు ఒరిగేది ఏంటని సూటిగా ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వ మోసాలను మహిళలు నిలదీయాల్సిన అవసరం కూడా ఉందని ఈ సందర్భంగా అన్నారు. విలేకరుల సమావేశంలో గణేశం గంగిరెడ్డి, ముప్పవరపు కిషోర్, రావులకొల్లు బ్రహ్మానందం, గేరా మనోహర్, తల్లపనేని గోపి, కూరపాటి వెంకట్రామిరెడ్డి, ఉచ్చులూరి రవీంద్ర, నల్లమోతు చంద్రమౌళి,చనమాల కోటేశ్వరరావు, ఉప్పుటూరి నాగేశ్వరరావు, షేక్ రహీం, కొల్లిపర శ్రీనివాసులు, మల్లె బోయిన శివకృష్ణ, కాపులూరి మధుసూదన్, పఠాన్ ఆయుబ్ ఖాన్, కోరిశపాటి రవికాంత్ రెడ్డి, పెయ్యాల వెంకట రమణయ్య, షేక్ జిలాని, షేక్ సుల్తాన్, తుళ్లూరు ఆదిలక్ష్మి, తన్నీరు ధరణి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ అంకమ్మ తల్లి అమ్మవారి ఆలయ నిర్మాణానికి రూ. 25,116 విరాళం



**కందుకూరు పెన్ పవర్, నవంబర్ 14**

కందుకూరు గ్రామ దేవత ఆదిపరాశక్తి శ్రీ అంకమ్మ తల్లి అమ్మవారి ఆలయ అనివేటి మండప నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అమ్మవారి భక్తులు ఆలయ నిర్మాణానికి విరాళాలు అందజేస్తున్నారు. శుక్రవారం గుర్రం వెంకటేశ్వర్లు ధర్మపత్ని పద్మజ, కుమారుడు వేణుగోపాల్ ధర్మపత్ని సత్యవతి, మనుమళ్లు వెంకట సాయి దత్త మోక్షత్, వెంకట సాయి దత్త జితేంద్రకుమార్ లు రూ. 25,116 విరాళాన్ని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. దాతలకు వారి కుటుంబ సభ్యులకి అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని నిర్మాణ కమిటీ సభ్యులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టెలికాం బోర్డు మెంబర్ గుర్రం మాల్యాద్రి, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కొడాలి కోటేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, ఎనిమిరెడ్డి వెంకటరెడ్డి, ఆర్యవైశ్య మీడియా చైర్మన్ చక్కా వెంకట కేశవరావు, దాత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పెండ్లి కుమార్తెను ఆశీర్వదించిన ఇంటూరి సౌజన్య






**కందుకూరు పెన్ పవర్, నవంబర్ 14**

పట్టణంలోని 1వ వార్డు యర్రగుంటపాలెంలో తెలుగుదేశం పార్టీ పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు ముచ్చు వేణు కుమార్తె తేజస్విని వివాహం సందర్భంగా ఇంటివద్ద జరిగిన నలుగు కార్యక్రమానికి హాజరై తేజస్విని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, ముప్పవరపు వేణు, పసుపులేటి రమణయ్య, చంద్రశేఖర్ రాజు, ధనికుల ప్రసాద్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

## 16న మల్లవరంలో రెడ్డి సంఘం వన భోజన మహోత్సవం

**- రెడ్డి జనాభ్యుదయ సంఘం అధ్యక్షులు కె వి రమణా రెడ్డి**



**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు నవంబర్ 14**

రెడ్డి సంఘం కార్తిక మాస వన భోజన మహోత్సవ కార్యక్రమాన్ని ఈ నెలా 16వ తేదీన మల్లవరం లోని గుండ్లకమ్మ రిజర్వాయర్ నందు నిర్వహిస్తున్నట్లు రెడ్డి జనాభ్యుదయ సంఘం అధ్యక్షులు కెవి.రమణ రెడ్డి తెలిపారు. ఒంగోలు లోని రెడ్డి హాస్టల్ నందు జరిగిన సమావేశంలో కార్యక్రమం వివరాలను ఆయన వెల్లడించారు. రెడ్డి జనాభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో వన బోజన మహోత్సవ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన ప్రముఖులతో పాటు ఆర్థికంగా, రాజకీయంగా, వ్యాపారవేత్తగా స్థిరపడిన ప్రముఖుల హాజరు అవుతారని తెలిపారు. కార్యక్రమంలో పూజ కార్యక్రమాలు,ఆట పాటలు,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వన బోజన మహోత్సవాలకు విచ్చేసే రెడ్డి కుటుంబ సభ్యులకు వాహన సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రెడ్డి సోదరి సోదరీమణులు అందరూ పాల్గొని విజయవంతం చేసి ఐకృత చాటాలని కోరారు. సమావేశంలో పలగాని రామసుబ్బారెడ్డి,పోలవల్లి నరసింహ రెడ్డి,హాస్టల్ ఫౌండర్ పి.వెంకటరామిరెడ్డి,వెన్నపూస వెంకటేశ్వర రెడ్డి,నల్లమలపు బ్రహ్మారెడ్డి,ఎన్.ఎల్ నరసా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అల్లినగరం హైస్కూల్లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

**కొమరోలు పెన్ పవర్ నవంబర్ 14**

భారత మొదటి ప్రధానమంత్రి పండిట్ జవహర్లాల్ నెహ్రూ జయంతోత్సవాన్ని పురస్కరించుకుని కొమరోలు మండలం అల్లినగరంలో గల మునగనూరి వెంకటసుబ్బయ్య అండ్ సన్స్ జిల్లా పరిషత్ హై స్కూల్లో బాలల దినోత్సవం వేడుకలు ఆనంద ఉత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు ఆ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మామిడి పద్మజ అధ్యక్షత వహించి పండిట్ జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు విద్యార్థులు నెహ్రూ చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మామిడి పద్మజ మాట్లాడుతూ పండిట్ జవహర్లాల్ నెహ్రూ భారతదేశానికి స్వాతంత్రాన్ని సాధించి పెట్టడంలో కీలకపాత్ర పోషించారన్నారు భారత దేశానికి స్వాతంత్రం వచ్చిన తరువాత మొదటి ప్రధానమంత్రిగా పనిచేసే భారత దేశ అభివృద్ధికి ప్రజా సంక్షేమానికి ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు ఉన్నత కుటుంబంలో పుట్టిన నెహ్రూ స్వాతంత్ర సమర సందర్భంగా అనేక పర్యాయాలు జైలు కూడా వెళ్లారని అయినప్పటికీ భారతదేశానికి స్వాతంత్రం సంపాదించి పెట్టడమే లక్ష్యంగా ఆయన తన జీవితాన్ని త్యాగం చేశారని పేర్కొన్నారు జవహర్లాల్ నెహ్రూ కు చిన్నపిల్లలంటే ఎంతో మక్కువ అని అందువల్ల ఆయన తన పుట్టినరోజును పిల్లల మధ్య జరుపుకోవడానికి ఇష్టపడే వారిని తెలిపారు అందువల్ల తన పుట్టినరోజును బాలల దినోత్సవం గా జరుపుకోవాలని నెహ్రు కోరారని అందువల్ల పిల్లలు నెహ్రూను చాచా నెహ్రూగా పిలుచుకుంటూ ఆయన పుట్టినరోజును బాల దినోత్సవం గా జరుపుకోవడం సాంప్రదాయంగా వస్తుందని తెలిపారు నేటి విద్యార్థులు గొప్ప విద్యావంతులై నెహ్రూ ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు ఆ కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు ఎం హరికుమార్ చౌదరి ఎం చేయ ఎస్ చంద్రమోహన్ వి శివరాం కె ఆదిలక్ష్మి ఎం కృష్ణమూర్తి ఉమ్మడి శ్రీనివాసులు బోధ నేతర సిబ్బంది అశ్వినీ దేవి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## బంగారు భారతం బాలలతోనే సాధ్యం

**- ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు**

**క్రైం రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ నవంబర్ 14**





బాలల దినోత్సవం సందర్భంగా ఒంగోలులోని సోనియా గాంధీ నగర్ అంగనవాడి స్కూల్ చిన్నారులు శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు వారితో ఆప్యాయంగా ముచ్చటించి, చాక్లెట్లు పంచి, చిన్నారులతో కరచాలనం చేయడంతో వారిలో అవధుల్లేని ఆనందం వ్యక్తమైంది. చిన్నారులందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, భారత తొలి ప్రధాన మంత్రి పండిట్ జవహర్లాల్ నెహ్రూకు పిల్లలంటే ఎంతో ఇష్టమని, ఆయన ఎక్కడికి వెళ్లినా పిల్లలను సమీపించుకుని వారితో ముచ్చటించేవారన్నారు. నెహ్రూ మంచి విద్యావేత్తగా, ఆర్థికవేత్తగా, ప్రధానిగా దేశానికి విశేష సేవలు అందించారని, భారత జాతీయోద్యమంలో ప్రముఖ పాత్ర పోషించారని పేర్కొన్నారు. 1964లో నెహ్రూ మరణించిన అనంతరం ఆయన పుట్టిన రోజైన నవంబర్ 14న బాలల దినోత్సవం గా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పిల్లలు ఏ కుటుంబానికైనా, సమాజానికైనా, దేశానికైనా మూలస్తంభాలన్నారు. వారికి ప్రేమ, భద్రత, మంచి విద్య, విలువలు నేర్పించడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. నేటి బాలల చేతుల్లోనే రేపటి భారత భవిష్యత్తు ఉందని, పిల్లల అభివృద్ధికి మంచి విద్యతో పాటు విలువలు, క్రమశిక్షణ, ధైర్యం ఎంతో అవసరమన్నారు. చిన్నారులకు సురక్షితమైన వాతావరణం, ప్రేమ, ప్రోత్సాహం లభిస్తే వారు ఏ రంగంలోనైనా విజయం సాధిస్తారు. చదువు, క్రీడలు, సృజనాత్మకత అన్ని స్థాయిలో ఎదగటం ద్వారా వారు మంచి పౌరులుగా మారతారన్నారు. విద్యార్థులు ఏ రంగాన్ని ఎంచుకున్నా, వాటిలో నిష్ణాతులుగా ఎదిగేందుకు ప్రయత్నం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. పిల్లల హక్కులను కాపాడటం, వారి బాల్యాన్ని రక్షించడం ప్రతి కుటుంబం మరియు సమాజం భాద్యతని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్బి ఇన్స్పెక్టర్ ఎం శ్రీనివాసరావు, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ దేవప్రభాకర్, ఆర్ఐ సీతారామిరెడ్డి, సోషల్ మీడియా ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, అంగనవాడి టీచర్ జ్యోతి, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా సాయి బాలాజీ హై స్కూల్‌లో బాలల దినోత్సవం

**మార్కాపురం టౌన్ పెన్ పవర్ నవంబర్14**

స్థానిక శ్రీ సాయి బాలాజీ హైస్కూల్లో శుక్రవారం భారతరత్న పండిత్ జవహర్ లాల్ నెహ్రు 136వ జయంతి సందర్భంగా బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ పి ప్రకాష్ రావు, ప్రధానోపాధ్యాయులు మస్తాన్ వలి మాట్లాడుతూ నెహ్రూ భారతదేశానికి మొదటి ప్రధానమంత్రిగా సేవలందించి భారతదేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్న కూడా అందుకోవడం జరిగిందని అన్నారు. నెహ్రూ గురించి చక్కగా విద్యార్థులకు వివరించారు. పిల్లలందరూ విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణతో చక్కని విద్యాబుద్ధులను నేర్చుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని పిల్లలందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, నెహ్రూ వేషధారణలు ఆకట్టుకున్నాయి.




అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

# నాగార్జున స్కూల్లో ఘనంగా బాలల దినోత్సవం





**కందుకూరు పెన్ పవర్, నవంబర్ 14:**

స్వాతంత్ర సమరయోధులు, భారత ప్రథమ ప్రధాని, చాచా నెహ్రూ జయంతి సందర్భంగా కందుకూరు నాగార్జున ఇంగ్లీష్ మీడియం స్కూలు నందు బాలల దినోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు నాగార్జున ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రధానోపాధ్యాయులు ప్రకాష్ అధ్యక్షత వహించారు. ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ వి.షాలిని రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ బాలల హక్కులు గురించి, భారత రాజ్యాంగంలో బాల, బాలికలకు పొందుపరిచిన చట్టాలపై అవగాహన కల్పించారు. బాల బాలికలందరూ దేశ భవిష్యత్తు కోసం ఉన్నత రంగాల్లో రాణించాలని తెలిపారు. బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కూలు మేనేజ్మెంట్ వి. మగ్రెడ్డి, కరణం శ్రీనివాసరావు పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు. పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు అందరిని అలరించాయి.

# శ్రీ సంస్కృతి స్కూల్లో బాలల దినోత్సవ వేడుకలు







**కందుకూరు పెన్ పవర్, నవంబర్ 14**

పట్టణంలోని గుర్రంవారి పాలెంలోని శ్రీ సంస్కృతి స్కూల్లో శుక్రవారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి అందులో గెలుపొందిన వారికి ప్రిన్సిపాల్ చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేసారు. అంతేకాకుండా యాజమాన్యం వారు ప్రతి క్లాసుకు కేక్ పంపించి కట్ చేయించి పిల్లల ఆనందంలో కూడా యాజమాన్యం ఉపాధ్యాయులు పాలుపంచుకున్నారు. ఆ తరువాత విద్యార్థులు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ కొంకా చంద్రశేఖర్ జవహర్ లాల్ నెహ్రూ పుట్టినరోజును బాలల దినోత్సవం ఎందుకు జరుపుకుంటామో విద్యార్థులకు తెలియజేసి నేటి బాలల చేతుల్లోనే రేపటి భవిష్యత్తు ఉందని, దేశానికి దిశా నిర్దేశం చూపే బాలలు చిన్నప్పటినుంచి క్రమశిక్షణతో విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని కోరుకుంటూ విద్యార్థులందరికీ బాలల దినోత్సవం శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరి, వైస్ ప్రిన్సిపాల్ శోభా రాణి, అకడమిక్ కో-ఆర్డినేటర్ శకుంతల, ఉపాధ్యాయులు విద్యార్థుల యొక్క ఆనందంలో పాలుపంచుకొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా బాలల దినోత్సవం

**కందుకూరు పెన్ పవర్ నవంబర్ 14**



పట్టణంలోని పడమట మంగళపాలెం అంగన్వాడీ కేంద్రంలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్త దామా అనూష మాట్లాడుతూ చిన్నారులకు బాలల దినోత్సవం యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం చిన్నారులకు చాక్లెట్లు స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో హెల్పర్ అపర్ణ పాల్గొన్నారు.

# అన్ని పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి

## విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలి

## రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బి.కాంతారావు









**కందుకూరు, పెన్ పవర్, నవంబర్ 14**

రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎటువంటి లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బక్కమంతుల కాంతారావు అధికారులకు సూచించారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం నెల్లూరుజిల్లాకు విచ్చేసిన ఆహార కమిషన్ సభ్యులు కాంతారావు శుక్రవారం గుడ్లూరు, కందుకూరు మండలాల్లో పర్యటించారు. గుడ్లూరు లో జిల్లా పరిషత్ హై స్కూల్, అంగన్వాడి కేంద్రాన్ని ఫుడ్ కమిషన్ సభ్యులు తనిఖీ చేశారు. కందుకూరు మండలంలో మాచవరం జిల్లా పరిషత్ హైస్కూల్, కందుకూరులోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల హైస్కూళ్లను అధికారులతో కలిసి తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. విద్యార్థులకు అందిస్తున్న కోడిగుడ్లను పరిశీలించారు. పలు రికార్డులను తనిఖీ చేసి, పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు కాంతారావు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మంచి పౌష్టికాహారాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తుందని చెప్పారు. మంచి మెనూను రూపొందించి, అన్ని పోషక విలువలు లభించేలా విద్యార్థులకు ఆహారాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. ఈ పథకం అమలుపట్ల పాఠశాల ఉపాధ్యాయులు, అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో విద్యార్థులకు అందించే ఆహార విషయంలో అశ్రద్ధగా ఉన్నా, నాణ్యతా ప్రమాణాలు పాటించకపోయినా ఊరుకునే ప్రసక్తి లేదని హెచ్చరించారు. రుచిగా, శుచిగా పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని సూచించారు. చౌక దుకాణాల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు బియ్యం చక్కెరను సకాలంలో అందించాలన్నారు. పౌర సరఫరాల విషయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులందరూ సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.

ఫుడ్ కమిషన్ సభ్యులు వెంట డీఎస్ఓ లీలారాణి, డిఎం అర్జున్ రావు, సమన్వయ అధికారి సైమన్ బాబు, ఎంఈఓ లు శర్మ, సుబ్బారెడ్డి, ప్రధానోపాధ్యాయులు నరసింహమూర్తి, ద్వారకా రాణి, సిడిపిఓ ఉషారాణి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

## పలుకూరు పాఠశాల విద్యార్థులకు

# ఐడి కార్డుల బహుకరణ





**కందుకూరు పెన్ పవర్,నవంబర్ 14**

బాలల దినోత్సవం సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి కూనం సుబ్బారెడ్డి మోడల్ ప్రైమరీ స్కూల్ పలుకూరు పాఠశాలలో చదువుతున్న 90 మంది విద్యార్థులకు గుర్తింపు కార్డులు బహుకరించారు. ఈ సందర్భంగా దాత, మండల విద్యాశాఖ అధికారి సుబ్బారెడ్డి మాట్లాడుతూ తాను ఇదే పాఠశాలలో ప్రాథమిక విద్యాభ్యాసం చేయడం జరిగిందని బాల్య స్మృతులను గుర్తు చేసుకున్నారు. ప్రభుత్వం విద్య కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నదని, అనేక సౌకర్యాలు కల్పిస్తున్నారని పలుకూరులో మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు చేయడం ద్వారా తరగతికొక ఉపాధ్యాయుడు, తల్లికి వందనం, డొక్కా సీతమ్మ మధ్యాహ్నబడి భోజనం ద్వారా సన్న బియ్యంతో కూడిన భోజనం, స్టూడెంట్ కిట్ ,మనబడి మన భవిష్యత్తు ద్వారా విశాలమైన తరగతి గదులు స్మార్ట్ టీవీ, ప్రొజెక్టర్ ఇంటర్నెట్ సౌకర్యం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థులు పోటీ ప్రపంచంలో ముందుకు వెళ్తున్నారని తల్లిదండ్రులంతా ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసి తమ విద్యార్థులందరినీ ఇక్కడే చేర్పించాలని కోరారు విద్యార్థులందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథి నాగ కుమార శర్మ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఈ పాఠశాల పూర్వ విద్యార్థి మండల విద్యాశాఖ అధికారి సుబ్బారెడ్డి పాఠశాలలోని విద్యార్థులందరికీ ఐడి కార్డులు ఇవ్వడం అభినందనీయం అని తెలిపారు. అనంతరం వారు నెహ్రూ జీవిత విశేషాలను తెలియజేసి చిన్నారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రధానోపాధ్యాయులు సుధాకర రావు మాట్లాడుతూ దాత మండల విద్యాశాఖ అధికారి సుబ్బారెడ్డి విద్యార్థులందరికీ ఐడీ కార్డులు ఇవ్వడం సంతోషకరమని ఉపాధ్యాయులందరి తరపున వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు . ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ షౌకతుల్లా, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ వేముల నరేష్ ఉపాధ్యాయులు గీత ,శ్రీనివాసులు, పివి రమేష్, గౌస్ ఉన్నిసా బేగం సిఆర్ఎంటిలు శ్రీనివాసరావు వెంకటేష్ లు పాల్గొన్నారు.

# బాలల హక్కులపై న్యాయ విజ్ఞాన సదస్సు






**కందుకూరు పెన్ పవర్, నవంబర్ 14**

మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం సందర్భంగా కందుకూరు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ద్వారకా రాణి అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో న్యాయవాదులు పోకూరి కోటయ్య, పండిట్ సంపత్, ముప్పవరకు కిషోర్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ బాలల హక్కులు గురించి, భారత రాజ్యాంగంలో బాల బాలికలకు పొందుపరిచిన చట్టాలపై అవగాహన కల్పించారు. బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ న్యాయ విజ్ఞాన సదస్సులో పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు. న్యాయవాది సంపత్ కుమార్ మౌనంగానే ఎదగమని పాడిన పాట పిల్లల్లో ఉత్సాహాన్ని నింపింది.

# బి.ఆర్ ఆక్స్ ఫర్డ్ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు





**కందుకూరు పెన్ పవర్, నవంబర్ 14**

పట్టణంలోని పామూరు రోడ్డు నందు ఆక్స్ ఫర్డ్ ఒలంపియాడ్ స్కూల్ లో శుక్రవారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందస్తుగా మాజీ భారత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు,విద్యార్థులు పూలమాలవేసి,ఆయన ఆధునిక సాంకేతిక భావాలను,పిల్లల పట్ల ఆయనకు గల ప్రేమను స్మరించుకోవడం జరిగింది. అనంతరం బాల,బాలికలు నృత్య ప్రదర్శనలు, ఆటపాటలతో పాఠశాల ప్రాంగణమంతా అలరించారు. యాజమాన్య సిబ్బంది విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేసి,స్వీట్స్ పంచిపెట్టి,బహుమతులు అందజేసారు. ఈ సందర్భంగా బి.ఆర్ ఆక్స్ఫర్డ్ విద్యా సంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు మాట్లాడుతూ.. ప్రతి ఏడాది నవంబర్ 14న జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా చిల్డ్రన్స్ డే జరుపుకుంటారని నేడు పిల్లలందరికీ ప్రత్యేకమైన రోజు అన్నారు. పిల్లలందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యాసంస్థల డైరెక్టర్ జి.బాల భాస్కరరావు మాట్లాడుతూ.. విద్యార్థులు బాల్యం నుంచే క్రమశిక్షణ నైతిక విలువలు కలిగి చదువులోనే ఆనందాన్ని వెతుకుతూ ఉన్నత శిఖరాలు అధిరోహించి సమాజానికి ఉపయోగపడాలని తెలిపారు. కార్యక్రమంలో విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్ బి. నరేంద్రబాబు, పాఠశాల డీన్, ప్రిన్సిపాల్స్ తదితర ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com

# మార్కాపురంలో పోలీసుల విస్తృత తనిఖీలు





**మార్కాపురం టౌన్ పెన్ పవర్ నవంబర్14**

ఢిల్లీలో బాంబు దాడి జరిగిన నేపథ్యంలో ప్రకాశం జిల్లా ఎస్.పి వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాలతో మార్కాపురం సబ్ డివిజన్ లో రాక్సీ, చీత పోలీసు డాగ్ లతో పోలీసు అధికారులు,సిబ్బంది ముమ్మరంగా తనిఖీలు చేశారు.ఈ తనిఖీలు మార్కాపురంలోని ఆర్టీసీ బస్టాండ్ , రైల్వే స్టేషన్, కంభం బస్టాండ్ సెంటర్, దోర్నాల బస్టాండ్ సెంటర్ తో పాటు పిఎస్ కాలనీ, చెన్నకేశవ స్వామి టెంపుల్,పరిసర ప్రాంతాలలో నిర్వహించారు. నార్కోటిక్, నేరస్తులను, మందు గుండు సమగ్రని గుర్తించుటకు రాక్సీ, చీత డాగ్ లతో ప్రత్యేకంగా విస్తృతంగా పోలీసు సిబ్బంది తనిఖీలు చేశారు.బస్టాండ్ లోపల ప్రదేశం లో ప్రయాణీకుల బ్యాగులను తనిఖీ చేయడం తోపాటు అనుమానం వచ్చిన ప్రయాణికుల బ్యాగ్ లను ఒపెన్ చేయించి తనిఖీలు చేశారు.ప్రయాణికుల అధార్ కార్డు పైన అడ్రస్ ను పరిశీలించి వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇదిలా ఉంటే బస్టాండ్ లో ఉన్న పార్సిలు సర్వీసు సెంటర్ ను తనిఖీ చేసి,పోలీసు నిబంధనలకు విరుద్ధంగా వచ్చే పార్సిల్ లను తీసుకొవద్దని, అలాంటివి మీ దృష్టికి వస్తే వేంటనే స్ధానిక పోలీసు వారికి సమాచారం ఇవ్వాలని అక్కడ ఉన్న సిబ్బందికి సూచించడం జరిగినది.మరోవైపు సమీపంలో ఉన్న చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద పరిసర ప్రాంతాలను రాక్సీ, చీత డాగ్ లతో జల్లడ పట్టారు. దేవాలయాల పరిసరాలలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవంటూ హెచ్చరించారు. మార్కెట్ సెంటర్ లోని ప్రాంతంలోని పరిసరాలను పూర్తిగా పరిశీలించడం జరిగింది. అక్కడ ఉన్న ప్రజలతో వారు ఇంట్రాక్ట్ అయ్యారు.ఇతర ప్రాంతాల నుండి అనేక మంది మార్కెట్ సెంటర్ కు వివిధ పనులపై వస్తుంటారని ప్రతి ఒక్కరూ మర్యాదగా వ్యవహరించాలన్నారు. రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతంలో డాగ్ లతో తనిఖీలు చేసి ప్రయాణికుల బ్యాగ్ లను తనిఖీలు చేశారు.మార్కాపురం ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఎర్పట్లు చేస్తున్నామని పోలీసు సిబ్బంది అన్నారు. ఈ తనిఖీలు లో మార్కాపురం ఇన్స్పెక్టర్ సుబ్బారావు, మార్కాపురం రూరల్ ఎస్సై అంకమ్మరావు, డాగ్ హ్యాండ్లర్ లు వెంకటేశ్వర్లు, విద్య సాగర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## చంద్రన్న పచ్చదనం కార్యక్రమం



**దొనకొండ నవంబర్ 14 పెన్ పవర్**

మండలంలో గొట్టిపాటి లక్ష్మి లలిత్ సాగర్ లా ఆదేశాలతో యర్లజర్ల శ్రీను,అధ్యక్షతన గురువు అచ్చెన్నాయుడు ఆసీసులతో,ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు గ్రామస్తులు లకు,మొక్కలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగ పరిటాల సురేష్ మాట్లాడుతూ, మానవ వాలి మనుగడకు మొక్కలు లేకపోతే ప్రమాదం పొంచి ఉంది అని అన్నారు.ఒజోన్ పొరను రక్షించాలి అంటే మొక్కలు విరివిగా నాటాలి అని,అన్నారు.వాతావరణం లో సమతుల్యత గా ఉండాలి అంటే అందరూ మొక్కలు నాటి పెంచాలి అని, ఎండలు లేకుండా వాతావరణం బాగా ఉండాలి అన్న మొక్కలు పెంచాలి అని అన్నారు.ఈ కార్యక్రమం లో గ్రామ పార్టీ అధ్యక్షుడు, నంద్యాల కోటయ్య, తోపురి రమేష్, కమ్మ వెంకటేశ్వర్లు, కుంట శ్రీను, బ్రమయ్య,కమ్మ వెంకట నారాయణ గ్రామస్తులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



**మార్కాపురం టౌన్ పెన్ పవర్ నవంబర్14**

జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాల పూర్వ విద్యార్థి, 1 గ్లోబల్ కళాశాల చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ అలీ బేగ్ మార్కాపురం డివిజన్ ఉపవిద్యాశాఖధికారి మామిళ్ళపల్లి శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా షంషీర్ అలీ బేగ్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని మంచి ఉజ్వల భవిష్యత్తును పొందాలని తెలియజేశారు. మార్కాపురం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి శ్రీనివాస రెడ్డి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు చదువు ఎంతగానో ఉపకరిస్తుందని, చక్కగా చదువుకొని తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని, వనరులను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. వివిధ రకాల పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి, క్రీడాకారులలో ప్రతిభ కనపరిచి రాష్ట్ర స్థాయిలో ప్రాతినిధ్యం వహించిన విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతులమీదుగా బహుమతులు ప్రధానం చేసారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులు కష్టపడి చదవాలి

**సి ఎస్ పురం, పెన్ పవర్ నవంబర్ 14**

విద్యార్థులు కష్టపడి చదివి తమ లక్ష్యాలను అధిగమించాలని అంబవరం కెనరా బ్యాంక్ మేనేజర్ చెన్నయ్య తెలిపారు అంబవరం జిల్లా ప్రస్తుత హై స్కూల్ లో నిర్వహించిన బాలల దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు ఈ సందర్భంగా నెహ్రు చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు నేటి సమాజంలో పిల్లలకు ఎంతో ప్రాధాన్యత ఉందని గుర్తు చేశారు రాబోయే రోజుల్లో మంచి భావి భారత పౌరులుగా తయారవ్వాలని ఆయన సూచించారు ప్రధానోపాధ్యాయులు షరీఫ్ మాట్లాడుతూ నెహ్రూ గారి ఆశయాలను అనుగుణంగా తీసుకోవాలని పిల్లలకు సూచించారు పాఠశాలలో విద్యార్థులు త్రాగునీటి కోసం ఆర్వో ప్లాంట్ అవసరమనిబ్యాంక్ మేనేజర్ దృష్టికి ఉపాధ్యాయులు తీసుకురాగా తన వంతు సహాయంగా ప్లాంట్ మంజూరు అయ్యేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ షేక్ గౌస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## గోను బ్రదర్స్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి భక్తి జ్వాలలు

### వైభవంగా మహా పడిపూజ కార్యక్రమం



**సి ఎస్ పురం, పెన్ పవర్ నవంబర్ 14**

మండలంలోని కోవిలంపాడు గ్రామంలో గోను బ్రదర్స్ ఆధ్వర్యంలో హరిహరసుత అయ్యప్ప స్వామి మహా పడిపూజ భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రముఖులు గోను రాజశేఖర్ రెడ్డి–వెంకటనారాయణమ్మ దంపతుల కుమారులు ఉభయదాతలుగా ఈ పవిత్ర కార్యక్రమాన్ని ప్రత్యేకకాలంలో సమర్పణ భావంతో నిర్వహించారు. అరటి బోదేలతో ప్రత్యేకంగా నిర్మించిన మండపాలను రంగురంగుల విద్యుత్తు లైటింగ్ తో ప్రకాశింపజేసి, పుష్పాలతో తీర్చిదిద్దిన అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. అర్చకుల పర్యవేక్షణలో గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, పార్వతీ పరమేశ్వరులు, వెంకటేశ్వరస్వామి, అయ్యప్ప స్వామి చిత్రపటాలను ప్రతిష్టించి కలశప్రతిష్ట, ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి.గురుస్వాములు రామిరెడ్డి స్వామి, నాగులుస్వామి, లక్ష్మణస్వామి ఆధ్వర్యంలో ఉభయదాతలు పంచామృతాభిషేకం చేసి స్వామివారి సేవలో నిమగ్నమయ్యారు. అనంతరం స్వామికి విశేషాలంకరణ చేసి, మహాపడి వెలిగించి కర్పూర హారతులు సమర్పించగా భక్తి తరంగాలు ఆవరించాయి.అయ్యప్ప పీఠంలో మాలధారణ స్వాములు భజనలతో, శరణఘోషలతో పరిసరాలను పవిత్రమయం చేశారు. కార్యక్రమం అనంతరం భక్తులకు అల్పాహార వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు గ్రామస్తులు, భక్తులు, మాలధారణ స్వాములు భారీగా పాల్గొని స్వామి అనుగ్రహం పొందారు.

## యువతలో పఠనాభిలాషను పెంపొందించాలి

### పుస్తకం మస్తక భూషణం -(జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా)



పుస్తకం హస్త భూషణం అన్నారు పెద్దలు. ఇది ఒకప్పటి మాట. పుస్తకం మస్తక భూషణం అనేది నేటి మాట. పుస్తకం చేతిలో ఉంటే సరిపోదు. దానిని క్షుణ్ణంగా చదివి అందులోని సారాన్ని మెదడులో పదిలపరుచుకోవాలి. ఒకప్పుడు పుస్తక అధ్యయనం విస్తృతంగా ఉండేది. గ్రంథాలయాలు సందర్శకులతో శోభించేవి. మంచి పుస్తకం అనిపిస్తే చాలు వెంటనే కొని చదివే వారు. లెండింగ్ లైబ్రరీలు కూడా ఉండేవి. కాలం మారింది. గ్రంథాలయాలకు వెళ్లే వారి సంఖ్య బాగా తగ్గింది. విద్యార్థులతో సహా అనేక మందిలో పుస్తకాలు కొనే..చదివే అలవాటు క్షీణించింది. ఆ!! ఈ రోజుల్లో ఇంకా పుస్తకాలు చదివే వారెవరున్నారండీ!! అంటూ ఆశ్చర్యంగా ప్రశ్నించే వారు పెరిగారు. అలా ప్రశ్నించే వారిలో కొందరు కవులు..రచయితలు ఉండడం విడ్డూరం. నేడు సాంకేతిక విజ్ఞానం పెరిగింది. కావలసిన పుస్తకాలను నెట్ లోనే చదువుకునే వెసులుబాటు వచ్చింది. స్మార్ట్ ఫోన్ మినీ లైబ్రరీగా మారింది. పత్రికలను కూడా నెట్ లోనే చదివేస్తున్నారు. టెక్నాలజీ ఎంత మారినా పుస్తకం విలువ మాత్రం తగ్గేది కాదని గుర్తించాలి. పుస్తక పఠనానికి మరలా మంచి రోజులు తప్పక వస్తాయి. ' గద్య తిక్కన ' గా ప్రసిద్ధులైన కందుకూరి వీరేశలింగం పంతులు " చిరిగిన చొక్కా నైనా తొడుక్కో..మంచి పుస్తకం కొనుక్కో" అంటూ దశాబ్దాల క్రితమే ప్రబోధించారు. మంచి పుస్తకం గొప్ప స్నేహితునిలా మనకు మేలు చేస్తుందని పెద్దలు నుడివారు. పుస్తక పఠనం వల్ల తమ జీవితం ఎంతగా ప్రభావితం అయ్యిందో బి ఆర్ అంబేద్కర్,.మహాత్మా గాంధీ వంటి పలువురు మహనీయులు పలు సందర్భాలలో వెల్లడించారు. పుస్తకం హస్త భూషణంగా కాకుండా మస్తక భూషణంగా వెలుగొందాలని ఆశిద్దాం.

**(ఎం వి ఎస్ శాస్త్రి ఒంగోలు సెల్ 9948409528).**

## అధికారులు అందించిన ఆలస్య సమాచారంతో సాదాసీదాగా సాగిన బాలల దినోత్సవ వేడుకలు

**చిన్నారులను నిరుత్సాహాన్ని గురి చేసిన బాలల దినోత్సవ వేడుకలు.**

**పలు పాఠశాలల్లో నామమాత్రంగా నిర్వహించిన బాలల దినోత్సవం.**



**కొమరోలు పెన్ పవర్ నవంబరు 14**

రాష్ట్రస్థాయి అధికారులు ఆలస్యంగా అందించిన సమాచారంతో కొమరోలు మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం బాలల దినోత్సవం వేడుకలు నామమాత్రంగా ,సాదాసీదాగా జరిగాయి .దీనితో విద్యార్థులు నిరుత్సాహానికి, అసంతృప్తికి గురికావలసి వచ్చింది. పాఠశాలల్లో ప్రతి సంవత్సరం ప్రధానంగా నిర్వహించే వేడుకలు రెండు. వాటిల్లో ఒకటి సెప్టెంబర్ 5న నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవం. రెండవది నవంబర్ 14 నిర్వహించే బాలల దినోత్సవ వేడుకలు. సదరు రెండు వేడుకలు అటు ఉపాధ్యాయులు ఇటు విద్యార్థుల మనోభావాలకు ,గౌరవ మర్యాదలకు, ప్రేమానురాగాలకు ప్రత్యేకగా నిలుస్తాయి. దీనితో దేశ వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురుపూజోత్సవ వేడుకలు ఎంతో ఘనంగా నిర్వహిస్తారు .ఆ సందర్భంగా విద్యార్థులు తమ గురువుల పట్ల భక్తిని, గౌరవాన్ని ప్రదర్శిస్తూ వారిని సన్మానించి తమ గురుభక్తిని చాటుకుంటూ ఉంటారు. ఉపాధ్యాయులు కూడా తమ చిన్నారులను దీవిస్తూ వారి వారి పట్ల తమకు ఉండే ప్రేమానురాగాలను పంచి పెడుతూ ఉంటారు .అలాగే నవంబర్ 14న భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్లాల్ నెహ్రూ జయంతోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలల్లో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా, అత్యంత వైభవంగా, ఆనందోత్సవాలతో నిర్వహించడం సాంప్రదాయంగా వస్తున్నది .ఆ రోజున విద్యార్థులు పాఠ్యపుస్తకాలకు స్వస్తి పలికి బాల దినోత్సవ వేడుకలలో ఆనందో త్సవాలతో పాల్గొంటూ ఉంటారు .ఆ సందర్భంగా ఆ పాఠశాల ఉపాధ్యాయులు రెండు రోజుల ముందే విద్యార్థులకు క్రీడలు,,వ్యాసరచన ,వకృత్వ, చిత్రలేఖనం తదితర పలు రకాల పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేసి బాలల దినోత్సవం రోజున వారికి బహుమతులు అందించి అభినందించడం కూడా జరుగుతూ ఉంటుంది. అంతేకాక బాల దినోత్సవ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులను ,గ్రామ పెద్దలను ,ప్రజా ప్రతినిధులను, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ సభ్యులను కూడా ఆహ్వానించి వారి సమక్షంలో విద్యార్థుల ప్రగతిని వివరించి వారి చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు అందజేసే కార్యక్రమాలు కూడా పలు పాఠశాలల్లో నిర్వహించడం సాంప్రదాయంగా వస్తున్నది. దీనితో విద్యార్థులు బాలల దినోత్సవాన్ని తమ పుట్టినరోజు ను జరుపుకున్నంతగా అనుభూతిని పొందుతూ ఆనందోత్సవాలలో మునిగితేలుతుంటారు. అయితే ఈ ఏడాది నవంబర్ 14న పలు పాఠశాలల్లో బాలల దినోత్సవ వేడుకలు సాదాసీదాగా నామమాత్రంగా నిర్వహించుకోవలసి వచ్చిందని పలు పాఠశాలల ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలల్లో ఎస్ఏ 1 పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి . నవంబర్ 14న హైస్కూల్లలో, 6 , 7తరగతుల విద్యార్థులకు సైన్స్ పరీక్ష ,8,9,10 తరగతుల విద్యార్థులకు ఫిజికల్ సైన్స్ పరీక్ష, ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు పరిసరాల పరిజ్ఞానం పరీక్ష నిర్వహించే విధంగా రాష్ట్రస్థాయి అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీనితో నవంబర్ 14న బాల దినోత్సవ వేడుకలు నిర్వహించే అవకాశం లేదని భావించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు ముందస్తుగా ఎలాంటి క్రీడా తదితర పోటీలు నిర్వహించకపోవడమే కాక బాలదినోత్సవ వేడుకలకు ఎలాంటి ఏర్పాట్లు కూడా చేసుకోలేకపోయారు .అయితే ఈ నెల 13వ తేదీ రాత్రి అధికారులు అప్పటికప్పుడు పాఠశాలలకు సమాచారం అందిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా నవంబర్ 14న నిర్వహించవలసిన ఫిజికల్ సైన్స్ పరీక్షను ఈనెల 20వ తేదీకి వాయిదా వేసామని,అందువల్ల శుక్రవారం పాఠశాలల్లో బాలల దినోత్సవ వేడుకలను నిర్వహించుకోవాలని సమాచారం అందించారు. అయితే శుక్రవారం ఫిజికల్ సైన్స్ పరీక్ష నిర్వహించవలసి ఉన్నందువల్ల ఆ పాఠశాల ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు అందుకు తగిన ఏర్పాట్లు చేసుకున్నారు. విద్యార్థులు కూడా పరీక్ష రాసేందుకు సమాయత్తమై పాఠశాలలకు హాజరయ్యారు. దీనితో శుక్రవారం పలు పాఠశాలల్లో బాలల దినోత్సవ వేడుకలను నవమాత్రంగా ,సాదాసీదాగా జరుపుకోవలసి వచ్చిందని పలు పాఠశాలల ఉపాధ్యాయులు తెలిపారు. ఆ కారణంగా విద్యార్థులు తీవ్ర నిరాశకు అసంతృప్తికి గురికావాల్సి వచ్చిందని వారు పేర్కొన్నారు.

## కంది పంటపై రైతులకు అవగాహన

**ఏవో షేక్ మహమ్మద్**






**పెన్ పవర్ ,కంభం నవంబర్ 14**

కంది పంట పై రైతులకు అవగాహన కల్పించినట్లు వ్యవసాయ శాఖ అధికారి షేక్ మహమ్మద్ తెలిపారు. శుక్రవారం కంభం మండలంలోని నర్సిరెడ్డిపల్లి గ్రామంలో కంది పంటపై ఇన్ది గ్యాప్ పొలంబడిని నిర్వహించారు. రైతులతో మాట్లాడుతూ కంది పంట ఇప్పుడే కళ్ళేదశలో ఉందని, పూత దశ కొస్తుంది అని, ఈ దశలో పురుగులు ఆశించకుండా వేప కషాయం లేదా వేప నూనె ఎకరానికి లీటర్ చొప్పున పిచికారి చేసుకోవాలని తెలిపారు. దీని వలన మీ యొక్క గుడ్లు చిన్న పురుగులు నిర్మూలించబడతాయని తెలిపారు. అలాగే మిత్రపరుగులు శత్రువు పురుగులు వాటి గురించి రైతులకు అవగాహన కల్పించారు. వాతావరణాన్ని బట్టి మిత్రపరుగుల శత్రువు పురుగుల నిష్పత్తిని బట్టి పురుగుమందులను పిచికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా బాలల దినోత్సవం

### విద్యార్థులు చాచా నెహ్రూ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

**దొనకొండ నవంబర్ 14 పెన్ పవర్**

మండలంలోని పోలేపల్లి లో మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆదిమూలపు ప్రభుదాస్ ఆధ్వర్యంలో అత్యంత ఉత్సాహభరితంగా ఘనంగా నిర్వహించారు ముందుగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు మ్యూజికల్ చైర్స్ చిన్నారులు నృత్యాలు పాటలతో సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు పాఠశాల ఆవరణమంతా కలకలలాడింది ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు అన్న నెహ్రూ యొక్క నినాదాన్ని మనం నిజం చేయాలంటే మంచి క్రమశిక్షణతో చక్కగా చదువుకొని జీవితంలో మంచి పౌరులుగా రాణించాలని నెహ్రూ చిన్నారుల పట్ల చూపిన అపారమైన ప్రేమ దేశ భవిష్యత్తు నిర్మాణానికి ఆయన వేసిన పునాది పిల్లలునే కాదు సృజనాత్మకత నైతికతలోనూ ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో అతిథులుగా సర్పంచ్ వై జాన్ ప్రకాష్ పాఠశాల చైర్మన్ ఎం రమేష్ పాల్గొని విజేతలకి బహుమతులు చాక్లెట్స్ అందజేశారు.

## ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు





**సియస్ పురం , పెన్ పవర్ నవంబర్ 14**

మండల కేంద్రమైన సిఎస్ పురం లోను ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లోనూ అంగన్వాడి కేంద్రాల్లోనూ శుక్రవారం భారత దేశ మొదటి ప్రధాని చాచా నెహ్రూ జన్మదిన వేడుకలను ఉపాధ్యాయులు విద్యార్థులు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు మండలంలోని బొంత వారి పల్లె అంగన్వాడి కేంద్రంలో జరిగిన బాలల దినోత్సవం వేడుకల్లో బాలల సంరక్షణ అధికారి షేక్ అమీషా బేగం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు అంగన్వాడి కేంద్రంలోని విద్యార్థుల విద్యార్థుల చిన్నారుల ఆటపాటలను వీక్షించారు అనంతరం చిన్నారులకు పోటీలు నిర్వహించి వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు చిన్నారుల వేషధారణ ఆటపాటలు అలంకరించాయి అనంతరం మండల కేంద్రమైన సియస్ పురం లోని కేజీబీవీ పాఠశాలలో కేజీబీవీ ప్రిన్సిపల్ షేక్ రేష్మ ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు ముఖ్యఅతిథిగా పాల్గొని నెహ్రు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం విద్యార్థుల తో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బాలల హక్కులపై చట్టాలపై అత్యవసర పరిస్థితిలో ఉపయోగించాల్సిన టోల్ ఫ్రీ నెంబర్స్ పై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ దేవా కృపావరం, సిడిపిఓ కార్యాలయ సిబ్బందిరసూల్ ,శామ్యూల్ ,అంగన్వాడీ కార్యకర్త సరళ రెడ్డి రామా, కస్తూర్బా ఉపాధ్యాయసిబ్బంది చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బి ఎం డిగ్రీ కళాశాలలో బాలల దినోత్సవం



**పెద్ద దోర్నాల పెన్ పవర్ నవంబర్ 14**
మండల కేంద్రంలోని బి ఎం డిగ్రీ కాలేజీ వసంత జూనియర్ కళాశాలలో బట్టు విద్యా సంస్థల శుక్రవారం బాలల దినోత్సవం చైర్మన్ బట్టు రమణ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ బట్టు రమణ రెడ్డి మాట్లాడుతూ మాజీ ప్రధానమంత్రి చాచా నెహ్రూ జన్మదినంను బాలల దినోత్సవంగా ప్రభుత్వాలు ప్రకటించాయన్నారు. ఆయన దేశానికి చేసిన సేవలు గురించిషేక్ మహబూబ్ బాషా వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్ షేక్ మహబూబ్ భాష కళాశాలసిబ్బంది విద్యార్థి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కాసు చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం



**కొనకనమిట్ల పెన్ పవర్ నవంబర్ 14**
విద్యా అభివృద్ధి కోసం కాసు చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలు అభినందనీయమని గొట్లగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆదినారాయణ అన్నారు.పాఠశాలకు అవసరమైన కంప్యూటర్ బెల్‌ను ట్రస్ట్ ఛైర్మన్ కాసు వెంకటేశ్వరరెడ్డి ఇటీవల అందించారని,శుక్రవారం దాన్ని పాఠశాలలో ఏర్పాటు చేసినట్లు తెలియచేసారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆదినారాయణ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం ఎంతో కీలకమని దాతలు అందిస్తున్న దాతృత్వంతో విద్యార్థులు మరింత కష్టపడి చదివి గ్రామానికి,పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలి అని పేర్కొన్నారు.ట్రస్ట్ కో ఆర్డినేటర్ యన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాసు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గతంలో గొట్లగట్టు కేజీబీవీ,మర్రిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించామని భవిష్యత్తులో కూడా విద్య,వైద్య రంగాల్లో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రీడా పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు నవంబర్ 14**
ఒంగోలులోని నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ గత అయిదు రోజులుగా వివిధ క్రీడా పోటీలు నిర్వహించింది. చివరి రోజు అయిన నవంబర్ 14 బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రీడా దినోత్సవం జరుపుకోవడం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా ఒంగోలు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి రాయపాటి .శ్రీనివాసరా రావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. క్రీడా జ్యోతిని వెలిగించి ఉత్సాహపూర్వకంగా శోభాయాత్ర నిర్వహించారు. తదుపరి ముఖ్య అతిథి ఒంగోలు డి.ఎస్.పి రాయపాటి శ్రీనివాసరావు క్రీడోత్సవాన్ని ప్రారంభించిన గుర్తుగా బుడగలు, పావురాలు ఎగురవేశారు. ముఖ్య అతిథి తన సందేశంలో ప్రస్తుత కాలంలో చాలా పాఠశాలల్లో క్రీడలు సరిగా నిర్వహించడం లేదని, ఈ విషయంలో నెక్స్ట్ జెన్ స్కూల్ ఆదర్శంగా నిలుస్తున్నదని, బాలలు.. యువత సోషల్ మీడియాకు అలవాటు పడి సరైన వ్యాయామం లేక ఎదుగుదల లేక, సతమతమవుతున్నారని, అందువల్ల అందరూ చక్కగా ఆట పాటలలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. తరువాత విద్యార్థులకు వివిధ క్రీడలు నిర్వహించారు. అదే విధంగా రింగ్ డాన్స్, స్కేటింగ్, కరాటే, ఏరోబిక్స్, శారీ డాన్స్ వంటి వివిధ అంశాలు ప్రదర్శించారు. గత అయిదు రోజుల నుండి వివిధ విభాగాలలో గెలుపొందిన విద్యార్థులకు స్వర్ణ, రజత, కాంస్య పతకములు, జ్ఞాపికలు అందజేశారు. స్కూల్ డైరెక్టర్లు డా కె. మురళీధర్ రెడ్డి, కె. అరవింద, ప్రిన్సిపాల్ డా. ఆర్. ఎల్. వి. రమేష్ ఇతర ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కేజీబివి పాఠశాల లో విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేసిన ఎస్ఐ బసవరాజు

**త్రిపురాంతకం పెన్ పవర్ నవంబర్ 14**
త్రిపురాంతకం కే జి బి వి పాఠశాల లలో చిల్డ్రన్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్సై శివ బసవరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు అన్నారు.అనంతరం విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు బహుకరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వసుమతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# బాబుకు పేదలంటేనే చిన్న చూపు

## పేద పిల్లలకు వైద్య విద్య, వైద్యం దూరం చేయాలన్నదే చంద్రబాబు కుట్ర

## మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకొని తీరుతాం -అన్నా రాంబాబు

**తర్లుపాడు పెన్ పవర్ నవంబర్ 14**
పేద విద్యార్థుల కోసం గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 17 మెడికల్ కళాశాలలను రాష్ట్రానికి మంజూరు చేయించి అందులో 5 కళాశాలలు నిర్మాణం పూర్తి చేయించారని, అయితే చంద్రబాబు స్వార్థంతో తన వారి కోసం వాటిని ప్రైవేట్ పరం చేసేందుకు కుట్రపన్నడం దారుణమని గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ సమన్వయకర్త అన్నా రాంబాబు మండిపడ్డారు.తర్లుపాడు మండలం కేతగడిపి ,రాగసముద్రం. గానుగపెంట గ్రామాలలో నిర్వహించారు.రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ కార్యదర్శి, సర్పంచుల సంఘం అధ్యక్షులు డి పెద్ద మస్తాన్ అధ్యక్షతన శుక్రవారం మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ ఉద్యమంలా చేపట్టారు. ఈసందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ పీపీపీ విభాగాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నా చంద్రబాబు ప్రైవేటీకరణ దిశగా జీఓలు తేవడం దారుణమన్నారు. కేవలం రూ.5 వేల కోట్లతో కళాశాలలను ఈ విద్యా సంవత్సరానికి సిద్ధం చేసేందుకు అవకాశం ఉన్నా ఆదిశగా కూటమి నాయకులు ఆలోచన చేయడంలేదని మండిపడ్డారు. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్పరం చేయడం చంద్రబాబుకు అలవాటేనని, తన అనుంగులుకు విద్యపై పెత్తనం ఇచ్చేందుకే ప్రైవేట్ పరం చేస్తున్నాడన్నారు. కరోనా కష్టకాలంలో నేటి కూటమి నాయకులు ఎక్కడ దాక్కున్నారని ప్రశ్నించారు. కరోనా సమయంలో ప్రజల ఆరోగ్యం కోసం జగనన్న ప్రభుత్వం చేసిన పనులను గుర్తు చేసుకోవాలని, అప్పట్లో ప్రభుత్వ ఆసుపత్రులలో కార్పోరేట్ స్థాయి వైద్యం ఉచితంగా అందించిన ఘనత జగనన్నదేనన్నారు. అలాంటి విపత్కర పరిస్థితులు భవిష్యత్లో ఏర్పడితే ఎదుర్కొనేందుకు ప్రభుత్వ మెడికల్ కళాశాలలను నాటి సీఎం జగనన్న మంజూరు చేయించి నిర్మాణాలు చేపట్టారన్నారు. ప్రశ్నిస్తే అరెస్ట్ లు చేయడం కూటమి ప్రభుత్వ



పాలనలో సాగుతుందన్నారు. ఇప్పటికైనా మనస్సు మార్చుకొని మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను విరమించుకోవాలని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ నాయకులు సూరెడ్డి రామసుబ్బారెడ్డి, మండల తర్లుపాడు మండల కన్వీనర్ మురారి వెంకటేశ్వర్లు, దేవి రెడ్డి భాస్కర్ రెడ్డి, రాగసముద్రం సర్పంచ్ తాడి రమణారెడ్డి, కేతగుడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు చెవుల రమేష్, కలవ రామాంజనేయులు, వైఎస్ఆర్సిపి నాయకులు సర్పంచ్ లు, ఎంపిటీసీ లు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చాచా నెహ్రూకు ఘన నివాళి

### ఘనంగా నిర్వహించిన బాలల దినోత్సవం వేడుకలు



**కొమరోలు పెన్ పవర్ నవంబర్ 14**
కొమరోలు లోని ప్రభుత్వంలో పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ జయంతోత్సవాన్ని పురస్కరించుకొని ఆ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు ఆనంద ఉత్సవాలతో నిర్వహించారు. ఆ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివనాగేశ్వరరావు అధ్యక్షత వహించగా, ప్రభుత్వ జూనియర్ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకులు అబ్బూరి అల్లూరయ్య ,కొమరోలు మండల విద్యాశాఖ అధికారులు వెంకటేశ్వర్లు, వెంకటరత్నం తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు శివ నాగేశ్వరరావు, ముఖ్య అతిథులు చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలువేసి నివాళులర్పించారు. అధ్యాపకులు అల్లూరయ్య మాట్లాడుతూ విద్యార్థులు కృషి పట్టుదల తో ఇష్టంగా చదివి గొప్ప విద్యావంతులై ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు .నేటి విద్యార్థులు భావి భారత పౌరులని అందువల్ల ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను తీర్చిదిద్ది గొప్ప విద్యావంతులుగా అభివృద్ధి చేయాలని కోరారు. మండల విద్యాశాఖ అధికారి 2 బుర్ర వెంకటరత్నం మాట్లాడుతూ, విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వాలు అనేక సౌకర్యాలు కల్పించి వారిని గొప్ప విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాయని ,అందువల్ల విద్యార్థులు కూడా ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించి దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని కోరారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివ నాగేశ్వరరావు మాట్లాడుతూ, విద్యార్థులు విద్య తో పాటు క్రమశిక్షణ, వినయ విధేయతలను, దేశభక్తిని, నైతిక విలువలను అలవర్చుకోవడమే కాకుండా ప్రతిరోజు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరవుతూ ఉపాధ్యాయులు అందించే నాణ్యమైన బోధనను పొందాలని కోరారు. ఆ పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు విశ్వరూప చారి మాట్లాడుతూ అనేకమంది విద్యార్థులు తల్లిదండ్రులు పేదలు నిరుపేదలైనప్పటికీ విద్యార్థులను కష్టపడి చదివిస్తున్నారని, అందువల్ల విద్యార్థులు కూడా గొప్ప విద్యావంతులై తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని కోరారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన క్రీడలు, వ్యాసరచన ,వకృత్వ, చిత్రలేఖనం తదితర పోటీలలో ప్రతిభ కనబరచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు అల్లూరయ్య తమ సొంత నిధులతో కొనుగోలు చేసిన బహుమతులను అందించి అభినందించారు అనంతరం విద్యార్థిని విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. బాల దినోత్సవ వేడుకలలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్చరీలో మేఘ వర్షకు స్వర్ణం - జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనేందుకు అర్హత





**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు నవంబర్ 14**
అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు లో ఘనంగా నిర్వహించిన 69వ నేషనల్ స్కూల్ గేమ్స్ ఆర్చరీ విభాగం అండర్-14 గర్ల్స్ కేటగిరీలో ఒంగోలు కు చెందిన కాట్రగడ్డ మేఘ వర్ష అసాధారణ ప్రతిభను ప్రదర్శించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి స్వర్ణ పతకంను కైవసం చేసుకుంది. రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభావంతుల మధ్య జరిగిన పోటీలు చాలా కఠినంగా ఉన్నప్పటికీ, మేఘ వర్ష తన ధైర్యం, క్రమశిక్షణ, నైపుణ్యంతో అందరిలోనూ ప్రత్యేకంగా నిలిచింది. ఈ ప్రతిష్ఠాత్మక విజయంతో మేఘ వర్ష 2025 నవంబర్ 19 నుండి 21 వరకు వారణాసిలో జరగబోయే జాతీయ స్థాయి ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించింది. ఈ పోటీలను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ జి ఎఫ్ ఐ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

**ప్రకాశం జిల్లాకు మరో గర్వకారణం**
వ్యక్తిగత విభాగంలో స్వర్ణపతకం సాధించిన ఆమె, అదేవిధంగా ప్రకాశం జిల్లా తరపున టీమ్ ఈవెంట్‌లో పాల్గొని రజతపతకం సాధించి జిల్లా గౌరవాన్ని రాష్ట్ర స్థాయిలో మరింత ఎత్తులో నిలిపింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఎంపికైన ప్రతిభావంతుల మధ్య జరిగిన ఈ టీమ్ ఈవెంట్లో మేఘ వర్ష కీలక పాత్ర పోషించింది. అభ్యాసం, పట్టుదలతో సాధించిన ఘన విజయం కాట్రగడ్డ మేఘ వర్ష ప్రస్తుతం ఒంగోలు లోని డి ఆర్ ఆర్ ఎం మునిసిపల్ హైస్కూల్లో 8వ తరగతి చదువుతోంది. ఆమె తన ఆర్చరీ శిక్షణను 72 డాట్స్ ఆర్చరీ అకాడమీ, ఒంగోలులో కోచ్ బొద్దు గోపి చందు మార్గదర్శకత్వంలో నిరంతరం కొనసాగిస్తోంది. కోచ్ గోపి చందు సాంకేతిక పర్యవేక్షణ, వ్యూహాత్మక శిక్షణ.. క్రమం తప్పని ప్రాక్టీస్ మేఘ వర్ష విజయానికి కీలకాంశాలుగా నిలిచాయి. ఆమె పాఠశాల హెడ్మాస్టర్ వెంకట రామణ, ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు మేఘ వర్ష విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ ఇలాంటి ప్రతిభావంతులే పాఠశాలలు, జిల్లాలకు పేరు ప్రఖ్యాతులు తెస్తారని పేర్కొన్నారు. మేఘ భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో వెలుగొందాలని కోరుకుంటున్నామని అభినందించారు.

# పారిశుధ్యం పై ముందస్తు చర్యలు చేపట్టండి



**వలేటివారిపాలెం, పెన్ పవర్ నవంబర్ 14**
గ్రామాలలో వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పారిశుధ్యం మెరుగుకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ వై. శంకరరావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల ప్రరిషత్ కార్యాలయం లో పంచాయతీ కార్యదర్శులకు, మరియు ఏ ఎన్ ఎం లు, ఎం ఎల్ హెచ్ పీ లతో ఎంపిడిఓ సమావేశం నిర్వహించారు. వ్యాధులు వ్యాపించకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. శానిటేజన్, క్లోరినేషన్, ఫాగింగ్ చేయించి దోమలు వ్యాప్తి చెందకుండా చూడాలని ఆదేశించారు. పారిశుధ్యం పై ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా చెత్తా చెదారాలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ పారిశుధ్యం, పరిశుభ్రతలోభాగస్వామ్యం కావాలని ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. వర్షాల కారణంగా తాగునీటి కొళాయిలు వద్ద, ప్రజలు నివసించే గృహాలు మధ్యలో వర్షపు నీరు నిలవకుండా కూడా చూడాలని అన్నారు.వర్షాకాలం కావడంతో వచ్చిన కొత్త నీరులు మలేరియా, డెంగ్యూ కారకముల దోమలు ఉంటాయని ఆ నీటిని ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని ప్రజలకు ఈ విషయాన్ని కార్యదర్శులు, ఏ ఎన్ ఎం లు, ఎం ఎల్ హెచ్ పీ లు తెలియజేయాలని అన్నారు.ఏ ఎన్ ఎం లు, ఎం ఎల్ హెచ్ పీ లు తప్పకుండా సచివాలయం లకు నిర్ణీత సమయంలో విధులకు హాజరు కావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ నారాయణ రావు, పంచాయతీ కార్యదర్శులు, ఏ ఎన్ ఎం లు, ఎం ఎల్ హెచ్ పీ లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల సత్వర పరిష్కారం ప్రజా దర్బార్

### నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ నవంబర్ 14**
ప్రజలు ఎదురుకుంటున్న సమస్యలు సత్వరంగా పరిష్కారం చేసేందుకే ప్రభుత్వం ప్రజా దర్బార్ కార్యక్రమం ఏర్పాటు చేసిందని నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు అన్నారు.శుక్రవారం పార్టీ కార్యాలయంలొ ప్రజల నుండి వినతులను ఆయన స్వికరించారు ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ ప్రజా దర్బార్ లొప్రజల సమస్యలను పరిష్కరించేది కూటమి ప్రభుత్వంఅని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజల శ్రేయస్సు కోసం ప్రజల సమస్యలు ఆర్థికంగా వెనుకబడిన గిరిజనలు నిరు పేద ప్రజల కష్టాలు, వారి గృహ నిర్మాణ సమస్యలు, తాగునీటి సమస్యలు, కరెంటు సమస్యలు సీసీ రోడ్లు, అర్జీల ద్వారా తెలుసుకోవడం అని ప్రజా దర్బార్ కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుంది అన్నారు. ప్రతి సమస్యను త్వరలోనే పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలోఏ యం సి చైర్మన్ చేకూరి సుబ్బారావు మండల పార్టీ అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి,ఎంపీడీఓ శ్రీనివాస రావు , మార్కెట్ యార్డ్ చైర్మన్ చేకూరి సుబ్బారావు , తోట మహేష్ నాయుడు, వేగినాటి శ్రీను, పట్టణ అధ్యక్షులు పేరుమాళ్ళమల్లికార్జున, కంచర్ల సత్యనారాయణ గౌడ్, మరియు టీడీపీ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


## అందుబాటులో ఉండండి.. ప్రజలకు సేవ చేయండి...



**వలేటివారిపాలెం, పెన్ పవర్ నవంబర్ 14**
సచివాలయం సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవచేయాలని ఎంపిడిఓ వై. శంకరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని పోలినేనిపాలెం సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు . అనంతరం సిబ్బంది హాజరు పట్టికను పలు రిజిస్టర్ లను పరిశీలించారు.సచివాలయం సిబ్బంది మొత్తం హాజరుకావడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వై. శంకరరావు మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా సచివాలయంలో అందాల్చిన సేవలను మరింత విస్తృతం చేయాల్చిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా చూడాలని అన్నారు.సచివాలయం సిబ్బంది ప్రజలపట్ల బాధ్యతాయుతంగా వ్యవహారించాలని అన్నారు.ప్రజలకు సచివాలయం ద్వారా అందే సేవలలో ఎటువంటి జాప్యానికి తావులేకుండా చూడాలని ప్రజలకు సేవచేయాలని అన్నారు.సర్వేలు మొత్తం వెంటనే పూర్తి చేయాలని సిబ్బంది ని ఆదేశించారు.సచివాలయం ప్రాంగణం అంతా పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి కి చూసించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ నారాయణ రావు,సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అనధికార కట్టడాలు తొలగింపు

**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు నవంబర్ 14**
ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి రాష్ట్ర వ్యాప్తంగా అనధికార కట్టడాలను తొలగించుటలో భాగంగా ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలోని వెంకటేశ్వర కాలనీ లో అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుపుతున్న కట్టడాలపై పట్టణ ప్రణాళిక విభాగపు అధికారులు అసిస్టెంట్ సిటీ ప్లానర్ జేడ్. సుధాకర్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ కె. బాబు రావు,టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ షేక్. రసూల్, పట్టణ ప్రణాళిక సిబ్బంది గురువారం పలు నిర్మాణాలను తొలగించారు. వెంకటేశ్వరకాలనిలో అనుమతులు లేని 4వ అంతస్తును గుర్తించి తొలగించారు. అనుమతులు లేకుండా నిర్మించిన కట్టడాలను , అదనపు అంతస్తుల తొలగింపు జరుగుతు వుంటుందని తెలియజేశారు. అనధికార లేఓట్ ప్లాట్లు తొలగింపు కార్యక్రమం జరుగుతుందని కనుక అనధికార లేఓట్లు ఎల్ఆర్ఎస్ క్రింద క్రమబద్ధికరించుకోని కొనవలసినదిగా తెలియజేశారు.



# పెద్దపులి సంచారం కలకలం



**ఒంగోలు, నవంబర్ 14, పెన్ పవర్:** ప్రకాశం జిల్లా డోర్నాల మండల ప్రజలను పెద్దపులి సంచారం కలకలం రేపుతోంది. గండి చెరువు వద్దకు మేతకు వెళ్లిన రెండు ఆవులను పులి చంపేసిందని స్థానికులు చెప్తున్నారు. దీంతో భయంతో వణికిపోతున్నారు. గతంలోనూ ఈ ప్రాంతంలో పెద్దపులి కదలికలు నమోదయ్యాయి. స్థానికుల సమాచారంతో అటవీ శాఖ అధికారులు అక్కడకు చేరుకున్నారు. పరిస్థితిని సమీక్షించిన అధికారులు.. అప్రమత్తంగా ఉండాలని స్థానికులకు సూచించారు.ప్రకాశం జిల్లాలో మరోసారి పెద్దపులి సంచారం కలకలం రేపింది. డోర్నాల మండలం బొమ్మలాపురం గ్రామంలో పెద్దపులి తిరుగుతోందన్న వార్తలు స్థానికులను భయపెడుతున్నాయి. గండిచెరువు సమీపంలో మేతకు వెళ్లిన రెండు ఆవులపై దాడి చేసి చంపేయటంతో స్థానికులు మరింత వణికిపోతున్నారు. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలికి చేరుకున్న అటవీ శాఖ అధికారులు.. అక్కడి పరిస్థితిని పరిశీలించారు. పెద్దపులి సంచారం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. మరోవైపు ఈ ప్రాంతంలో గతంలోనూ పెద్దపులి సంచరం కలకలం రేపింది. అయితే అటవీ ప్రాంతం కావటంతో ఇక్కడ పులులు సంచరిస్తూ ఉంటాయని అధికారులు చెప్తున్నారు.మరోవైపు ఏపీ విషయానికి వస్తే పులుల సంచారం ఎక్కువగా నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వ్ ప్రాంతంతో పాటుగా, పాపికొండలు వంటి అటవీ ప్రాంతాలలో ఉంది. అలాగే నల్లమల అటవీ ప్రాంతంతో పాటుగా, పల్నాడు, నంద్యాల, కాకినాడ, తూర్పు గోదావరి, అనంతపురం జిల్లాలలో పులుల సంచారం వార్తలు అప్పుడప్పుడూ వస్తూ ఉంటాయి. అలాగే పొరుగు రాష్ట్రాల నుంచి కూడా అప్పుడప్పుడూ పులులు ఆంధ్రప్రదేశ్‌లోని అటవీ ప్రాంతాలకు వలస వస్తుంటాయి. పులుల సంచారం వార్తలు వచ్చినప్పుడు స్థానికులు భయాందోళనకు గురవుతూ ఉంటారు. ఈ నేపథ్యంలో పులుల సంచారం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎలా వ్యవహరించాలనే దానిపై అటవీ శాఖ అధికారులు వారికి అవగాహన కల్పిస్తుంటారు.

# ఎమ్మెల్యేల పంచాయితీలకు బాధ్యులెవరు

**విజయవాడ, నవంబర్ 14, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పుడు పదే పదే ఎమ్మెల్యేల పనితీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ఎమ్మెల్యేలు సివిల్ తగాదాల్లో తలదూర్చడాన్ని తప్పుపడుతున్నారు. ఇలా కూటమిలోని ప్రధాన పార్టీలకు చెందిన పెద్దలే పార్టీ గాడి తప్పినట్లు ఒప్పుకున్నట్లయిందన్న కామెంట్స్ వినపడుతున్నాయి. అయితే పక్కదారి పడుతున్న ఎమ్మెల్యేలను సెట్ చేయడానికే చంద్రబాబు కానీ, పవన్ కల్యాణ్ కానీ ఈ వ్యాఖ్యలు చేస్తుండ వచ్చు. ఎమ్మెల్యేలపై ప్రజల్లో వ్యతిరేకత వస్తే ప్రభుత్వం ఎన్ని మంచి పనులు చేసినప్పటికీ ఎన్నికల్లో పనిచేయదు. ఖచ్చితంగా అది ప్రభుత్వంపైనే ప్రభావం చూపుతుంది. ఈ విషయం చంద్రబాబుకు తెలియంది కాదు. ఎమ్మెల్యేలు పనితీరు ఎంత ముఖ్యమో.. ప్రభుత్వంలో ఉన్న ముఖ్యుల పనితీరు కూడా అంతే ముఖ్యమన్నది మాత్రం గుర్తుంచుకోవాలి. ఇప్పటికే ఎన్నికలు జరిగి రెండేళ్లు దాటి పోయింది. ఇప్పుడు కూడా ప్రతిదీ గత ప్రభుత్వంపై నెపాన్ని మోపి కాలం గడిపేద్దామంటే కుదరని పని. అదే సమయంలో మంచి పనులు అంటే.. ఏంటి? వంద మందిలో పది మందికి మంచి జరిగితే తొంభయి మందికి అది వ్యతిరేకమవుతుంది. గత వైసీపీ ప్రభుత్వం కూడా సంక్షేమాన్ని విస్తృతంగా చేసినా పదకొండు సీట్లకే పరిమితమవ్వడానికి ప్రధాన కారణం మెజారిటీ ప్రజలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రయోజనాలు దక్కకపోవడంతో పాటు సమస్యలు పరిష్కారం కాకుండా ఉండటమేనన్నది వేరే చెప్పాల్సిన పనిలేదు.. తాము సంక్షేమాన్ని, అభివృద్ధిని సమపాళ్లలో తీసుకెళుతున్నామని చెబుతున్నప్పటికీ రహదారులు బాగుంటేనే ఫీల్ గుడ్ కొంత వరకైనా వస్తుంది. అలాగే ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ లో రైతులు సంతోషంగా ఉంటేనే వారు మళ్లీ ప్రభుత్వం వైపు మొగ్గు చూపుతారు. అలాగే నిరుద్యోగులు, మహిళల విషయంలోనూ అదే జరుగుతుంది. అందుకని సంక్షేమ పథకాలను కొందరికే ఇచ్చి తాము బాగా చేస్తున్నామని జబ్బలు చరుచుకుంటూ, ఎమ్మెల్యేల పనితీరును తప్పుపడుతూ కూర్చుంటే చివరకు పుట్టి మునిగేది ఖాయమన్నది గతంలో అనేక ఎన్నికల ఫలితాలు చాటి చెప్పాయి. ఎమ్మెల్యేలు సక్రమంగా చేసినా పక్క వాడికి అందిన పథకం తమకు దక్కకపోతే ఖచ్చితంగా వ్యతిరేకత వస్తుంది. అది ముఖ్య నేతలు గమనించాలని కిందిస్థాయి నేతలు కోరుతున్నారు. అలాగే కార్యకర్తలు కూడా పార్టీ నిలదొక్కుకోవడానికి, ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావడానికి కీలకమని గుర్తించాల్సి ఉంటుంది.

# అడ్డంగా బుక్కైన పెద్దిరెడ్డి...



**తిరుపతి, నవంబర్ 14, పెన్ పవర్:** :వైసీపీలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కీలకనేత. ఆయన ఒక రకంగా చెప్పాలంటే.. జగన్ తర్వాత ఆయన మాత్రమేనని అంటారంతా. ఎందుకంటే జగన్ కు అంతా తానే అయి వ్యవహరించేది కూడా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాత్రమేనంటారు. అలాంటి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబంపై ఎప్పటి నుంచో కూటమి ప్రభుత్వం ఒక కన్నేసి ఉంచింది. ఇదివరకే ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్ కేసులో పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి ని స్పెషల్ ఇన్విస్టిగేషన్ అధికారులు అరెస్ట్ చేశారు. దాదాపు 70 రోజులకు పైగానే రాజమండ్రి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న మిధున్ రెడ్డి తర్వాత బెయిల్ పై బయటకు వచ్చారు. మొన్నటి ఎన్నికల్లో చిత్తూరు జిల్లాలో అందరూ ఓడిపోయినా పెద్దిరెడ్డి కుటుంబం మాత్రం ఓటమి చవి చూడలేదు. పుంగనూరు ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లి ఎమ్మెల్యేగా ఆయన సోదరుడు పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి, రాజంపేట పార్లమెంటు సభ్యుడిగా పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి విజయం సాధించారు. చిత్తూరు జిల్లాలో ఈ రెండు మాత్రమే వైసీపీకి దక్కాయి. పార్లమెంటు నియోజకవర్గాల్లో వచ్చిన మూడు స్థానాల్లో ఒకటి కడప, మరొకటి అరకు, ఇంకొకటి రాజంపేట మాత్రమే. అలా పాతుకుపోయిన పెద్దిరెడ్డి కుటుంబాన్ని రాజకీయంగా వేళ్లతో సహా పెకిలించడానికి ప్రయత్నాలు మొదలయినట్లే కనిపిస్తుంది. అటవీ భూముల ఆక్రమణ విషయంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అడ్డంగా బుక్కయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అటవీ భూముల చట్ట ప్రకారం శిక్షలు కూడా భారీగా పడే అవకాశాలుంటాయని న్యాయనిపుణులు చెబుతున్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మధ్య వైరం ఈ నాటిది కాదు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో ఇద్దరూ చదువుకునే రోజులలో తలెత్తిన వైరం నేటికీ రాజకీయంగా కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో పెద్దిరెడ్డి కుటుంబం అటవీ భూముల విషయంలో చిక్కుల్లో పడినట్లేనని అంటున్నారు. అందులోనూ ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖను పర్యవేక్షిస్తున్న పవన్ కల్యాణ్ బయటపెట్టిన వీడియోతో దాదాపు 74 ఎకరాల అటవీ భూములను పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం ఆక్రమించుకుందన్న ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో ఆయనకు కష్టాలు మొదలయినట్లేనని అంటున్నారు. అందుకోసమే పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా చిత్తూరు జిల్లా పర్యటనకు వెళ్లినట్లు కూడా వైసీపీ నేతలు అనుమానిస్తున్నారు. హెలికాప్టర్ లో వెళ్లి వీడియోను చిత్రీకరించడం కూడా పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఇరికించడానికేనన్న అభిప్రాయం వైసీపీ నేతల్లో వ్యక్తమవుతుంది. జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే పెద్దాయన పెద్దిరెడ్డి రెడీ అవ్వాల్సిందే అన్నట్లుంది పరిస్థితి.

# తెరుచుకున్న డాక్‌యార్డ్ బ్రిడ్జి

**విశాఖపట్టణం, నవంబర్ 14, పెన్ పవర్:**
విశాఖపట్నం ఇండస్ట్రియల్ ఏరియా వాసులకు శుభవార్త. 15 నెలల తర్వాత డాక్‌యార్డ్ బ్రిడ్జి తెరుచుకుంది. భారీ వాహనాలు మినహా అన్ని వాహనాలకు అనుమతి లభించింది. దీనితో ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించే ఇబ్బందులు తొలగిపోయాయి. రూ.30 కోట్లతో నిర్మించిన ఈ వంతెన, సముద్రంపై 330 మీటర్ల పొడవుతో, ప్రత్యేక పెయింట్లతో సురక్షితంగా ఉంది. ఇటీవల బ్రిడ్జిపై ట్రయల్ రన్ కూడా నిర్వహించారు.. అనంతరం వాహనాలను అనుమతిస్తున్నారు.విశాఖపట్నంలో ఇండస్ట్రియల్ ఏరియా వాసులకు శుభవార్త. వంతెన నిర్మాణం కారణంగా 15 నెలలుగా మూసివేసిన మార్గం ఇవాళ తెరుచుకుంది. డాక్‌యార్డ్ బ్రిడ్జిపై పోర్టు అధికారులు అన్ని రకాల వాహనాలకు (భారీ వాహనాలు మినహా) అనుమతి ఇచ్చారు. ఈ వంతెన మూసివేత వల్ల పారిశ్రామిక ప్రాంతాల్లోని ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాల్సి రావడం వల్ల సమయం, డబ్బు వృధా అయ్యేవి. ఇప్పుడు రహదారి తెరుచుకోవడంతో ఈ సమస్యలు తొలగిపోనున్నాయి. అయితే భారీ వాహనాలకు మాత్రం అనుమతి లేదు. మిగిలిన అన్ని రకాల వాహనాలు ఈ మార్గాన్ని ఉపయోగించుకోవచ్చు. ఈ నిర్ణయం వల్ల స్థానిక ప్రజల ప్రయాణం సులభతరం అవుతుంది.సుమారు 15 నెలల పాటు ఈ రోడ్డు మూసివేయగా.. వంతెన నిర్మాణ పనులు పూర్తవడంతోనే దీనిని తిరిగి ప్రారంభించారు. నేవల్ డాక్‌యార్డ్ వంతెనపై మంగళవారం రాత్రి 9.30 గంటల నుంచి ద్విచక్ర వాహనాలు, కార్ల రాకపోకలను ప్రయోగాత్మకంగా అనుమతించారు. ఈ వంతెన మరమ్మతుల కారణంగా గత ఏడాది ఆగస్టు 1 నుంచి వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. ఇది గాజువాక, సింధియా, పారిశ్రామిక ప్రాంతాలతో పాటు నగరానికి అనుసంధానమయ్యే ముఖ్యమైన మార్గం. ప్రతిరోజూ వేలాది వాహనాలు ఈ వంతెనపై రాకపోకలు సాగిస్తాయి. వంతెన ప్రారంభోత్సవం పలుమార్లు వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు ప్రారంభమైంది.

ఈ బ్రిడ్జిని పనుల్ని విశాఖపట్నం పశ్చిమం ఎమ్మెల్యే గణబాబు పరిశీలించారు.. ఈ క్రమంలో బ్రిడ్జిపై లోడ్ టెస్ట్ ప్రక్రియను మూడు రోజుల పాటూ నిర్వహించారు. అనంతరం పెయింటింగ్ పనులు పూర్తి చేసి మంగళవారం రాత్రి ట్రయల్ రన్ నిర్వహించి బుధవారం అందుబాటులోకి తెచ్చారు. నేటి నుంచి పూర్తిస్థాయిలో ప్రయాణాలకు అనుమతిస్తున్నారు.ఆగస్టు 1, 2024న వంతెనను మూసివేశారు. ఈ వంతెన నిర్మాణం కోసం ఆగస్టు 1, 2024 నుంచి పనులు మొదలయ్యాయి. తొమ్మిది నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా, అనుకోని అడ్డంకుల వల్ల ఆలస్యం జరిగింది. ఈ ప్రాజెక్టుకు రూ.30 కోట్ల ఖర్చు అయింది. గుజరాత్‌కు చెందిన హార్డ్‌వేర్ టూల్స్ అండ్ మిషనరీ ప్రాజెక్ట్స్ అనే సంస్థ ఈ నిర్మాణాన్ని పూర్తి చేసింది. వంతెన ప్రారంభానికి ముందు, ఈ నెల 10, 11 తేదీలలో నిపుణులు వంతెనపై లోడింగ్ ట్రయల్ రన్ నిర్వహించారు. వంతెన పటిష్టంగా ఉందని నిర్ధారించుకున్నాకే, ప్రారంభానికి అనుమతి ఇచ్చారు. ఈ పరీక్షల ఫలితాల ఆధారంగా, పోర్టు అధికారులు బుధవారం వంతెనను ప్రజల వినియోగం కోసం తెరుస్తున్నట్లు అధికారికంగా తెలిపారు.సముద్రంపై నిర్మించిన వంతెన 330 మీటర్ల పొడవు, 10.5 మీటర్ల వెడల్పుతో ఉంది. ఈ వంతెన నిర్మాణంలో ఎలక్ట్రో మాగ్నెటెక్ బేరింగులను ఉపయోగించారు. ఇవి ఈ బ్రిడ్జి మరింత బలంగా, సురక్షితంగా ఉండేలా చేస్తాయి. ఈ బ్రిడ్జి సముద్రం పైన ఉండటం వల్ల, గాలిలో ఉండే ఉప్పు కణాల ప్రభావం వంతెన నిర్మాణ సామగ్రిపై పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అందుకే, విదేశాల నుంచి తెప్పించిన ప్రత్యేకమైన పెయింట్లను ఇనుముకు వేశారు. రాత్రి వేళల్లో వాహనాలు, ప్రజలు సులభంగా ప్రయాణించడానికి వీలుగా వంతెనపై 15 విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. దీంతో చీకటి పడినా రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.అంతేకాకుండా, ప్రజలు నడుచుకుంటూ వెళ్లడానికి వీలుగా ప్రత్యేకంగా ఫుట్‌పాత్‌ను నిర్మించారు. ఈ ఫుట్‌పాత్ కిందనే విద్యుత్ కేబుల్స్ వేయడానికి అవసరమైన ట్రాక్‌లను కూడా సిద్ధం చేశారు. ఈ బ్రిడ్జి పై నుంచి ఇండస్ట్రియల్ ఏరియా ప్రజలు ఎస్ఆర్ కంపెనీ మీదుగా కాన్వెంట్ వంతెనకు వెళ్లొచ్చు. అయితే వాహనాలు తిరిగి వచ్చేటప్పుడు జ్ఞానాపురం దాటిన అనంతరం రామ్మూర్తిపంతులు పేట మీదుగా డాక్‌యార్డు క్వార్టర్స్ మార్గంలో బ్రిడ్జిపైకి వస్తారు. అక్కడి నుంచి ఇండస్ట్రియల్ ఏరియాకు చేరుకోవచ్చు. ఈ బ్రిడ్జి అందుబాటులోకి రావడంతో దాదాపు ఆరు కిలోమీటర్ల దూరం కూడా తగ్గనుంది.

# మారనున్న కాకినాడ దిశ


**కాకినాడ, నవంబర్ 14, పెన్ పవర్:**
కాకినాడ జిల్లాలో ఏఎం గ్రీన్ సంస్థ భారీ పెట్టుబడులు పెట్టనుంది. ఉప్పాడ సమీపంలో రూ.44 వేల కోట్లతో గ్రీన్ అల్యూమినియం స్మెల్టర్ పరిశ్రమ ఏర్పాటు కానుంది. ఇది పర్యావరణ హితంగా, పునరుత్పాదక ఇంధనంతో నడుస్తుంది. ఈ ప్రాజెక్టుతో 3 వేల మందికి ఉపాధి లభించనుంది. ప్రభుత్వం భూమి, విద్యుత్, నీటి సరఫరాలో రాయితీలు మంజూరు చేసింది. పరిశ్రమకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు కొనసాగుతున్నాయి.. ఆయా జిల్లాల వారీగా పరిశ్రమలు క్యూ కడుతున్నాయి. తాజాగా కాకినాడ జిల్లాలో ఏఎం గ్రీన్ సంస్థకు చెందిన ఏఎంజీ మెటల్ అండ్ మెటీరియల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఏర్పాటు చేయబోతోంది. ఈ కొత్త పరిశ్రమ ఉప్పాడకు సమీపంలో రాబోతోంది. గ్రీన్ అల్యూమినియం స్మెల్టర్ పరిశ్రమను సుమారు వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తారు. దీని కోసం రూ.44 వేల కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇది గ్రీన్ అల్యూమినియం స్మెల్టర్ పరిశ్రమ. అల్యూమినియంను తయారుచేసే ఈ పరిశ్రమ పర్యావరణానికి హాని కలిగించకుండా ఉండేలా రూపొందిస్తున్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన భూములను కొనుగోలు చేయడానికి, మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం రాయితీలు మంజూరు చేసింది. ఈ విషయమై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పరిశ్రమ రెండు దశల్లో పూర్తికానుంది.. ఈ పరిశ్రమ ద్వారా 3 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.ఏఎం గ్రీన్ కంపెనీ,




నెదర్లాండ్స్‌కు చెందిన ఏఎంజీ మెటల్ భాగస్వామ్యంతో, రూ.10,050 కోట్ల పెట్టుబడితో గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ అల్యూమినియం తయారీ పరిశ్రమలను ఏర్పాటు చేయనుంది. ఏఎం గ్రీన్ కంపెనీ ఏడాదికి రెండు మిలియన్ టన్నుల గ్రీన్ అమ్మోనియాను ఉత్పత్తి చేయనుంది. ఈ ప్రాజెక్టుకు ఇటీవల రాయితీలు కూడా మంజూరు అయ్యాయి. గ్రీన్ అమ్మోనియా అంటే పర్యావరణానికి హాని చేయని పద్ధతుల్లో తయారుచేసే అమ్మోనియా. ఇక ఏఎంజీ మెటల్, నెదర్లాండ్స్ కంపెనీ భాగస్వామ్యంతో ఏడాదికి ఒక మిలియన్ టన్నుల గ్రీన్ అల్యూమినియం స్మెల్టర్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేయనున్నారు.ఈ పరిశ్రమ పూర్తిగా పునరుత్పాదక ఇంధన వనరులైన సౌర, పవన విద్యుత్‌తోనే నడుస్తుంది. దీనివల్ల పర్యావరణానికి హాని కలిగే అవకాశం లేదని తెలుస్తోంది. ఈ పరిశ్రమల ఏర్పాటు కోసం ఏఎం గ్రీన్ కంపెనీ ఇప్పటికే నేమాం వద్ద మూతపడిన స్పెక్ట్రం పవర్ జనరేషన్ కంపెనీకి చెందిన సుమారు 800 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. ఇప్పుడు అందులోనే ఈ కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. ఈ ప్రాజెక్టుల విస్తరణకు అదనంగా మరో 250 ఎకరాల భూమి అవసరమని భావించి, దాని కోసం ప్రభుత్వాన్ని కోరింది.గ్రీన్ అల్యూమినియం స్మెల్టర్ పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం 250 ఎకరాల భూమిని మార్కెట్ ధరకు అందిస్తోంది. గ్రీన్ కారిడార్ ద్వారా 2000–2,500 మెగావాట్ల విద్యుత్ కనెక్షన్, రోజుకు 1.75 కోట్ల లీటర్ల నీటిని సరఫరా చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని సంబంధిత శాఖలు సింగిల్ డెస్క్ విధానంలో అనుమతులు మంజూరు చేయాలి. అలాగే ఈ పరిశ్రమకు విద్యుత్ డ్యూటీ, మూలధన పెట్టుబడిపై రాయితీలు ఇవ్వాలి. నీటి సరఫరా ఛార్జీలను తగ్గించాలి. స్టాంపు డ్యూటీ నుంచి మినహాయింపుతో పాటు ఇతర ప్రోత్సాహకాలను కూడా అందించాల్సి ఉంటుంది.

# పాత జిల్లాల్లోనే కలపడం, మండలాల్లో మార్పులపై ఫోకస్

**ఒంగోలు, నవంబర్ 14, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జిల్లాల పునర్వ్యవస్థీకరణపై దృష్టి సారించింది. అద్దంకి నియోజకవర్గాన్ని బాపట్ల జిల్లా నుంచి వేరు చేసి, తిరిగి ప్రకాశం జిల్లాలో కలపడానికి కసరత్తు మొదలైంది. మార్కాపురం జిల్లా ఏర్పాటు, కందుకూరును ప్రకాశంలో కలపడం వంటి అంశాలపై కూడా ప్రభుత్వ యంత్రాంగం చురుగ్గా పనిచేస్తోంది. ప్రజల విజ్ఞప్తులకు అనుగుణంగా ఈ మార్పులు దిశగా అడుగులుపడుతున్నాయి. త్వరలోనే దీనిపై పూర్తిస్థాయిలో క్లారిటీ రానుంది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటు, ఆయా నియోజకవర్గాలను మళ్లీ పాత జిల్లాల్లోనే కలపడం, మండలాల్లో మార్పులపై ఫోకస్ పెట్టింది. ఇప్పటికే మంత్రులుతో కమిటీని కూడా ఏర్పాటు చేశారు. తాజాగా ఓ కొత్త జిల్లా ఏర్పాటుతో పాటుగా రెండు నియోజకవర్గాలను మళ్లీ పాత జిల్లాలోకే కలిపే దిశగా అడుగులు పడుతున్నాయి. ఏపీ విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న అద్దంకి నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో చేర్చే ప్రక్రియ మొదలైంది. బాపట్ల జిల్లా నుంచి అద్దంకిని వేరు చేసి ప్రకాశంలో కలపడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీసీఎల్ఏ జయలక్ష్మి, కలెక్టర్ వినోద్‌కుమార్‌ను ఆదేశించారు.అమరావతి నుంచి సీసీఎల్ఏ జయలక్ష్మి, కార్యదర్శి వెంకటమురళి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అద్దంకి ప్రాంత సరిహద్దులను స్పష్టంగా నిర్ణయించి, సమగ్ర నివేదికను రెండు రోజుల్లో పంపాలని బాపట్ల కలెక్టర్‌కు సూచనలు అందాయి. ప్రస్తుతం బాపట్ల జిల్లా సరిహద్దులు, అద్దంకిని వేరు చేసే అంశంపై సాధ్యాసాధ్యాలను వివరిస్తూ నివేదికను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ మేరకు రెండు రోజుల్లో సమగ్ర నివేదికను బాపట్ల కలెక్టర్ సమర్పించాలని సూచించారు.గత ప్రభుత్వ హయాంలో కొత్త జిల్లాల ఏర్పాటు జరిగింది. 2022 ఏప్రిల్ 4న ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని అద్దంకి, పర్చూరు, చీరాల నియోజకవర్గాలను.. అలాగే ఉమ్మడి గుంటూరు జిల్లాలోని




వేమూరు, రేపల్లె, బాపట్ల నియోజవర్గాలను కలిపి బాపట్ల జిల్లాగా ఏర్పాటు చేశారు. బాపట్ల లోక్‌సభ స్థానం పరిధిలో ఉన్న సంతనూతల పాడు నియోజకవర్గాన్ని మాత్రం ప్రకాశం జిల్లాలోనే కొనసాగించారు. అయితే అద్దంకి నియోజకవర్గంలో నారా లోకేశ్ యువగళం పాదయాత్ర జరిగిన సమయంలో ఆ ప్రాంత ప్రజలు తమ సమస్యను చెప్పుకున్నారు. జిల్లా కేంద్రం బాపట్ల తమకు 70 కి.మీ. దూరంలో ఉందని.. అద్దంకి నుంచి బాపట్ల వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందన్నారు. అద్దంకిని మళ్లీ ప్రకాశం జిల్లాలో కలపాలని కోరారు. తమకు ప్రకాశం జిల్లా కేంద్రం ఒంగోలు దగ్గరగా ఉంటుందన్నారు. అద్దంకి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్ కూడా ఈ అంశంపై హామీ ఇచ్చారు.. ఇప్పుడు ఆ దిశగా అడుగులు పడుతున్నాయి.మరోవైపు మార్కాపురం జిల్లా ఏర్పాటుకు సంబంధించి ప్రకాశం కలెక్టర్ రాజాబాబుకు.. అలాగే కందుకూరు, అద్దంకి నియోజకవర్గాలను తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపేందుకు అవసరమైన నివేదికను ఇవ్వాలని నెల్లూరు, బాపట్ల కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. కలెక్టర్లు, జేసీలు, ఇతర ముఖ్య రెవెన్యూ అధికారులతో సీసీఎల్ఏ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ విషయమై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు అంశంపై కూడా కూటమి హామీ ఇచ్చింది. ఈ మేరకు ఆ దిశగా కసరత్తు చేస్తున్నారు. అలాగే కందుకూరును కూడా ప్రకాశం జిల్లాలోనే కొనసాగించాలని.. యువగళం పాదయాత్ర సందర్భంగా జిల్లాకు వచ్చిన ప్రస్తుత మంత్రి నారా లోకేష్ ను స్థానిక ప్రజలు కోరారు. అందుకే కందుకూరును తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపే కసరత్తు జరుగుతోంది.మార్కాపురం జిల్లా ఏర్పాటు విషయానికి వస్తే.. మార్కాపురంతో పాటుగా గిద్దలూరు, కనిగిరి, దర్శి, యర్రగొండపాలెం అసెంబ్లీ నియోజకవర్గాలను కలిపి కొత్త జిల్లాగా ఏర్పాటు చేయాలని డిమాండ్ ఉంది. ఈ మేరకు కొత్త జిల్లాకు సంబంధించి.. ప్రభుత్వ భూములు, అటవీశాఖ భూములు, నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల వారీ, భూపరమైన హద్దులను తెలిపే నివేదికలను పంపాలని ఆదేశించారట. కలెక్టర్లను రెండు, మూడు రోజుల్లోనే నివేదికలు ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించారట. మొత్తం మీద ఉమ్మడి ప్రకాశం జిల్లాకు సంబంధించి మార్పులపై కసరత్తు జరుగుతోంది.

# ఆల్ రౌండ్ షో తో అదరగొట్టిన టీమిండియా..
# సౌతాఫ్రికాపై తొలి రోజే పట్టు




**హైదరాబాద్ పెన్ పవర్:** ఈడెన్ గార్డెన్స్ వేదికగా సౌతాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టులో టీమిండియా తొలి రోజు పూర్తి ఆధిపత్యం చూపించింది. శుక్రవారం (నవంబర్ 14) జరిగిన తొలి రోజు ఆటలో బౌలింగ్ లో అదరగొట్టి సఫారీలను తక్కువ స్కోర్ కే ఆలౌట్ చేసిన టీమిండియా.. బ్యాటింగ్ లో నిలకడగా ఆడుతోంది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత జట్టు వికెట్ నష్టానికి 37 పరుగులు చేసింది. క్రీజ్ లో రాహుల్ (13), వాషింగ్ టన్ సుందర్ (6) ఉన్నారు. ప్రస్తుతం గిల్ సేన తొలి ఇన్నింగ్స్ లో 122 పరుగులు వెనకబడి ఉంది. వెలుతురు మందగించడంతో మరో 15 ఓవర్లు మిగిలి ఉండగానే తొలి రోజు ఆటను నిలిపివేశారు. సౌతాఫ్రికాను 159 పరుగులకే ఆలౌట్ చేసి బ్యాటింగ్ కు దిగిన ఇండియా ఆచితూచి ఇన్నింగ్స్ ఆరంభించింది. సఫారీ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో పరుగులు చేయడానికి ఓపెనర్లు రాహుల్, జైశ్వాల్ ఇబ్బందిపడ్డారు. ఇద్దరూ కూడా పూర్తిగా డిఫెన్స్ కే పరిమితమయ్యారు. భారత ఓపెనర్లను ఒత్తిడిలో పడేసిన సౌతాఫ్రికా.. జైశ్వాల్ వికెట్ రాబట్టుకుంది. మార్కో జాన్సెన్ బంతిని కట్ చేయబోయి జైశ్వాల్ క్లీన్ బౌల్డయ్యాడు. దీంతో 18 పరుగుల వద్ద ఇండియా తొలి వికెట్ కోల్పోయింది. మూడో స్థానంలో బ్యాటింగ్ కు వచ్చిన సుందర్ తో కలిసి రాహుల్ మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడుతూ రోజు ముగించారు.

**159 పరుగులకే సౌతాఫ్రికా ఆలౌట్:**

టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా స్వల్ప స్కోర్ కే పరిమితమైంది. జస్ప్రీత్ బుమ్రా ఐదు వికెట్లతో చెలరేగడంతో తొలి ఇన్నింగ్స్ లో సౌతాఫ్రికా కేవలం 159 పరుగులకే ఆలౌటైంది. 31 పరుగులు చేసిన మార్క్రామ్ టాప్ స్కోరర్ గా నిలిచాడు. సఫారీ ఆటగాళ్లలో ఒక్కరు కూడా హాఫ్ సెంచరీ చేయకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. టీమిండియా బౌలర్లలో బుమ్రా ఐదు వికెట్లు పడగొట్టాడు. కుల్దీప్ యాదవ్, మహమ్మద్ సిరాజ్ తలో రెండు వికెట్లు తీసుకున్నారు. అక్షర్ పటేల్ కు ఒక వికెట్ దక్కింది. సఫారీ ఓపెనర్లు ఐడెన్ మార్క్రామ్ (31), ర్యాన్ రికెల్టన్ (23) తొలి వికెట్ కు మంచి ఆరంభం ఇచ్చారు. బుమ్రా విజృంభించడంతో మూడు వికెట్ల నష్టానికి 105 పరుగులతో తొలి సెషన్ ముగించింది. లంచ్ తర్వాత రెండో సెషన్ ప్రారంభించిన సౌతాఫ్రికా పూర్తిగా విఫలమైంది. ఈ సెషన్ లో ఐదు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ప్రారంభంలోనే వికెట్లు కోల్పోవడంతో 120 పరుగుల వద్ద సఫారీలు సగం జట్టును కోల్పోయింది. టీ విరామానికి ముందు సిరాజ్ వరుసగా రెండు వికెట్లు తీయడంతో 8 వికెట్ల నష్టానికి 154 పరుగులతో సౌతాఫ్రికా టీ విరామానికి వెళ్ళింది. 8 వికెట్ల నష్టానికి 154 పరుగులతో చివరి సెషన్ ప్రారంభించిన సౌతాఫ్రికా.. చివరి రెండు వికెట్లను 5 పరుగుల వ్యవధిలో కోల్పోయింది.

# బీసీసీఐని వారం రోజులు సెలవులు కోరిన కుల్దీప్.. సౌతాఫ్రికాతో రెండో టెస్టుకు దూరం





**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా స్టార్ సిన్నర్ కుల్దీప్ యాదవ్ సౌతాఫ్రికాతో రెండో టెస్టుకు దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. నవంబర్ నెలాఖరులో ఈ మిస్టరీ స్పిన్నర్ వివాహం కావడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. ఈ సంవత్సరం ప్రారంభంలో తన చిన్ననాటి స్నేహితురాలితో నిశ్చితార్థం చేసుకున్న కుల్దీప్.. ఈ నెలాఖరులో పెళ్లి పీటలు ఎక్కబోతున్నట్టు సమాచారం. రిపోర్ట్స్ ప్రకారం కుల్దీప్ యాదవ్ తనను భారత జట్టులో నుంచి రిలీజ్ చేయాలని బీసీసీఐని కోరినట్టు వార్తలు వస్తున్నాయి. నవంబర్ చివరి వారంలో తనకు ఒక వారం పాటు సెలవులు కావాలని రిక్వెస్ట్ చేసాడట. నవంబర్ చివరి వారంలో టీమిండియా సౌతాఫ్రికాతో రెండో టెస్టుతో పాటు ఒక వన్డే ఆడుతుంది. ఈ రెండు మ్యాచ్ లకు కుల్దీప్ దూరమయ్యే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నవంబర్ 22 నుంచి గౌహతిలో సౌతాఫ్రికాతో రెండో టెస్ట్.. నవంబర్ 30న రాంచీలో తొలి వన్డే ప్రారంభమవుతుంది. కుల్దీప్ రిక్వెస్ట్ పై జట్టు యాజమాన్యం ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. అతని సేవలు జట్టుకు ఎప్పుడు, ఎలా అవసరమో ఆలోచించి సెలవులు మంజూరు చేయబడతాయనే టాక్ ఉంది. “కుల్దీప్ వివాహం నవంబర్ చివరి వారంలో జరగనుంది. అతనికి ఖచ్చితమైన సెలవుల సంఖ్యను మంజూరు చేసే ముందు అతని సేవలు ఎప్పుడు అవసరమో జట్టు యాజమాన్యం అంచనా వేస్తుంది”. అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి

ఇటీవలే ఆస్ట్రేలియాతో 5 మ్యాచ్ ల టీ20 సిరీస్ లో భాగంగా చివరి రెండు మ్యాచ్ లకు కుల్దీప్ యాదవ్ జట్టుకు దూరమయ్యాడు. సౌతాఫ్రికాతో జరగనున్న టెస్ట్ సిరీస్ కోసం ఇండియా టీ20 జట్టు నుంచి రిలీజ్ చేశారు. ఇండియా ఎ, సౌతాఫ్రికా ఎ జట్ల మధ్య జరగబోయే రెండో అనధికారిక టెస్ట్ లో కుల్దీప్ ఆడిన కుల్దీప్.. శుక్రవారం (నవంబర్ 14) సౌతాఫ్రికాతో ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో రెండు వికెట్లు తీసి సత్తా చాటాడు. ఇటీవలే వెస్టిండీస్ తో జరిగిన రెండు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ లో ఈ చైనా మన్ స్పిన్నర్ 12 వికెట్లు తీసి అద్భుతంగా రాణించాడు. ఒకవేళ కుల్దీప్ ని రిలీజ్ చేస్తే అతని స్థానంలో ఎవరిని ఎంపిక చేస్తారో చూడాలి.

# బుమ్రా దెబ్బకు సఫారీలు విలవిల.. 159 పరుగులకే ఆలౌట్



- తొలి టెస్టులో చెలరేగిన పేసర్ జస్ప్రీత్ బుమ్రా
- కేవలం 27 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టిన భారత స్టార్
- తొలి ఇన్నింగ్స్‌లో 159 పరుగులకే దక్షిణాఫ్రికా ఆలౌట్
- టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సఫారీలకు ఎదురుదెబ్బ
- ఒక దశలో 57/0.. ఆ తర్వాత 102 పరుగులకే 10 వికెట్లు
- సిరాజ్, కుల్దీప్ యాదవ్‌లకు చెరో రెండు వికెట్లు

**హైదరాబాద్ పెన్ పవర్:** దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టు మొదటి రోజే టీమిండియా పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. భారత పేస్ గుర్రం జస్ప్రీత్ బుమ్రా నిప్పులు చెరిగే బంతులతో చెలరేగడంతో సఫారీ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 159 పరుగులకే కుప్పకూలింది. కోల్ కతా ఈడెన్ గార్డెన్స్ వేదికగా శుక్రవారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో బుమ్రా 27 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టి దక్షిణాఫ్రికా పతనాన్ని శాసించాడు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికాకు ఓపెనర్లు రియాన్ రికెల్టన్ (23), ఐడెన్ మార్‌క్రమ్ (31) శుభారంభం అందించారు. తొలి వికెట్‌కు 57 పరుగులు జోడించి పటిష్ట స్థితిలో నిలిపారు. అయితే బుమ్రా.. సఫారీల ఆశలను ఆవిరి చేశాడు. ఒకే స్పెల్‌లో ఇద్దరు ఓపెనర్లను పెవిలియన్ చేర్చడంతో దక్షిణాఫ్రికా పతనం మొదలైంది. ఆ తర్వాత మిగతా బౌలర్లు కూడా రాణించడంతో దక్షిణాఫ్రికా కోలుకోలేకపోయింది. మహమ్మద్ సిరాజ్, కుల్దీప్ యాదవ్ చెరో రెండు వికెట్లు తీయగా, అక్షర్ పటేల్‌కు ఒక వికెట్ దక్కింది. సఫారీ మిడిలార్డర్ బ్యాటర్లు భారత బౌలర్ల ధాటికి క్రీజులో నిలవలేకపోయారు. టీ విరామం తర్వాత బుమ్రా మరింత విజృంభించి టెయిలెండర్ల పనిపట్టాడు. తన అద్భుతమైన బౌలింగ్‌తో టెస్టుల్లో 16వ సారి ఐదు వికెట్ల ఘనతను అందుకున్నాడు. టాస్ గెలిచిన ప్రయోజనాన్ని దక్షిణాఫ్రికా సద్వినియోగం చేసుకోలేకపోగా, తొలి రోజే మ్యాచ్‌పై భారత్ పట్టు బిగించింది.

# మహేష్ లుక్ ముందే రానుందా?



శ్వేతా తివారీ చిక్ మెరూన్ డ్రెస్‌లో తల తిప్పింది





జాక్వెలిన్ ఫెర్నాండెజ్ ఎప్పుడూ షోస్టాపర్

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు.. ఇప్పుడు దర్శక ధీరుడు రాజమౌళితో వర్క్ చేస్తున్న విషయం తెలిసిందే. పాన్ వరల్డ్ రేంజ్ లో భారీ బడ్జెట్ తో పెద్ద ఎత్తున రూపొందుతున్న ఆ మూవీని గ్లోబ్ ట్రాటర్ అంటూ మేకర్స్ ప్రమోట్ చేస్తుండగా.. ఇప్పటికే ఆడియన్స్ లో మంచి అంచనాలు నెలకొన్నాయి. అది కూడా హై రేంజ్ లో ఉన్నాయని చెప్పాలి. ముఖ్యంగా గ్లోబ్ ట్రాటర్ నుంచి వచ్చే ప్రతి చిన్న అప్డేట్ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రీసెంట్ గా మాలీవుడ్ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ తోపాటు స్టార్ హీరోయిన్ ప్రియాంక చోప్రా లుక్స్ ను రిలీజ్ చేయగా.. సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ గా మారాయి. అనేక మంది సినీ ప్రియుల దృష్టిని కూడా ఆకర్షించాయి. అయితే ఇప్పుడు అందరి ఫోకస్ మహేష్ బాబు లుక్ పైనే ఉంది. ఎందుకంటే కొన్ని నెలల క్రితం రాజమౌళి రిలీజ్ చేసిన ప్రీ లుక్ పోస్టర్ మంచి రెస్పాన్స్ అందుకుంది. దీంతో ఆయన అవతార్.. ఎలా ఉండబోతుందోనన్న ఉత్సుకత ఇప్పుడు ప్రతి ఒక్క ఫ్యాన్ తోపాటు సినీ ప్రియుల్లో కనిపిస్తుంది. ఎంతో ఈగర్ గా అంతా వెయిట్ చేస్తున్నారు. ముఖ్యంగా మహేష్ బాబు లుక్ ఎలా ఉంటుందోనని.. ఆయన పాత్ర పేరు ఏమై ఉంటుందోనని సోషల్ మీడియాలో తెగ డిస్కస్ చేసుకుంటున్నారు. అయితే మహేష్ లుక్.. శుక్రవారం విడుదల అయ్యే అవకాశం ఉందని ఇప్పుడు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అంటే ఈవెంట్ కు ఒక ముందు రోజు గానే రిలీజ్ చేయనున్నారని సమాచారం. నిజానికి.. నవంబర్ 15వ తేదీన హైదరాబాద్ లోని రామోజీ ఫిల్మ్ సిటీలో భారీ ఈవెంట్ జరగనుంది. అందుకు ఇప్పటికే ఏర్పాట్లు జరుగుతుండగా.. ఈవెంట్ లో టైటిల్ ను రివీల్ చేస్తారని సమాచారం. ఆ సమయంలో మహేష్ ఫస్ట్ లుక్ ను రిలీజ్ చేస్తారని వార్తలు రాగా.. ఇప్పుడు ముందు రోజే విడుదలఅవ్వనుందని తెలుస్తోంది. ఏదేమైనా, రాజమౌళి- మహేష్ బాబు కాంబినేషన్ లో వస్తున్న ప్రాజెక్ట్ నుంచి సూపర్ స్టార్ లుక్ కోసం ఆయన ఫ్యాన్స్ ఆతృతగా కౌంట్ డౌన్ కూడా మొదలుపెట్టేశారు. ఇప్పటికే జక్కన్న పక్కా ప్లాన్ తో సిద్ధమైనట్లు తెలుస్తోంది. రాజమౌళి ఎప్పుడూ తన సినిమాల విషయంలో అద్భుతమైన ప్రెజెంటేషన్ ఇస్తారు. కాబట్టి మహేష్ బాబు లుక్ కూడా ప్రత్యేకంగా ఉంటుందని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు. మరి చూడాలి ఏం జరుగుతుందో.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com